
www.andhrajyothy.com vizianagaram

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



16

విజయనగరం

బుధవారం 2 ఆగస్టు 2017




'పరిశ్రమలు వచ్చేస్తున్నాయ్...ఉపాధి మీ చేతిలోనే...'అని ప్రభుత్వ ప్రకటిస్తే అక్కడి జనం నిజమేననుకున్నారు. అడిగిందే తడవుగా భూములు ఇచ్చేశారు. ఉద్యోగాలొచ్చేస్తాయ్..భవిష్యత్తుకు ఢోకా ఉండదని కలలు కన్నారు. భూములు పొందిన వరకూ గాబరా పడిన యాజమాన్యాలు...ఆ తరువాత ఇటు చూడడం మానేశాయి. పరిశ్రమల మాట మరచిపోయాయి. కొందరు పరిశ్రమలు స్థాపించినా మూన్నాళ్ల ముచ్చటే అయింది. మూడు దశాబ్దాలు కావస్తున్నా ఇక్కడి వారికి ఉపాధి కలగానే మిగిలిపోయింది. ఏమాత్రం 'గ్రోత్' లేక...దయనీయంగా బతుకులీడుస్తున్నారు. ఇదీ బొబ్బిలి గ్రోత్ సెంటర్ దుస్థితి.

- లక్ష్యానికి దూరంగా బొబ్బిలి గ్రోత్ సెంటర్
- పరిశ్రమలు రాక.. ఉపాధి లేక
- వంద పరిశ్రమలకు ఇచ్చిన స్థలాల రద్దుకు ఏపీఐఐసీ నోటీసులు
- కోర్టుకు వెళ్లిన యాజమాన్యాలు
- ఉపాధి కోసం 30 ఏళ్లుగా స్థానికుల ఎదురుచూపులు

గ్రోత్ లేదు





(బొబ్బిలి)

ఏపీఐఐసీ పర్యవేక్షణలో ఉన్న బొబ్బిలి పారిశ్రామిక అభివృద్ధి కేంద్రం(గ్రోత్‌సెంటర్) అభివృద్ధి లేకుండా పోతోంది. కొత్త పరిశ్రమలు రాక.. ఇప్పటికే భూములు పొందిన వారు పరిశ్రమలు ఏర్పాటు చేయక.. ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. పరిశ్రమల స్థాపన కోసం భూములు తీసుకున్న పారిశ్రామిక వేత్తలు సకాలంలో వాటిని ఏర్పాటు చేయకపోవడంతో ఏపీఐఐసీ అధికారులు వారికి ఇచ్చిన భూములపై హక్కులను రద్దు చేస్తూ కొన్నాళ్ల కిందట నిర్ణయం తీసుకున్నారు. రెండు నెలల కిందట నోటీసులు ఇచ్చారు. దీనిపై స్పందించిన బీకే స్టీల్స్, మాయిల్, విశాఖ స్టీల్స్ తమకు ఇచ్చిన వ్యవధి కాలాన్ని మరింత పెంచాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. విశాఖ స్టీల్సుకు 80 ఎకరాలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన మాయిల్ సంస్థకు 112 ఎకరాలు, బీకే స్టీల్సుకు 245 ఎకరాలు అప్పట్లో ఏపీఐఐసీ అధికారులు కేటాయించారు. అయితే ఏళ్లు గడుస్తున్నా వీరు పరిశ్రమలు స్థాపించకపోవడంతో ఈ సంస్థలకు అనేకసార్లు నోటీసులు కూడా- మిగతా 14లో

వర్షాభారం

- ఖరీఫ్ సాగుపై రైతుల ఆందోళన 14లో
- జూన్, జూలైలో తక్కువ వర్షపాతం
- విజయనగరం మండలంలో అత్యల్పం
- ఇప్పటి వరకూ 5,204 హెక్టార్లలోనే సాగు
- నేడు వ్యవసాయ శాఖ అధికారుల సమావేశం

రుతు పవనాలు ప్రవేశించి దాదాపు రెండు నెలలైనా సరైన వర్షాలు లేకపోవడంతో ఎండుతున్న నారు చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. చాలా మండలాల్లో దమ్ములు పట్టలేదు. నారును బతికించుకునేందుకే నానా పాట్లు పడుతున్నారు. విజయనగరం మండల పరిధిలో పరిస్థితి దారుణంగా తయారైంది. చిన్న వర్షం కురిసినా నాట్లు వేద్దామని రైతులు ఎదురుచూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 5,204 హెక్టార్లలోనే నాట్లు పడ్డాయి. జూన్, జూలై నెలల్లో గతం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. మరో వారం రోజుల పాటు చూసి ఆపై ప్రత్యామ్నాయం చూసుకోవాలని అన్నదాతలు భావిస్తున్నారు. అధికారులు కూడా ఇదే తరహా సూచన ఇస్తున్నారు. (కలెక్టరేట్)



గంట్యాడలో ఎండిన వరి నారు

7లో

11న జిల్లాకు మంత్రి లోకేష్


- ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు హాజరు
- ఇప్పటికే పార్టీ నాయకులకు సమాచారం



16లో

రెండు వ్యాధులకు ఒకే టీకా

- రూ.130 కోట్లతో 30 కొండ శిఖర గ్రామాలకు రహదారులు
- ఉపాధి హామీ, ప్రత్యేక నిధులు మంజూరు
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ఇంజినీరింగ్ అధికారులు



10లో

'గిరికి' బాటలు



కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న సారిపల్లి గ్రామస్థులు

ప్రాణాలైనా అర్పిస్తాం

- ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాల్సిందే..
- లేదంటే 'తారకరామ' డిజైన్ మార్చండి
- కలెక్టర్‌కు తేల్చి చెప్పిన సారిపల్లి గ్రామస్తులు
- రిజర్వాయర్ పనులను పరిశీలించిన వివేక్‌యాదవ్

(నెల్లిమర్ల)

'ముందు నుంచీ చెబుతూనే ఉన్నాం. మా మాటను బేఖాతరు చేశారు. మా భూములన్నీ పోయాయి. ఉపాధి లేదు. ఇంకెందుకు మేం ఇక్కడ ఉండి. ఎలా బతకాలి. తారకరామ రిజర్వాయర్ డిజైన్ మార్పు చేయండి. లేదంటే సారిపల్లి గ్రామానికి ఆర్‌అండ్‌అర్ ప్యాకేజీ అమలు చేయండి. ఈ రెండూ లేకపోతే మేమంతా చావడానికైనా సిద్ధం' అని కలెక్టర్ వివేక్‌యాదవ్ వద్ద సారిపల్లి గ్రామస్తులు, రైతులు తేల్చిచెప్పారు. తమ - మిగతా 14లో


లాభాల్లో నెంబర్ 'వన్'కాయ

● ఆకట్టుకుంటున్న వంగ సాగు
● పెరట్లో సేద్యం చేస్తున్న శ్రీనివాసరావు


వంకాయలను చూపుతున్న రైతు శ్రీనివాసరావు

బొబ్బిలి: పట్టణంలోని లక్ష్మి శ్రీనివాస జూట్‌మిల్లు సమీపంలో వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్న శ్రీనివాసరావు తెల్ల వంకాయ సాగుతో అందరినీ ఆలోచింపజేస్తున్నాడు. తన పెరట్లోని కేవలం మూడు సెంట్ల స్థలంలో వంకాయతో పాటు ఇతర కూరగాయలను పండిస్తున్నాడు. వంగ, బెండ, బీర, దొండ, ఆనపకాయలు, గోంగూర వంటి వాటిని సాగు చేస్తూ లాభాలు పొందుతున్నాడు. వాటన్నింటిలో తెల్లవంకాయది ప్రత్యేకం. ఈ తరహా వంకాయలు ఎక్కడా దొరక్కపోవడంతో వాటిని కొనుగోలు చేసేందుకు స్థానికులు ఎగబడుతున్నారు. రుచి కూడా భిన్నంగా ఉందంటూ తీసుకెళ్లేందుకు క్యూ కడుతున్నారు. శ్రీనివాసరావు తన వాటర్‌ప్లాంట్ ద్వారా వృథాగా పోతున్న వృథా నీటిని సేద్యానికి మళ్లిస్తూ కొద్దిపాటి భూమిలోనే అధిక దిగుబడి సాధిస్తున్నాడు. ప్రతిరోజు కూరగాయల సాగుకు నీరు కడుతూ పక్కనే నర్సరీ ఏర్పాటు చేసి వివిధ మొక్కలను విక్రయిస్తున్నాడు. ఈ సందర్భంగా రైతు శ్రీనివాసరావు మాట్లాడుతూ తనది తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం అని, బొబ్బిలిలో నర్సరీ ఏర్పాటు చేస్తూ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ వ్యర్థనీటిని పంటలకు మళ్లించి కూరగాయలు సాగు చేస్తున్నానని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా లంక ప్రాంతంలో పండే తెల్ల వంకాయలను తెచ్చి ఇక్కడ సాగు చేస్తున్నానని, మంచి గిరాకీ ఉందని ఆనందంగా చెప్పారు.


తెల్ల వంకాయలు


వంగతోట



కోళ్ల పెంపకంలో.. పైచేయిగా..

ఆయనకు భవంతులు లేవు.. స్థితిమంతుడు అంతకంటే కాదు.. నిరుపేద కుటుంబంలో పుట్టాడు.. డిగ్రీ వరకు చదువుకున్నాడు.. జీవితంలో ఏదో సాధించాలనే తపన.. ఆ యువకుడిని స్వయం ఉపాధి వైపు నడిపించింది.. ఎటువంటి పెట్టుబడుల కోసం ఎదురు చూడకుండా.. మరొకరి సాయం అర్థించకుండా స్వశక్తితో ముందుకెళ్తున్నాడు. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తన భవిష్యత్తును తనే తీర్చిదిద్దుకున్నాడు.. కేవలం కొద్దిపాటి డబ్బులను పెట్టుబడిగా పెట్టి వాకిట్లో పెంచే కోళ్లను వనరులుగా మార్చుకొని అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, గృహిణులు అలవాటుగా పెంచే పెరటి కోళ్ల పెంపకాన్ని వృత్తిగా మార్చుకొని అవకాశాన్ని అందిపుచ్చుకుంటున్నాడు.. ఆయన ఎవరో కాదు.. గజపతినగరం మండలం పాతబగ్గాం గ్రామానికి చెందిన లెంక సూర్యారావు.

యువ

● స్వశక్తితో రాణిస్తున్న సూర్యారావు
● తక్కువ పెట్టుబడితో ప్రారంభం
● మెలకువలతో పెంపకం
● లాభార్జన వైపు పయనం

గజపతినగరంరూరల్

ఆ యువకుడికి నాటు కోళ్ల పెంపకంపై విపరీతమైన ఆసక్తి. వాటినే ఆయన ఉపాధి వనరుగా మార్చుకున్నాడు. ముందుగా తన దగ్గర ఉన్న డబ్బులతో 10నుంచి 14 కోళ్లను కొనుగోలు చేసి నాటుకోళ్ల పెంపకాన్ని ప్రారంభించాడు. ప్రస్తుతం వందల సంఖ్యకు చేరుకుంది. కేవలం నాటుకోళ్లనే కాకుండా గిరిరాజా కోళ్లు, గిన్నెకోళ్లు, కోయిల్ వంటి అనేక రకాల కోళ్లను పెంచుతూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పది మందికి ఉపాధి కల్పించగలుగుతున్నాడు. తనకు నాటుకోళ్ల పెంపకంపై ఉన్న ఆసక్తితో దినదినాభివృద్ధి చెందుతూ కోళ్ల పెంపకంలో తన వ్యాపార సామ్రాజ్యాన్ని పెంచుకుంటున్నాడు. మొదట్లో కోళ్ల విక్రయాలు మండలానికే పరిమితమై.. ఇప్పుడు విశాఖపట్నం వరకు విస్తరించింది. దీంతో నెలకు వేలల్లో ఆదాయం అర్జిస్తున్నాడు.



కోళ్లకు మేత వేస్తున్న దృశ్యం


వల సంరక్షణలో కోళ్ల పెంపకం చేపడుతున్న దృశ్యం

తక్కువ పెట్టుబడి.. ఎక్కువ ఆదాయం

తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం నాటుకోళ్ల పెంపకం ద్వారా సాధ్యమని ఆయన చెబుతున్నారు. నెలకు రూ. 5 వేల వరకు ఖర్చు అవుతోందని, తన పొలంలో పండిన ధాన్యం ద్వారా వచ్చే తౌడు, నూకలు, జొన్నలు కొనుగోలు చేసి వాటికి మేతగా వేస్తున్నట్టు ఆయన తెలిపారు. స్వంత స్థలంలో కోళ్ల పెంపకం చేపట్టడం వల్ల ఎటువంటి ఖర్చు లేదని, ప్రతి పదిహేను రోజులకొకసారి విశాఖపట్నంలో అమ్మకాలు సాగిస్తున్నారు. కిలో కోడి రూ. 350నుంచి 400వరకు పలుకగా, తద్వారా నెలకు రూ. 15వేల నుంచి 18వేల వరకు ఆదాయం అర్జిస్తున్నారు. విశాఖపట్నంలో నాటుకోళ్లకు మంచి గిరాకీ ఉందని, అక్కడ వ్యాపారులు అడ్వాన్స్‌లు ఇచ్చి కోళ్లను తీసుకెళ్తుంటారని ఆయన అన్నారు. మండలంలోనే కాకుండా విశాఖ జిల్లా వరకు తన పేరు చెప్పుకోవడం ఆనందంగా ఉందని ఆయన అంటున్నారు. పండగలు, వారాలు సందర్భాల్లో అయితే చెప్పలేనంత గిరాకీ ఉంటుందని ఆయన అంటున్నారు.

నాటుకోళ్లపై ఉన్న ఆసక్తితోనే..



చిన్నప్పటి నుంచే నాటుకోళ్ల పెంపకంపై ఆసక్తి ఉండేది. అయితే డిగ్రీ పూర్తిచేయడంతో ఎన్నో ఉపాధి అవకాశాలు కోసం ఎదురు చూశాను. ఇక చేసేది లేక వ్యాపారాలు వైపు మొగ్గు చూపాను. నాటుకోళ్ల పెంపకంపై ఉన్న ఆసక్తితో రూ. 2వేల పెట్టుబడితో మూడేళ్ల కిందట కోళ్ల పెంపకం ప్రారంభించాను. వాటి ఉత్పత్తిని పెంచుకుంటూ అమ్మకాలు చేపడుతున్నాను. నెలకు సుమారు 18 వేల వరకు ఆదాయం వస్తోంది.

- లెంక.సూర్యారావు, పెంపకందారుడు

రైలులో వెళ్దాం.. పుణ్యక్షేత్రాలు చుట్టేద్దాం..



● అస్తా ఆధ్వర్యంలో యాత్రికులకు స్పెషల్ ట్రైన్ ● సెప్టెంబర్ 8న ప్రారంభం

కొత్తవలస : తీర్థయాత్రలకు వెళ్లే ప్రయాణికుల కోసం సౌతిండియా స్పెషల్ పేరుతో ఇండియన్ రైల్వేకేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (అస్తా) ప్రత్యేక రైలుకు శ్రీకారం చుట్టింది. దక్షిణ భారతదేశంలోని పుణ్యక్షేత్రాలు, యాత్ర స్థలాలను దర్శించుకునేందుకు వీలుగా ఆ సంస్థ ఈ రైలును ఏర్పాటు చేసింది. సెప్టెంబర్ 8 నుంచి 16వ తేదీ వరకు టూర్ ఉంటుందని రైల్వేశాఖ ప్రతినిధులు తెలిపారు. భువనేశ్వర్‌లో ప్రారంభమై ఖుర్దారోడ్డ, బరంపూర్, విజయనగరం, విశాఖపట్టణంలో ఈ ట్రైన్‌కు బోర్డింగ్ సదుపాయం ఉంది. ఇందులో 800 సీట్లు ఉంటాయి. ఈ టూర్‌లో భాగంగా 9రోజులు స్పెషల్ ప్యాకేజ్‌ను రూపొందించింది. ఈ యాత్ర ఎనిమిది రాత్రులు, తొమ్మిది రోజులు సాగనుంది. ఈ ట్రైన్‌లో ఒక్కొక్కరికి టిక్కెట్ ధర రూ. 8,500లుగా నిర్ణయించారు. ఇందులోనే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టీ, రాత్రి భోజనంతో పాటు వసతి సౌకర్యం కూడా కల్పిస్తారు. దీంతో పాటు ప్రయాణికులకు రైల్వే బీమా సౌకర్యం కూడా కల్పించారు.

యాత్ర స్థలాలు ఇవే..

ఈ రైలు విజయనగరం, విశాఖపట్టణం మీదుగా దక్షిణ భారతదేశంలోని రామనాథస్వామి ఆలయం(రామేశ్వరం). మీనాక్షిదేవి ఆలయం(మధురై), వివేకానందా రాక్‌మెమోరియల్, గాంధీ మండపం, కుమారి అమ్మాన్ ఆలయం (కన్యాకుమారి), పద్మనాభస్వామి ఆలయం (త్రివేంద్రం), తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆలయాలకు తీసుకెళ్తుంది.

టిక్కెట్ బుకింగ్ ఇలా..

అస్తా మేనేజర్ క్రాంతి సావర్కర్ 09777440030, 06742303657ను గానీ, www.irctctourism.com ఆన్‌లైన్‌లో టిక్కెట్‌లను బుక్ చేసుకునే వీలుంది.

ప్యాకేజి సదుపాయాలు...

ఈ ట్రైన్ మొత్తం స్లీపర్ క్లాసే ఉంటుంది. అలాగే రాత్రి వేళల్లో నిద్రించేందుకు, కాలకృత్యాలు తీర్చుకునేందుకు సదుపాయాలు కల్పిస్తోంది. అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజనం పూర్తి శాఖాహారంమే ఉంటుంది. దర్శనీయ స్థలాలను నాన్ ఏసీ టూరిస్టు బస్సుల్లో తీసుకెళతారు. ఈ రైలులో అస్తా అధికారులు, ట్రైన్ సూపరింటెండెంట్ ఉంటారు.

ఘాట్‌రోడ్డులో ప్రమాదం

● క్లీనర్ మృతి ● పరారీలో లారీ డ్రైవర్



కొండను ఢీకొట్టిన లారీ (ఇన్‌సెట్లో మృతిచెందిన క్లీనర్ డంగ్రీ)

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు సమీపంలో గల జాతీయ రహదారి ఘాట్‌రోడ్డు ఒకటవ మైలురాయి వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో క్లీనర్ మృతి చెందాడు. ఒడిశా ప్రాంతం చెంబులగుడకు చెందిన మిల్టన్‌డంగ్రీ(55) మృతిచెందాడు. ధమన్‌జోడి నుంచి విశాఖపట్నానికి అల్యూమినియం లోడుతో వెళుతున్న ఏపీ31 టీయు 0889 నెంబర్ గల లారీ కొండను ఢీకొట్టింది. డ్రైవర్ మలుపుల వద్ద అతివేగంగా నడపడం వలన ఈ ప్రమాదం సంభవించిందని ఎస్ఐ తెలిపారు. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. దీంతో క్లీనర్ అక్కడకక్కడే మృతిచెందాడు. లారీ డ్రైవర్ గెంతేసి పరారయ్యాడు. మృతుడి తమ్ముడు ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డంగ్రీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ఆసుపత్రికి తరలించారు.

ఉద్యావన శాఖ అధికారి సస్పెన్షన్

● ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

చీపురుపల్లి : చీపురుపల్లి ఉద్యానవన శాఖ అధికారి ఎ.రమేష్ కుమార్‌ని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వివేక్‌యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. మండ లంలోని పీకే పాలవలస గ్రామ పంచాయతీ పరిధిలో బొప్పాయి పంట పరిహారం విషయంలో అవకతవకలు జరిగినట్లు గుర్తించి గతంలో ఆంధ్రజ్యోతిలో కథనాలు వెలువడ్డాయి. దీనిపై ఆంధ్రజ్యోతి గ్రామంలో రైతుల నుంచి పూర్తి వివరాలు సేకరించి ప్రచురించింది. దీనిపై స్పందించిన కలెక్టర్ ఏడీ విజయలక్ష్మితో విచారణ చేయించారు. భూమి లేని కొంత మంది రైతులకు పరిహారం చెల్లించారని నిర్ధారణకు వచ్చారు. గ్రామ పెద్దలు, రైతులను విచారించిన ఏడి నివేదికను కలెక్టర్‌కి అందజేశారు. దీంతో కలెక్టర్ రమేష్‌ని సస్పెండ్ చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

● నిందితుల నుంచి రూ.5 లక్షల నగదు, లారీ విడిభాగాలు స్వాధీనం
● వన్‌టౌన్ సీఐ చంద్రశేఖర్

విజయనగరం క్రైం : అంతర్రాష్ట్ర దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సిఐ చంద్రశేఖర్ చెప్పారు. మంగళవారం వన్‌టౌన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లారీ దొంగతనానికి పాల్పడిన అంతర్‌రాష్ట్రీయ దొంగలను సీసీఎస్ పోలీసుల సహకారంతో అరెస్టు చేశామన్నారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన గడిగొయ్య రామకోటి రెడ్డి, విజయవాడకు చెందిన శ్రీనివాసరావు, కాకినాడకు చెందిన కాటూరీ కిషోర్‌బాబు, తణుకుకు చెందిన బొక్కా రాఘవులు, శ్రీకాకుళంకు చెందిన గుంటి జగన్నాథరావు, కడప జిల్లాకు చెందిన పురియా వీరవసంత్‌కుమార్‌లు ముఠాగా ఏర్పడి రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీలను దొంగతనం చేసి విడి భాగాలుగా విడగొట్టి వాటిని విజయవాడ పరిసర ప్రాంతాల్లో అమ్ముతున్నారని తెలిపారు. వీరు గతంలో విజయనగరం టౌన్, పార్వతీపురం టౌన్, అనకాపల్లి టౌన్, కాశీబుగ్గ, కశింకోట, మిర్యాలగూడ, ప్రకాశం జిల్లా కంభం, ఖంబం, మండపేట, తదితర ప్రాంతాల్లో రోడ్డు పక్కన ఉన్న లారీలను తస్కరించి విడిభాగాలను అమ్ముతున్నట్లు తెలిపారు. సీసీఎస్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు శ్రీకాకుళంకు చెందిన గుంటి జగన్నాథరావు, సీసీఎస్ డీఎస్పీ చక్రవర్తి సమాచారం మేరకు వన్‌టౌన్ కేసులో చోరీ సొత్తును కొత్తవలస లారీ కేసులో రూ.5లక్షలు విలువ గల నగదును, టూటౌన్ కేసులో లారీ విడిభాగాలను కాటూరి కిశోర్‌వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. శ్రీకాకుళంకు చెందిన జగన్నాథరావు గత కొంతకాలంగా విజయనగరం రింగ్‌రోడ్డులో నివాసం ఉంటున్నాడని, సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. వీరిలో మిగిలిన నిందితులను కూడా త్వరలోనే పట్టుకుని కేసును ఛేదిస్తామని తెలియజేశారు. ఈ కేసులో సహకరించిన వారిలో సీసీఎస్ డీఎస్పీ చక్రవర్తి, కొత్తవలస ఎస్ఐ ప్రశాంత్‌కుమార్, టూటౌన్ ఎస్ఐ అశోక్‌కుమార్, సీసీఎస్ ఎస్ఐ జియాఉద్దీన్, పీసీలు శంకరరావు, శ్రీనివాసరావు, భానోజీరావు, తదితరులు ఉన్నట్లు సిఐ చంద్రశేఖర్ చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్

లారీ దొంగ అరెస్టు

సాలూరు: లారీని దొంగిలించిన వ్యక్తి గంట్రెడ్డి సత్యనారాయణను అరెస్టు చేశామని సీఐ జి. సంజీవరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పట్టణ ప్రధాన రహదారిలో అక్యాన అప్పారావుకు చెందిన లారీ ఆదివారం చోరీకి గురైందన్నారు. లారీకి జీపీఎస్ ఏర్పాటు చేయడంతో పట్టణం నుంచి ఎస్.కోట వెళ్లినట్లు గుర్తించామన్నారు. అక్కడ పోలీసులను అప్రమత్తం చేసి లారీ స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశామన్నారు. లారీ యజమానులంతా తప్పనిసరిగా లారీలకు జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలన్నారు.

జూట్‌మిల్లు లాకౌట్ ఎత్తి వేయండి

● జాయింట్ లేబర్ కమిషనర్‌కు కార్మికుల వినతి

కొత్తవలస: కొత్తవలస పంచాయతీ పరిధిలోని అర్ధానపాలెంలోనున్న ఉమాజూట్ ప్రొడక్ట్స్ కర్మాగారాన్ని తెరిపించాలంటూ కార్మికులు మంగళవారం విశాఖపట్నంనకు చెందిన జాయింట్ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. తుమ్మికాపల్లి పంచాయతీ సీతంపేటలో నున్న ఉమా జూట్ కర్మాగారంతో కలిపి సుమారు 18 నెలల కిందట యాజమాన్యం లాకౌట్ విధించిందన్నారు. తుమ్మికాపల్లి కర్మాగారంలో లాకౌట్‌ను యాజమాన్యం ఎత్తి వేసిందని, తమ కర్మాగారంలో కూడా లాకౌట్‌ను ఎత్తివేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ప్రస్తుతం తమ కర్మాగారంలో 200 మంది వరకు కార్మికులు పని చేస్తున్నారని, లాకౌట్ ఎత్తి వేస్తే వీరందరికి ఉపాధి లభిస్తుందని జాయింట్ కమిషనర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు వై. కొండయ్య, ఎం.వెంకటేశ్వర్లు. యూనియన్ నాయకులు డి.శ్రీనివాసరావు, ఎల్.త్రినాధరావు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం.. వద్దే వద్దు..!

● దుకాణాల ఏర్పాటును అడ్డుకున్న మహిళలు



ఆందోళన చేస్తున్న మహిళలు

సాలూరు: పట్టణంలోని మజ్జులపేటలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయొద్దంటూ మంగళవారం మహిళలు ఆందోళనకు దిగారు. మజ్జులపేట రిజర్వాయర్ సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం ప్రారంభించేందుకు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు విశ్వ ప్రయత్నాలు చేశారు. కానీ మహిళలు మద్యం దుకాణాలు తెరిస్తే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఎక్సైజ్ అధికారులు, సీఐ సంజీవరావు వేరేచోట దుకాణం ఏర్పాటు చేసేంతవరకు మద్యం నిల్వలు ఇక్కడ ఉంచుతామని మహిళలకు నచ్చజెప్పినప్పటికీ మద్యం నిల్వలు కూడా ఉంచొద్దని వారంతా నిరసన తెలియజేశారు. ఆందోళన చేస్తున్న మహిళలకు స్ఫూర్తి మహిళా మండలి సభ్యులు మద్దతు తెలిపారు. మహిళలు ఆందోళన విరమించకపోవడంతో నిల్వలను వ్యాపారులు వెనక్కుతీసుకువెళ్లారు.

పాఠకులకు సూచన:

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు. ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు.

బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు.

పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

\- మేనేజర్

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

పార్వతీపురం టౌన్: స్థానిక పార్వతీదేవి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం పట్టణ విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి కృష్ణశర్మ ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అలాగే శ్రావణ మాసం సందర్భంగా ఈనెల 4న ఆలయంలో వరలక్ష్మీ వ్రతాల్లో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.


సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఏఎంసీ కుర్చీ ఖాళీ

● జంటిల్‌మెన్ ఒప్పందం అమలయ్యేనా?

(పార్వతీపురం)

పార్వతీపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి భర్తీపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఏఎంసీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలనలోనే ఏఎంసీ కొనసాగుతుంది. రైతులకు ఏఎంసీ ద్వారా అనేక సేవలందించవలసిన బాధ్యత చైర్మన్‌పై ఉంది. అయినప్పటికీ ఏఎంసీ చైర్మన్ పదవిని భర్తీ చేయడంలో తీవ్ర జాప్యం అవుతోంది. గతంలో ఈ పదవిని పట్టణ టీడీపీ అధ్యక్షుడు కోలా వెంకటరావు కోరారు. మాజీ ఎమ్మెల్యే యర్రా అన్నపూర్ణమ్మ సూచన మేరకు అప్పట్లో రెడ్డి శ్రీనివాసరావుకు ఎమ్మెల్సీ జగదీష్, ఎమ్మెల్యే చిరంజీవులు పదవి కోసం ఎంపిక చేశారు. శ్రీనివాసరావు పదవీ కాలం ముగిసిన వెంటనే కోలా వెంకటరావుకు ఏఎంసీ పదవిని ఇస్తామని అప్పట్లో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు వాగ్దానం చేశారు. దీంతో ప్రతిపక్షంలో ఉన్న కాలంలో కూడా పార్టీ పటిష్టతకు పనిచేసిన వెంకటరావు ఏఎంసీ చైర్మన్ పదవి వస్తుందని ఆశిస్తున్నారు. ఎమ్మెల్సీ జగదీష్, కోలా వెంకటరావుకు ఏఎంసీ పదవి ఇచ్చేందుకు గతంలో కుదిరిన జెంటిల్‌మెన్ ఒప్పందం అమలు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నప్పటికీ భర్తీలో జాప్యం అవుతోతుంది. గత శాసనసభ ఎన్నికల్లో పట్టణం నుంచి భారీ మెజార్టీని అందించడంలో కీలక పాత్ర వహించిన సీనియర్ నాయకులకు నామినేటెడ్ పదవులు ఖరారు చేయాలని పలువురు నాయకులు కోరుతున్నారు.


ఏఎంసీ కార్యాలయం

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

● మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి

పార్వతీపురం టౌన్: తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యాన్ని ఇస్తాయని చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి అన్నారు. మంగళవారం 12వ వార్డులో తల్లిపాలు వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముర్రుపాలను బిడ్డ తాగడం వల్ల రోగ నిరోధక శక్తి పెరగడమే కాకుండా ఆరోగ్యకరమైన మిటమిన్లు ఉత్పత్తి అవుతాయన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ తాడ్డి అరుణ పాల్గొన్నారు.


వారోత్సవాల్లో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

గిరిజన సమస్యలపై నిర్లక్ష్యం

● రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష, ప్రజాసంఘాల ఆగ్రహం

పార్వతీపురం టౌన్: గిరిజనుల సమస్యలపై ఐటీడీఏ పీవో నిర్లక్ష్య వైఖరి తగదని సీపీఎం, సీపీఐ, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతరం సీపీఎం డివిజన్ కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి, సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్‌వీఎస్ కుమార్ విలేఖరులతో మాట్లాడుతూ పీవో డాక్టర్ లక్ష్మీశ వైఖరి గిరిజనులతో పాటు ప్రజా సంఘాలు, యువజన విద్యార్థి సంఘాలు, వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఐటీడీఏ అధికారులు గిరిజనులను చులకన భావంతో చూస్తున్నారన్నారు. వందలాది మంది ప్రజలు గ్రీవెన్స్‌లో వినతులు ఇచ్చినప్పటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. సమస్యలపై పీవో స్పందించకపోవడంతో అభివృద్ధి జాడ కానరావడం లేదన్నారు. పీవో అంటెండర్లు, సీసీలు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నా వారిపై చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా వైటీసీ మేనేజర్‌పై ఇప్పటి వరకు చర్యలు చేపట్టకపోవడం పీవో నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. గురువారం నుంచి వైటీసీ మేనేజర్‌ను తొలగించాలని, గిరిజన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలను చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు పి. రాజశేఖర్, కె.రామస్వామి, ఆర్.శశిభూషణ్ పాల్గొన్నారు.


విలేఖరులతో మాట్లాడుతున్న నాయకులు

మానవ సేవే.. మాధవ సేవ

పార్వతీపురం టౌన్: మానవ సేవే మాధవ సేవని మరువరాదని ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. మంగళవారం ఆడబడి వీధిలోని తిరుమళ్ల రామ్మూర్తి మున్సిపల్ బాలిక ఉన్నత పాఠశాలలో సరస్వతీ డీఎంలా సారిపల్లి ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సారిపల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దాలి మృత్యుంజయరావు ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయడం గొప్ప విషయమన్నారు. జన్మిం చిన ఊరి అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దాలి మృత్యుంజయరావు అన్నారు.

తల్లి రత్నాలమ్మ పేరిట జ్ఞాన మందిరంతోపాటు మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. అనంతరం మృత్యుం జయరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, వైస్‌చైర్మన్ బెలగాం జయప్రకాష్‌నారాయణ, కౌన్సిలర్లు రెడ్డి రవికుమార్, సీహెచ్ వెంకటరమణ, కందుకూరి వాసుదేవరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కోలా వెంకటరావు, టీడీపీ అధికార ప్రతినిధి జి.రవి కుమార్, జన్మభూమి కమిటీ సభ్యులు తాడ్డి శంకరావు, గంట శ్రీ నివాసరావు పాల్గొన్నారు.


మృత్యుంజయరావును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

వాటర్‌షెడ్ పనుల్లో అవినీతిని సహించం

● ఐటీడీఏ పీవో లక్ష్మీశ

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలో వాటర్ షెడ్ కార్యక్రమం ద్వారా చేపడుతున్న పనుల్లో అవినీతిని ఉపేక్షించేది లేదని ఐటీడీఏ పీవో డాక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. మంగళవారం పీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి ఆర్వో ప్లాంటు పనితీరు, తదితర అంశాలపై సిబ్బందిని ప్రశ్నించారు. సహజ వనరుల యాజమాన్య పనులను స్థానిక ప్రజలతో చేయించాలని పీవో స్పష్టం చేశారు. వాటర్ షెడ్ సిబ్బంది ప్రతి సోమవారం ఐటీడీఏలో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని, నెలకు ఒకసారి పనులపై రివ్యూ నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ కిరణ్‌కుమార్, డీఆర్‌పీ పోలినాయుడు, వాటర్ షెడ్ సిబ్బంది పాల్గొన్నారు.


వాటర్ షెడ్ సిబ్బందితో సమీక్షిస్తున్న పీవో లక్ష్మీశ

భవిత కేంద్రాలతో విద్యార్థుల్లో మనోవికాసం

బలిజిపేట: భవిత, నాన్‌భవిత కేంద్రాల ద్వారా చిన్నారుల్లో మనోవికాసాన్ని కల్పించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఐఈఆర్‌టీ రవికుమార్ తెలిపారు. మంగళవారం ఎమ్మార్సీ భవనంలో దివ్యాంగులైన చిన్నారులతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలు రాబోయే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాల్లో చేరి తోటి పిల్లలతో పోటీపడే విధంగా తయారు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వలంటీర్ చంద్రకళ, విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


భవిత కేంద్రంలో విద్యార్థులకు మెలకువలు నేర్పిస్తున్న సిబ్బంది

గ్యాస్ సమాచారం

పార్వతీపురం పెంటపాటి కామరాజు గ్యాస్ ఏజెన్సీ పరిధిలో మంగళవారం వరకు బుక్ చేసుకున్న కురుపాం మండలం, గరుగుబిల్లి మండలం, పార్వతీపురం మండలం గోపాలపురం, పట్టణ వినియోగదారులకు బుధవారం గ్యాస్ సరఫరా అవుతుంది. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేయదలచిన వారు 9666023456 నెంబర్‌కు ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవాలి. ఫిర్యాదులు, సల హాలు కోసం గ్యాస్ ఏజెన్సీ ల్యాండ్ లైన్ 08963-221425, 221345 నెంబర్లను సంప్రదించాలి.

సినిమా గైడ్

వెంకటేశ్వర కళామందిర్	ఫిదా
పద్మశ్రీ	నిన్నుకోరి
సౌందర్య	గౌతమ్‌నంద

ఒకే మందుతో రెండు వ్యాధులు దూరం

● ఎమ్మెల్సీ జగదీష్, ఎమ్మెల్యే చిరంజీవులు

పార్వతీపురం టౌన్: ప్రమాదకర తట్టు, పొంగు వ్యాధులను ఒకటే మందుతో దూరం చేయవచ్చని ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు టీకాలు వేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని 43 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో టీకాలు వేయనున్నట్టు చెప్పారు.

ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, వైస్‌చైర్మన్ బెలగాం జయ ప్రకాష్‌నారాయణ, కౌన్సిలర్లు రెడ్డి రవికుమార్, చొక్కాపు వెంకటరమణ, కోమటి వెంకటరావు, పట్టణ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు కోలా వెంకట రావు, జన్మభూమి కమిటీ సభ్యులు తాడ్డి శంకరరావు, ఆసుపత్రి పీపీ యూనిట్ వైద్యాధికారి కనకమహ లక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు టీకాలు వేసి ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

టీచర్స్ గిల్డ్ ధర్నా వాయిదా

పార్వతీపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ బుధవారం తలపెట్టిన ధర్నా వాయిదా పడినట్టు రాష్ట్ర అధ్యక్షుడు డి.సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ ప్రధాన కార్యదర్శి ఎల్‌కే చిన్నప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇమ్మానియల్, కమిషనర్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యూకేషన్ జాయింట్ డైరెక్టర్ వెంకట కృష్ణారెడ్డితో సమావేశమయ్యారన్నారు. ఈ సమావేశంలో సీనియార్టీ ప్రకారం ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తామని సూచన ప్రాయంగా హామీ ఇవ్వడంతో ధర్నా వాయిదా వేశామన్నారు. ప్రభుత్వం దీనికి కట్టుబడి ఉండకపోతే ఆందోళన చేస్తామని అన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి

బలిజిపేట: ప్రభుత్వ పాఠశాల్లో ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని ఎంఈవో కె.శ్రీనివాసరావు కోరారు. మంగళవారం ఎంఈవో కార్యాయలంలో బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర మండలాల నుంచి 27 మంది ఉపాధ్యాయులు బదిలీపై వచ్చారని వీరంతా సమయపాలనతో పనిచేస్తూ మెరుగైన విద్యను అందించాలని కోరారు. బదిలీల పక్రియలో ఇతర మండలాల నుంచి 27 మంది రాగా, మండలం నుంచి 48 మంది వివిధ ఇతర మండలాలకు బదిలీ అయ్యారని తెలిపారు. ఈ సమావేశంలో ఎంఈవోతో పాటు వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

పనిచేసే వారికి ప్రజల్లో గుర్తింపు

కొమరాడ: ప్రభుత్వ ఉద్యోగి అంకితభావంతో పనిచేస్తేనే ప్రజల్లో గుర్తింపు వస్తుందని పార్వతీపురం ఆర్డీవో బి.సుదర్శనదొర అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్న తహసీల్దార్ రమణమూర్తిని ఆర్డీవో సుదర్శనదొర ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విమరణ అన్నది సాధారణమన్నారు. తహసీల్దార్‌గా రమణమూర్తి చేసిన సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ఆవాల సూర్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


రమణమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

పచ్చిరొట్ట ఎరువులతో అధిక దిగుబడులు

బలిజిపేట: పచ్చిరొట్ట ఎరువుల వినియోగం ద్వారా రైతాంగం అధిక దిగుబడులు సాధించవచ్చని బొబ్బిలి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ భారతి తెలిపారు. మంగళవారం పలగరలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ వరి పంట వేసే ముందు పొలాల్లో పచ్చిరొట్ట మొక్కల ఎరువులను వేయడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగేశ్వరరావు, గ్రామపెద్దలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు లాభదాయకం

రామవరం (సీతానగరం): యాజమాన్య పద్ధతుల ద్వారా వరి సాగు చేపట్టడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఎం.ఉమామహేశ్వరనాయుడు తెలిపారు. మంగళవారం రామవరం, ఆర్.వెంకంపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరుసగా వరినాట్లు వేయడంతో పంటకు గాలి, వెలుతురు తగిలి పిలకలు ఎక్కువగా వస్తాయన్నారు. ద్రవ రూప జీవన ఎరువులను వినియోగించాలన్నారు. నత్రజని, భాస్వరం జాతీయ ఆహార భద్రత పథకం కింద 75 శాతం రాయితీపై రైతులకు అందజేయనున్నట్టు చెప్పారు.

ఒకే టీకాతో సంపూర్ణ ఆరోగ్యం

● ఐటీడీఏ పీవో డాక్టర్ లక్ష్మీశ

పార్వతీపురం: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్న లక్ష్యంతో ఒకే టీకాతో తట్టు, రూబెల్లా వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు ఐటీడీఏ పీవో డాక్టర్ లక్ష్మీశ అన్నారు. మంగళవారం డోకిశీల ఆశ్రమ పాఠశాలలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దీపక్ ఆధ్వర్యంలో ఎంఆర్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఐటీడీఏ పీవో లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు టీకాలు వేసే కార్యక్రమం వైద్య సిబ్బంది నిర్వహించారు. అనంతరం పీవో మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో సబ్‌ప్లాన్ మండలాల్లో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా వ్యాధుల నివారణకు అనేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గొట్టాపు గౌరీశ్వరి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రవికుమార్‌రెడ్డి, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ మడక కృష్ణవేణి, టీడీపీ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, మడక విశ్వనాథం, ప్రధాన ఉపా ధ్యాయులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోగాల నుంచి రక్షణ

సీతానగరం: పిల్లలకు సోకే తట్టు, పొంగు వ్యాధులు రాకుండా టీకా వేసి అరికట్టవచ్చని పెదంకలాం పీహెచ్‌సీ వెద్యాధికారి ఏబీ మల్లికార్జునరావు తెలిపారు. గాదెవలస, వెంకటాపురం, పెదంకలాం, బూర్జ, కోటసీతారామపురం, నిడగల్లు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రుబెల్లా టీకా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. పీహెసీ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, ఏఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది


సీతానగరం, బలిజిపేటల్లో టీకీలు వేస్తున్న వైద్య సిబ్బంది

ప్రతి ఒక్కరూ వేసుకోవాలి

బలిజిపేట: టీకాల కార్యక్రమాన్ని ఎంపీపీ పార్వతి మంగళవారం మండల కేంద్రంలో ప్రారంభించారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తట్టు, రుబెల్లా టీకా ఆవశ్యకతను తెలియజేశారు. ప్రతి ఒక్కరు టీకాలు వేసుకోవాలని విద్యార్థులను కోరారు. అనంతరం వైద్యాధికారి సుమ మాట్లాడుతూ తట్టు వ్యాధి కారణంగా చిన్నారులు, న్యుమెనియా, విరేచనాలు, మెదడు వాపు వ్యాధులకు గురవుతారని తెలిపారు. మండలంలో మంగళవారం నుంచి ఆగస్టు 31 వరకు టీకాలు వేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సలహా సంఘం అధ్యక్షుడు సుబ్బారావు, సీహెచ్‌వో వెంకటరత్నం, హెల్త్ సూపర్‌వైజర్ రవికుమార్ పాల్గొన్నారు.

వట్టిగెడ్డ నీరు విడుదల

రావాడ (జియ్యమ్మవలస): వట్టిగెడ్డ రిజర్వాయర్ నీటిని ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ బలగ వెంకటరమణ, వైస్ ఛైర్మన్ దత్తి వెంకటనాయుడు మంగళవారం లాంఛనంగా విడుదల చేశారు. ప్రస్తుతం ఖరీఫ్ పనుల సమయంలో వర్షాలు లేక నారుమడులు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు నారుమడులను దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చి తడుపు కోవలసిన పరిస్థితి ఎదురయ్యింది. దీంతో మంగళవారం ఉదయం నీటిని విడుదల చేశారు. రిజర్వాయర్ నీటి మట్టం 384.5 అడుగులు ఉంది. ఖరీఫ్ పనులకుకావలసిన నీరు ఉందని నీటి పారుదలవాఖ ఏఈలు సత్యానారాయణ, రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలో నీటి సంఘాల అధ్యక్షుడు, రైతులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు ఇద్దరు గిరిజనులకు గాయాలు

గుమ్మలక్ష్మీపురం: ఇక్కడకు సమీపంలోని ధూలికుప్పలో మం గళవారం సాయంత్రం పిడుగు పడిన సంఘటనలో ఇద్దరు గిరి జనులకు గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన వీరి నిభద్రగిరి సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేసి అనంతరం పార్వతీపురం ఆసుపత్రికి తరలించారు. పిడుగు పాటు బాధితులు బిడ్డిక నరేష్, లింగన్నలకు ఎటువంటి ప్రాణహాని లేదని వైద్యులు తెలిపారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నరేష్, లింగన్న

'భోజనం' బాగుండకపోతే చర్యలు తప్పవు

● ఎంపీపీ పార్వతి

బలిజిపేట: ప్రభుత్వ పాఠశాల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలులో నిర్వాహక కమిటీలు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీపీ పార్వతి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. వంటలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. సుమారు 488 మందికి వండిన పప్పు, గుడ్లు వంటకాలలో వ్యత్యాసాలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. పాఠశాలలో 703 మంది విద్యార్థుల ఉండగా 577 మంది హాజరు కాగా 488 మందికి మధ్యాహ్న భోజనం పెడుతున్నట్టు ఇన్‌చార్జి హెచ్‌ఎం తెలియజేశారు. ఇక నుంచి పాఠశాలలో నాణ్యమైన భోజనాన్ని పెట్టకపోతే నిర్వా హక కమిటీని తొలగించనున్నట్టు ఆమె హెచ్చరించారు. ఈమె వెంట బలిజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సలహా సంఘం ఛైర్మన్ వి.సుబ్బారావు, టీడీపీ నాయకులు వి.రామకృష్ణ, ఉన్నారు.


వంటకాలు పరిశీలిస్తున్న ఎంపీపీ పార్వతి

మరుగుదొడ్ల నిర్మాణంలో అక్రమాలపై సీరియస్

పార్వతీపురం: కొమరాడ మండలంలో మరుగుదొడ్ల నిర్మాణాల్లో అక్రమాలను న్యాయమూర్తులు సీరియస్‌గా పరిగణిస్తున్నట్టు సమాచారం. ఇటీవల న్యాయమూర్తి శ్రీహరి ఆధ్వర్యంలో కొమరాడ మండలంలో వివిధ గ్రామాల్లో నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ నిర్మాణాల్లో అవకతవకలు చోటు చేసుకున్నట్టు తెలుసుకున్నారు. అలాగే కొన్ని గ్రామాల్లో అసలు మరుగుదొడ్లు నిర్మించకపోవడం తదితర అంశాలను న్యాయమూర్తులు పరిశీలించారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయమూర్తి శ్రీహరి కొంతమంది అధికారులను గురువారం న్యాయస్థానం ముందు హాజరుకావాలని సమాచారం పంపించినట్టు తెలిసింది.

అధికార యంత్రాంగం నిద్ర

కొమరాడ, కురుపాం మండలంలో కూడా మరుగుదొడ్ల నిర్మాణాల్లో అవకతవకలు వార్తలు వస్తున్నప్పటికీ దీనిపై అధికారులు చర్యలు పట్టించుకోలేదు. చివరకు న్యాయమూర్తులే రంగంలోకి దిగి అవకతవకలపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలంటే ప్రభుత్వ పరిస్థితి ఏ విధంగా ఉందో స్పష్టమవుతోంది. అవకతవకలపై చర్యలు తీసుకోవలసిన ఉన్నతాధికారులు నిద్ర నటిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. న్యాయమూర్తుల పుణ్యమా అంటూ ఇప్పటికైనా ప్రభుత్వ సొమ్మును కాపాడే విధంగా చర్యలు ప్రారంభం కావడం సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది.

రుణాలు మంజూరుపై దృష్టి పెట్టండి

పార్వతీపురం: కౌలు రైతులకు రుణాలు మంజూరుపై రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సీసీఎల్‌ఏ ఉన్నతాధికారులు అనిల్‌చంద్ర పునేఠా ఆదేశించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు సేవలో రెవెన్యూశాఖ,నీటి పన్ను వసూలు తదితర అంశాలపై పలు ఆదేశాలు జారీ చేశారు.

లింకేజీ సొమ్ము స్వాహా..

● రూ.3లక్షల 60వేలు..
ఏపీజీవీబీ మాజీ మేనేజర్ కైంకర్యం
● ఆలస్యంగా వెలుగులోకి..
● సొమ్ము చెల్లించాలని
గిరిజన మహిళలకు నోటీసులు జారీ



ఆందోళన చెందుతున్న లక్ష్మి, సరస్వతి పొదుపు సంఘాల సభ్యులు

మెంటాడ: పొదుపు సంఘాలకు తెలియకుండానే లింకేజీ సొమ్మును కాజేశారు.. గిరిజన మహిళా పొదుపు సంఘాలను నుంచి రూ.3 లక్షలు 20వేలు కైంకర్యం చేశారు. మెంటాడ మండలంలోని జయతి పంచాయతీ మధుర గిరిజన గ్రామం బీరసాడ వలసలో రెండు పొదుపు గ్రూపుల సొమ్మును విశాఖ గ్రామీణ బ్యాంకు మాజీ మేనేజర్ స్వాహా చేశారు.

బిరసాడవలస గ్రామానికి చెందిన లక్ష్మి మహిళా పొదుపు సంఘం 7-10-2011 తేదీన రూ.2లక్షల 20వేలు లింకేజీ రుణాలు వాడుకున్నట్లు బ్యాంకు పాస్ బుక్‌లో ఉంది. అలాగే సరస్వతి మహిళా సంఘం 29-8-2011 తేదీన రూ.50వేలు లింకేజీ సొమ్ము తీసుకున్నారు. అప్పట్లో బుక్‌కీపర్ బగ్గాం చంద్రశేఖర్ సొమ్మును గ్రామానికి తీసుకువస్తానని చెప్పి పదిరోజులు గడిచినా సొమ్ము సభ్యులకు ఇవ్వలేదు. డబ్బులు తన స్వంత ఖర్చులకు ఉపయోగించానని ప్రాంసరీ నోటు రాసి ఇచ్చాడు. దీంతో సరస్వతీ పొదుపు సంఘం వారు నెలానెలా వాయిదా పద్ధతిలో కడుతున్నారని నమ్మారు. నేటికి పైసా కట్టని పరిస్థితి. దీంతో వడ్డీతో రూ.80వేలు అయ్యింది. లక్ష్మిపొదుపు సంఘం సభ్యులకు రూ.రెండు లక్షల20వేలు అప్పు వాడినట్లు తెలియదని మహిళలు లబోదిబోమంటున్నారు. మహిళా సంఘ సభ్యులు అప్పులేదని ధీమాగా ప్రతీనెలా పొదుపు కడుతున్నారు. ఇటీవల బ్యాంకు వారు సంఘ సభ్యులకు నోటీసులు జారీ చేశారు. దీంతో రెండు సంఘాల సభ్యులు మంగళవారం బ్యాంకుకు, వెలుగు కార్యాలయానికి వెళ్లి తమ మొరను వినిపించారు. అప్పులేకుండా అప్పు కట్టమని నోటీసులు ఇవ్వడమేమిటని మెంటాడ విశాఖ గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ వద్ద మొరపెట్టుకున్నారు.

బుక్‌కీపర్ మధ్యవర్తిత్వం..

2011వ సంవత్సరంలో అప్పటి బ్యాంకు మేనేజర్ సొమ్మును వాడుకున్నాడని బుక్‌కీపర్ చంద్రశేఖర్ తెలియజేశాడు. తానే మధ్యవర్తిత్వం వహించి ముట్టజెప్పానని రెండు సంఘాలకు ప్రాంసరీ నోటు రాసి ఇచ్చాడు. అప్పటి బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడి ఆయనతో సొమ్ము చెల్లించే విధంగా చేస్తానని ఆయన మహిళలకు చెప్పాడు.

కైంకర్యం కొత్తమీ కాదు..

మాజీ బ్యాంక్ మేనేజర్ హయాంలో గతంలో చాలా సంఘాల సొమ్ము కైంకర్యం జరిగింది. అయితే సంఘాలు ఆందోళన చేయడంతో సొమ్మును తిరిగి చెల్లించేవారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు దర్యాప్తులో రూఢీ అవ్వడంతో ఉద్యోగం నుంచి తొలగించిన సంగతి విదితమే. ఇలా ఒక్కక్కటి ఆలస్యంగా వెలుగులోకి వస్తున్నాయి. ఇంకా రావాలసినవి ఎన్నో ఉన్నాయో ఆ దేవుడికే ఎరుక.

న్యాయం చేయాలి:

మహిళలను మోసం చేసి సంఘాలకు తెలియకుండా అప్పు వాడుకున్న అధికారులను కఠినంగా చర్యలు తీసుకోవాలని, వారికి న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

హత్య కేసులో
యువకుడి అరెస్టు

● కుమార్తెను ఇచ్చి వివాహానికి అంగీకరించలేదన్న కోపంతో ఘాతుకం
● మద్యం మత్తులో దింపి హత్య
● నిందితుడు పార్వతీపురం వాసి

పెదగంట్యాడ (విశాఖపట్నం): తనతో వివాహానికి అంగీకరించలేదనే అక్కసుతో యువతి తండ్రిని హతమార్చిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి మంగళవారం న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో న్యూపోర్టు ఇన్‌చార్జి ఏసీపీ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పార్వతీపురం దిబ్బలపూడివలస గ్రామానికి చెందిన లక్ష్మణరావు గాజువాకలోని సీతారామ్‌నగర్‌లో ఉంటున్న తమ అక్క, రమ, బావ శ్రీరాములు ఇంట్లో ఏడాదిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో వారు ఉంటున్న ఇంటి యజమాని మొల్లి పైడారావు కుమార్తె దివ్యపై మనసు పడ్డాడు. దీంతో దివ్యకు తనతో వివాహం చేయాలంటూ పైడారావును కోరాడు. అయితే, తన కుమార్తెకు ఇది వరకే పెళ్లి నిశ్చయమైందని, ఈ ఏడాది ఆగస్టు 6న వివాహం కూడా ఉందని, కనుక అటువంటి ఆశలేవీ పెట్టుకోవద్దని పైడారావు తెగేసి చెప్పారు. ఈ క్రమంలో పైడారావుపై కక్ష పెట్టుకున్న లక్ష్మణరావు అతడిని ఎలాగైనా మట్టుబెట్టాలని నిశ్చయించుకున్నాడు.

ఈ నేపథ్యంలో పైడారావుకు మద్యం అలవాటు ఉండడంతో ఆ వంకతో అతడితో స్నేహం చేశాడు. వీరిద్దరూ తరచూ కలిసి మద్యం తాగేవారు. ఈ క్రమంలో గత నెల 26న రాత్రి 9 గంటల సమయంలో మద్యం తాగేందుకు వెళదామని చెప్పి పైడారావును పెదగంట్యాడలోని పెంటమాంబ ఆలయంలోని ఖాళీ ప్రదేశానికి తీసుకెళ్లాడు. రాత్రి 11 గంటలు అవుతున్నా పైడారావు ఇంటికి చేరకపోవడంతో అతడి కుమార్తె దివ్య తండ్రికి ఫోన్ చేసి ఆరా తీసింది. అయితే, తాను వచ్చేసరికి కాస్త ఆలస్యం అవుతుందని, తన కోసం ఇంటి బయట మంచం వేసి మీరు పడుకోండి' అంటూ పైడారావు చెప్పాడు.

అప్పటికే పక్కా వ్యూహంతో వున్న లక్ష్మణరావు అనంతరం పైడారావుకు మత్తు మందు కలిపిన మద్యాన్ని మరికొంత తాగించాడు. తనతో ముందే తెచ్చుకున్న సుత్తితో మత్తులో ఉన్న పైడారావు తలపై మోది తీవ్రంగా గాయపరిచి, బ్లేడుతో గొంతు కోసి హతమార్చాడు. అనంతరం అక్కడ నుంచి పరారయ్యాడు.

దీనిపై మృతుడి కుమార్తె దివ్య ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు లక్ష్మణరావుగా నిర్ధారించుకున్నారు. అతడు స్థానిక దల్లివానిపాలెం గ్రామంలోని తన స్నేహితుడు శ్రీను ఇంట్లో తలదాచుకుంటున్నట్టు తెలుసుకుని అరెస్టు చేశారు. ఈ సమావేశంలో న్యూపోర్టు సీఐ సోమశేఖర్, ఎస్ఐ భాస్కరరావు, నారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చిట్ట చివరి పొలాలకూ సాగు నీరు..

● ఆర్డీవో శ్రీనివాసమూర్తి

కలెక్టరేట్: చిట్ట చివరి పొలాలకు కూడా సాగునీరు అందజేయాలని ఆర్డీవో శ్రీనివాసమూర్తి అన్నారు. మంగళవారం సాయంత్రం తన చాంబర్‌లో ఇరిగేషన్, పోలీసు, రెవెన్యూ అధికారులతో తాటిపూడి రిజర్వాయిర్ సాగు నీరు సరఫరాపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురవడం లేదని ఈ నేపథ్యంలో రిజర్వాయిర్‌లో ఉన్న నీటిని అందరికీ అందజేయాలన్నారు. మధ్యలో ఎవరైనా నీరు అక్రమంగా తరలిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. రైతులందరికీ నీరు అందజేయాలని సూచించారు. మండల, గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకుని నీరు సరఫరా చేయాలన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎస్ఐ, ఇరిగేషన్ జేఈ కమిటీ సభ్యులుగా ఉండాలని సూచించారు. గ్రామ స్థాయిలో గ్రామ రెవెన్యూ కార్యదర్శి, ఒక పోలీసు కానిస్టేబుల్, ఇరిగేషన్ నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారని చెప్పారు. నీరును వృధా చేయకుండా సక్రమంగా సరఫరా చేసే విధంగా కమిటీ సభ్యులు చూడాలని ఆదేశించారు. కమిటీ సభ్యులు కాలువలను పరిశీలన చేసి ఎవరికీ ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. గంట్యాడ, జామి, ఎస్‌కోట మూడు మండలాల్లో ఉన్న పొలాలకు నీరు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ వెంకటరమణ, డీఈ అప్పలనాయుడు, మూడు మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎస్ఐలు, ఇరిగేషన్ జేఈలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసమూర్తి

బొబ్బిలిలో గుట్కాల పట్టివేత

బొబ్బిలి: పట్టణంలోని చినబజారులో ఇప్పిలి అనంత కుమార్ పాన్‌షాపులో అక్రమంగా విక్రయిస్తున్న నిషేధిత రూ.7 వేలు విలువ చేసే గుట్కాలు, ఖైనీలను బొబ్బిలి సీఐ వై.రవి మంగళవారం రాత్రి దాడిచేసి పట్టుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాన్‌షాపు యజమానులకు అవగాహన కల్పించినప్పటికీ ఇంకా అక్కడక్కడ కొంతమంది నిషేధిత గుట్కాలను విక్రయిస్తున్నారని తెలిపారు. అనంత్ కుమార్ తన పాన్‌షాపులో గుట్కాలు విక్రయిస్తున్నట్లు తమకు సమాచారం అందడంతో దాడులు చేశామన్నారు. ఇక నుంచి ఎవరైన అక్రమంగా నిషేధిత గుట్కాలను విక్రయిస్తే రౌడీషీటర్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. అక్రమంగా విక్రయిస్తున్న వ్యాపారి అనంత్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని ఆయనపై నిషేధిత పదార్థాల విక్రయాల చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కొత్తవలస రూరల్: విశాఖ-అరకు ప్రధాన రహదారిలో దేశపాత్రునిపాలెం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. అయితే మృతుడి వివరాలు తెలియరాలేదు. ఆయన తలపై నుంచి గుర్తు తెలియని వాహనం వెళ్లిపోవడంతో అది నుజ్జునుజ్జయ్యింది. సీఐ లలిత, ఎస్ఐలు నీలకంఠం, ప్రశాంత్‌కుమార్ సంఘటనా స్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్.కోట ఎస్సీ వసతి గృహం వార్డెన్ సస్పెన్షన్

కలెక్టరేట్: జిల్లాలోని ఎల్‌కోట సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహానికి చెందిన వార్డెన్ ఎన్.భాస్కర్‌రావును కలెక్టరు వివేక్ యాదవ్ మంగళవారం సస్పెండ్ చేశారని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.సునీల్ రాజకుమార్ తెలిపారు. ఈమేరకు ఈ బాధ్యతలును టి.శ్రీనివాసరావుకు అప్పగించామని చెప్పారు.

హడ్డుబంగి రోడ్డు బురదమయం

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి హడ్డుబంగి నుంచి గైర వెళ్లే రోడ్డు బురదమయమైంది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపైకి నీరు చేరింది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలన పలువురు కోరుతున్నారు.

సత్యసాయినగర్‌లో...

పర్లాకిమిడి మున్సిపాల్టీలో పరిధిలోగల 15వ వార్డు సత్యసాయినగర్‌లో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమమైంది. బయటకు వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడం, రోడ్డంతా నీటిమయం కావడంతో అవస్థలుపడుతున్నారు.



బురదమయమైన హడ్డుబంగి-గైర రోడ్డు

చురుగ్గా హాస్టల్ నిర్మాణం

పర్లాకిమిడి: సెంచ్యూరియన్ పబ్లిక్ పాఠశాల వెనుకభాగంలో రూ.80లక్షల వ్యయంతో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ భవన పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులు పురపాలక సంఘం సాంకేతిక సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. మూడు నెలల్లో నిర్మాణం పూర్తవుతుందని మున్సిపాల్టీ అధ్యక్షురాలు లలిత తెలిపారు. హాస్టల్ నిర్మాణం పూర్తయితే జిల్లాలో ఉద్యోగినుల అవస్థలు తీరుతాయి.



నిర్మాణంలో ఉన్న హాస్టల్

ఒడిశా

ముగిసిన మావోయిస్టు వారోత్సవాలు

పర్లాకిమిడి: వారంరోజులుగా జరుగుతున్న మావోయిస్టు వారోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. గతనెల 28న ఈ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పోలీసులు ఏజెన్సీ గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. కూడళ్ల వద్ద భద్రత పెంచారు.

సబ్‌కలెక్టర్‌గా రంజన్‌కుమార్‌బిస్వాల్

పర్లాకిమిడి: పర్లాకిమిడి సబ్‌కలెక్టర్‌గా రంజన్‌కుమార్‌బిస్వాల్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన గజపతి జిల్లా ఉపతహసీల్దార్‌గా పని చేశారు. గంజాం జిల్లా సెరగడ బీడీవోగా పని చేసి ఇక్కడకు పదోన్నతిపై వచ్చారు. ఇప్పటివరకు సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన అనంచరణ్‌పాత్రో సర్వశిక్షఅభియాన్ డిస్ట్రిక్ట్‌ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టారు. సబ్‌కలెక్టర్‌గా పూర్తి అవగాహన ఉండడంతో జిల్లా విద్యావ్యవస్థను గాడిలో పెడతారని పలువురు భావిస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకే..

నూతన విధానం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వివేక్‌యాదవ్, హాజరైన అధికారులు

● పక్కాగా అమలు చేయండి
● తవ్వకం, రవాణా ధరల నిర్ణయానికి సబ్ కమిటీ
● అనుమతి లేకుండా ఇసుక నిల్వ చేయటం.. అమ్మకం నేరం
● కలెక్టర్ వివేక్ యాదవ్

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ఇసుకను అక్రమ రవాణాకు అడ్డుకట్ట లేకుండా పోతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నూతన పాలసీని అమల్లోకి తీసుకువచ్చింది. దీనిలో భాగంగా కలెక్టర్ వివేక్ యాదవ్ సంబంధిత అధికారులతో మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఉచితంగా ఇసుక అమల్లో ఉన్నప్పటికీ కొన్నిచోట్ల అమ్ముతున్నట్టు ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. దీనికితోడు ఒక్కో ప్రాంతంలో ఒక్కో ధరకు అమ్ముతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో పలు విషయాలు చర్చించింది. మండలస్థాయిలో పర్యవేక్షణకు కమిటీ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఇసుక ఉచితంగా పొందే అవకాశం ఉన్నప్పటికీ నిర్మాణదారులు అధికంగా చెల్లిస్తున్నారని, కావున స్థిరమైన ధర నిర్ణయించాలని తీర్మానించింది.

సమావేశంలో ఎస్పీ పాలరాజు, భూగర్భ గనుల శాఖ సహాయ సంచాలకులు ఎస్‌కేవీ సత్యనారాయణ, ఆర్డీవోలు శ్రీనివాసమూర్తి, కె.సుదర్శన దొర, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షక ఇంజినీర్లు కె.వేణుగోపాలరావు, రమణమూర్తి, రవాణా శాఖ ఉప కమిషనర్ శ్రీకృష్ణవేణి, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

● ఇవీ తీర్మానాలు ..

జిల్లాలో ఇసుక రవాణాకు ట్రాక్టర్ల మాత్రమే వినియోగించాలని, దూరాన్ని బట్టి ట్రాక్టర్ ధరను నిర్ణయించాలని రవాణా ఉప కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఇసుక తవ్వకం, లోడింగ్, ర్యాంప్ నిర్వహణ చార్జీలను నిర్ణయించడానికి ఒక సబ్ కమిటీని నియమించారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా ట్రాక్టర్ లోడు ధరను నిర్ణయిస్తారు.

● ప్రభుత్వ కట్టడాలకు సంబంధించి వెయ్యి క్యూబిక్ మీటర్లలోపు వరకు ఇసుక సరఫరాకు మండల కమిటీ అనుమతి, వెయ్యి క్యూబిక్ మీటర్ల పైబడి ఇసుక సరఫరాకు మైనింగ్ శాఖ సహాయ సంచాలకుల అనుమతి పొందాల్సి. ఈ అనుమతి పత్రంలో ఎంత ఇసుక, తేదీలు, సమయం, వాహనం నెంబర్ నమోదు చేయాలి.

● మైన్స్, భూగర్భ జల, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారులు సంయుక్త పరిశీలన చేసి, కొత్త ఇసుక రీచ్‌లను గుర్తించి జిల్లా స్థాయి అనుమతికి నివేదించాలి.

● ఇప్పటికే పోలీస్ శాఖ సీజ్ చేసిన ఇసుకను ప్రభుత్వ కట్టడాలకు వినియోగించాలని ఇంజినీరింగ్ అధికారులకుకమిటీ సూచించింది.

● ఇసుక అక్రమంగా తరలించినా, నిల్వ చేసినా, అమ్మకం చేసినా కఠిన చర్యలు తీసుకుంటారు. చట్ట ప్రకారం అటువంటి వారి వాహనాలను, ఇసుకను సీజ్ చేస్తారు. బాధ్యులకు రెండేళ్ల వరకు జైలుశిక్ష లేదా రెండు లక్షలు జరిమానా లేదా రెండు కలిపి విధిస్తారు.

వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్స

● జిల్లాలో 2500 కుక్కలకు
రూ.20లక్షలు కేటాయింపు

సాలూరు: వీధి కుక్కల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం సంతాన నిరోధక ఆపరేషన్లు చేయిస్తోంది. ఈ కుక్కలతో పసిపిల్లలు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఇది చివరకు అసెంబ్లీలో కూడా చర్చకు దారి తీసింది. జిల్లా, మండల స్థాయి సమావేశాల్లో కూడా చర్చలు జరిగాయి. వీటిన్నింటిపై స్పందించిన ప్రభుత్వం వీధి కుక్కల నివారణకు చర్యలు చేపట్టింది. జిల్లాలోని విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు మున్సిపాల్టీలు, నెల్లిమర్ల నగర పంచాయతీలో కలిపి సుమారు 2500 వరకు వీధి కుక్కలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వీటి నివారణకు



సాలూరులో సంచరిస్తున్న వీధి కుక్కలు

సంతాన నిరోధక శస్త్రచికిత్స కార్యక్రమాన్ని రూపొందించారు. ఒక్కో కుక్కకు ఈ ఆపరేషన్ చేసేందుకు రూ.800చొప్పున ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు ఇప్పటికే ఆయా మున్సిపాల్టీల కమిషనర్లు చర్యలు ప్రారంభించారు. బ్లూక్రాస్ సొసైటీ, శ్రీకాకుళం ఈ ఆపరేషన్లు చేస్తోంది.

ఖర్చులు ఇలా..

కుక్కను పట్టుకునేందుకు రూ.45, వైద్యుల ఫీజు రూ.100, ఆపరేషన్ తర్వాత మూడు రోజుల పాటు కుక్కకు షెల్టర్‌కు రూ.45, మందులు, ఏఆర్‌వీ తదితరాలకు రూ.425, మూడు నుంచి ఐదు రోజుల పాటు ఆహారం పెట్టుటకు రూ.100, వేడి నీటిలో కుక్కలను శుభ్రపరచుట, సర్జరీ తర్వాత శుభ్రం చేయుటకు రూ.35, క్లస్టర్ మున్సిపాల్టీకి రూ.50 మొత్తం రూ.800 ప్రభుత్వం చెల్లిస్తోంది. బొబ్బిలి మున్సిపాల్టీలో ఇప్పటికే సంతాన నిరోధక ప్రక్రియ మొదలు కాగా, ఇతర మున్సిపాల్టీల్లో ఆపరేషన్లు జరగాల్సి ఉంది.

11న జిల్లాకు మంత్రి లోకేష్ రాక

● ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు హాజరు
● ఇప్పటికే పార్టీ నాయకులకు సమాచారం

విజయనగరం టౌన్ : రాష్ట్ర పంచాయతీరాజ్, ఐటీ శాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈనెల 11, 12తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జడ్పీ ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడంతో పాటు, జడ్పీలో రూ.2కోట్లతో నిర్మితమైన మానవ వనరుల కేంద్రాన్ని కూడా ఆయన ప్రారంభించనున్నారు. విజయనగరంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. పార్టీ అగ్ర నాయకులు, పార్టీ శ్రేణులతో సమావేశం కానున్నారు. ఈ సమావేశాలు నిర్వహించాలన్న విషయం కేంద్ర మంత్రి అశోక్‌గజపతిరాజు నిర్ణయం మేరకు ఖరారవుతుంది. అయితే లోకేష్ పర్యటన పూర్తిగా విజయనగరం డివిజన్‌లో ఉంటుందా? లేకుంటే పార్వతీపురం డివిజన్‌లో కూడా ఉంటుందా అనే విషయమై ఇంకా స్పష్టత రాలేదు. ఈ నెల 9, 10 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పర్యటన అనంతరం విజయనగరం రానున్న నేపథ్యంలో పార్వతీపురం డివిజన్‌లో కూడా ఒకటి, రెండు ప్రాంతాల్లో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన కూడా ఉంది. లోకేష్ పర్యటనకు సంబంధించి ఈ నెల 5 లేదా 6న జిల్లా కమిటీ నాయకులు సమావేశమయ్యే అవకాశాలు కూడా కన్పిస్తున్నాయి.

మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా విజయనగరం వస్తున్న నేపథ్యంలో లోకేష్ పర్యటనను విజయవంతం చేసేందుకు జిల్లా పార్టీ ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం.

స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహిద్దాం

● ఉద్యోగుల ప్రశంసాపత్రాలకు 9లోగా ప్రతిపాదనలు పంపండి
● క్షేత్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి ప్రాముఖ్యత ఇవ్వండి
● ప్రభుత్వ, అభివృద్ధి పథకాల ప్రగతి 8లోగా సమర్పించండి
● కలెక్టర్ వివేక్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వివేక్‌యాదవ్, పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

విజయనగరం (కలెక్టరేట్): జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వివేక్‌యాదవ్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ విషయమై మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలకు ప్రతిపాదనలు ఈ నెల 9లోగా సీపీవోకి పంపాలన్నారు. 150 మందిని ఎంపిక చేయాలని సూచించారు. ఓడీఎఫ్ పంచాయతీలు, ఉపాధి హామీలో ఉత్తమ కనబర్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లా అధికారులు తమ శాఖల ప్రగతిని సీపీవోకి ఈనెల 5లోగా పంపాలని సూచించారు. జిల్లాలోని అన్ని శాఖల ప్రగతిని క్లుప్తంగా నివేదిక రూపంలో మంత్రి చదివేందుకు వీలుగా తయారు చేసి, ఈ నెల 8 లోగా సమర్పించాలని డీపీఆర్‌వోని ఆదేశించారు. పోలీస్ పరేడ్‌గ్రౌండ్, సాయంత్రం జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు సీఏ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులకు ప్రత్యేకంగా ఆహ్వానించి, వారికి ఏర్పాట్లు చేయాలన్నారు.

పరేడ్ గ్రౌండ్‌లో వివిధ శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేసి, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీకి చర్యలు చేపట్టాలని, ఆయా శాఖల అభివృద్ధి, కార్యక్రమాలు ప్రస్ఫుటించేలా శకటాల ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాగునీరు, వైద్య శిబిరం ఏర్పాటుచేయాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ-2 కె.నాగేశ్వరరావు, డీఆర్‌వో సాల్మన్‌రాజ్, ప్రత్యేక ఉప కలెక్టర్ శ్రీలత, ఆర్డీవోలు శ్రీనివాసమూర్తి, కె.సుదర్శనదొర, సీపీవో విజయలక్ష్మి కలెక్టరేట్ ఏవో రమణమూర్తి, బీసీ, ఎస్పీ కార్పొరేషన్ ఈడీలు నాగరాణి, రాజు, హౌసింగ్, డ్వామా పిడిలు రమణమూర్తి , రామచంద్రరావు, డీపీవో సత్యనారాయణ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జి.ఉషశ్రీ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా ఎస్‌ఈలు వేణుగోపాల్, రమణమూర్తి, డీఈవో అరుణకుమారి, డీపీఆర్‌వో డి.రమేష్, సెట్విజ్ సీఈవో సత్యనారాయణ, పోలీస్, అటవీ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ గృహ నిర్బంధం దారుణం

● జిల్లా తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకరరావు

దాసన్నపేట: కాపు నేత ముద్రగడ పద్మనాభం గృహ నిర్బంధం రాష్ట్ర ప్రభుత్వ మోసపూరిత విధానానికి నిదర్శనమని జిల్లా తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంట్యాకుల శంకరరావు తెలిపారు. మంగళవారం జిల్లా తెలగ సంఘ నాయకులు ఎన్‌సీఎస్ రోడ్డులో స్టీల్ కంచాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ముద్రగడ పాదయాత్రకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఉద్యమాలను ఎన్నాళ్లు ఆపగలుగుతారని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలుచేయలేదన్నారు. కాపుల సమస్యలను పరిష్కరిస్తే తమ సంపూర్ణ మద్దతు తెలుగుదేశంపార్టీకి అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలగ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు పెద్ది లక్ష్మీనారాయణ, సంఘ ప్రతినిధులు ముంగ నారాయణరావు, ఆకుల రమేష్, పిడుగు మురళి, కుందేటి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.



కంచాలు మోగిస్తున్న తెలగ సంఘ ప్రతినిధులు



పెద్దగెడ్డ స్పిల్‌వే

ఇదేం తీరువా!

● పంటలకు అందని సాగునీరు ● ముక్కుపిండి వసూలు చేస్తున్న నీటి తీరువా

● ప్రాజెక్టుల పరిధిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న శివారు రైతులు

(బలిజిపేట/పాచిపెంట/బొబ్బిలి రూరల్/తెర్లాం)

రైతాంగానికి సాగునీరు అందించి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ద్వారా పొలాలకు నీరందకపోయినప్పటికీ నీటి తీరువా కట్టడం తప్పడం లేదని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. బలిజిపేట మండలంలోని పణుకువలస మొదలుకొని వెంగళరాయపురం వరకు సుమారు పది గ్రామాల్లో 5 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో 30 ఏళ్ల కిందట ప్రభుత్వం రూ. కోట్లు వెచ్చించి సువర్ణముఖి నదిలో పెదంకలం వద్ద ఆనకట్ట నిర్మాణాన్ని చేపట్టింది. దీని ద్వారా సాగునీరు అందించి రైతులను ఆదుకునే సదుద్దేశంతో ప్రాజెక్టు రూపొందించారు. అయినప్పటికీ నేటి వరకు కాలువ శివారు భూములకు నీరందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శివారు ప్రాంతాలకు నీరే రాదు

ఈ ప్రాజెక్టులో పణుకువలస, అర సాడ, పదమాయవలస, రావివలస, నారాయణపురం, వెంగాపురం, బలిజిపేట, పలగర, గీతనాపల్లి, చిలకలపల్లి, తుమరాడ, పెదపెంకి, వెంగళరాయపురం, నూకలవాడతో పాటు శ్రీకాకుళం జిల్లా పోనంగిపాడు, ఇరువాడ, చౌదరివలస గ్రామాల పరిధిలోని ఐదు వేల ఎకరాలకు సాగునీరాందాల్సి ఉంది. ప్రాజెక్టు పరిధిలోని మొదటి గ్రామాలకు మాత్రమే సాగునీరు పరిమితమవుతోందని, చిలకలపల్లి మొదలుకుని శివారు గ్రామాలకు నీరందలేదని ఆరోపిస్తున్నారు.

తీరువా చెల్లిస్తున్నాం

నీరు అందకపోయినప్పటికీ నీటితీరువాను మాత్రం అధికారులు ముక్కు పిండి వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ప్రతి ఏటా రూ.కోట్ల వ్యయంతో మరమ్మతు పనులు చేపట్టి కాలువ శివారు భూములకు నీరందించాల్సి ఉండగా, ఆ దిశగా కనీస చర్యలు కనిపించడం లేదు. ఒకవైపు నీరు లేక, పంటలు పండక, నీటి తీరువా చెల్లించలేక అవస్థలు పడుతున్నామన్నారు. సాగు నీరు అందించండి, లేదంటే ఆ యకట్టు నుంచి తమ భూములను మినహా యించాలని గతంలో అనేకమార్లు ఉన్నతాధి కారులకు నివేదించినా పట్టించుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ లెక్కల్లో మాత్రం శివారు భూములకు నీరందుతున్నట్లు నివేదికలున్నా.. వాస్తవంగా చుక్కనీరు చేరడం లేదు. శివారు భూములకు నీరందించేందుకు వీలుగా ఈ ఏడాది ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని ప్రాజెక్టు చైర్మన్ మండల పాపినాయుడు చెప్పినప్పటికీ నీరందే పరిస్థితి కనిపించడం లేదని రైతులు చెబుతున్నారు. ప్రాజెక్టు చైర్మన్ ప్రకటనతో ఆ యకట్టు పరిధిలోని రైతులంతా వరి నారుమళ్లు వేసి, తీరా నీరందక పాలుపోని స్థితిలో ఉన్నారు.



ఎండుతున్న వరి నారు మళ్లు

ఖరీఫ్‌కు ప్రశ్నార్థకమే!..

ఈ ఏడాది ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో సాగు నీరందడం ప్రశ్నార్థకంగా మారింది. పెద్దగెడ్డ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 213.8 మీటర్లు, ప్రస్తుత నీటిమట్టం 208 మీటర్లుంది. కుడి కాలువ ద్వారా సాగునీరు విడిచిపెడితే జలాశయ నీటి మట్టం ఒక్కసారిగా భారీగా తగ్గిపోతుంది. వర్షాలు తక్కువ కావడం, అవీ రిజర్వాయర్ పైభాగాన కురవక పోవడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఇన్ ఫ్లో ఒక్క క్యూసెక్కూ లేకపోవడం, ఔట్‌ఫ్లో భారీగా ఇవ్వాల్సి రావడంతో జలాశయంలో నీరు వేగంగా తరిగిపోతోంది.

బొబ్బిలి మండలంలో

బొబ్బిలి మండలంలో వీఆర్ఎస్, తోట పల్లి ప్రాజెక్టుల కాలువలున్నప్పటికీ ఎగువ భూములకు నీరందడం లేదు. వీఆర్ఎస్ ద్వారా సుమారు 6,500 ఎకరాలకు నీరందగా, మరో 3500 ఎకరాలకు నీరందాలి. ప్రస్తుత ఖరీఫ్‌లో శివారుకు సాగునీరందడం గగనమే. తోటపల్లి ఎడమ కాలువ ద్వారా గతంలో 20 చెరువులు గుర్తించినప్పటికీ వాటికి అనుసంధానం చేస్తూ కాలువల నిర్మాణం జరగలేదు. రూ.లక్షలు విలువ చేసే భూములు రైతులు అందించినప్పటికీ అవసరానికి సాగు నీరు అందని పరిస్థితి ఎదురయిందని ప్రాజెక్టు ప్రాంత రైతాంగం వాపోతోంది.

తోటపల్లితోనే విముక్తి

తోటపల్లి ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా సాగునీరు అందిస్తే బొబ్బిలి మండలంతో పాటు మరిన్ని మండలాలు సస్యశ్యామలవుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. తెర్లాం మండలంలోని రైతులకు సాగునీరు కలగానే మిగిలిపోయింది. ఈ మండలంలో 460 చెరువులు, 1235 బోర్లు, బావులుండగా వర్షంపైనే ఆధారపడాల్సిన దుస్థితి.



పెద్దగెడ్డలో తగ్గిన నీటిమట్టం



పెదంకలం కాలువ ఇలా...

వంద పడకలేనా?

● స్థాయి పెంపునకు నోచుకోని ఎస్.కోట సామాజిక ఆసుపత్రి ● కాగితాలకే పరిమితమవుతున్న ప్రతిపాదనలు ● మెరుగైన వైద్యం అందక రోగులకు ఇబ్బందులు



శృంగవరపుకోట సామాజిక ఆసుపత్రి

(శృంగవరపుకోట)

● మూడు రోజుల కిందట ఉదయం 6.30 గంటల సమయంలో విశాఖ-అరకు రోడ్డుకు అనుకుని వున్న ఓ టిఫిన్ దుకాణంలోకి కారు దూసుకుపోయింది. ఇందులో పని చేస్తున్న ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం శృంగవరపుకోట సామాజిక ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో వైద్యులెవరూ అందుబాటులో లేక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

● వారం రోజుల కిందట ఓ నిండు గర్భిణి ప్రసవ వేదనతో ఆసుపత్రికి వచ్చింది. ఉమ్మనీరు తక్కువగా ఉండటంతో తక్షణం శస్త్ర చికిత్స చేయాలని విజయనగరం ఘోషా ఆసుపత్రికి రిఫర్ చేశారు.

వంద పడకల ఆసుపత్రిగా స్థాయి పెంచితే ఇప్పుడున్న వైద్యులు, సిబ్బంది, సదుపాయాలు మూడింతలు పెరుగుతాయి. అత్యవసర విభాగంలో ఏ సమయంలోనైనా శస్త్రచికిత్సలు నిర్వహించే వీలుంటుంది. ప్రస్తుతం వున్న 50 పడకల ఆసుపత్రి కారణంగా నిపుణులైన వైద్యులు అంతంతమాత్రంగానే ఉన్నారు. వీరందరికీ రాత్రి సమయంలో కాల్ డ్యూటీలు కావడంతో అందుబాటులో ఉండటం లేదు. దీంతో వివిధ ప్రమాదాల్లో క్షతగాత్రులు, అత్యవసర వైద్యం అందాల్సిన వారు, ప్రసవ వేదనతో వచ్చే గర్భిణులకు వెంటనే వైద్యం అందడం లేదు. వీరు వచ్చిన తరువాత సిబ్బంది వైద్యులకు ఫోన్‌ద్వారా సమాచారం ఇస్తుండటంతో వారొచ్చే వరకు రోగులు ఇబ్బంది పడుతూ వుండాల్సిందే. తీరా వైద్యులు వచ్చాక అరకొర సదుపాయాలను చూపించి విజయనగరం, విశాఖపట్టణం రిఫర్ చేస్తున్నారు. నిత్యం ఇలాంటి పరిస్థితులు ఇక్కడ ఎదురవుతూనే ఉన్నాయి. ఈ ఆసుపత్రి స్థాయిపెంచితే ఇప్పుడున్న ఈ పరిస్థితులు తప్పుతాయి. ప్రత్యేక వైద్యుల నియామకం జరుగుతుంది. దాదాపు 15 నుంచి 20 మంది వైద్యనిపుణులుంటారు. స్టాఫ్ నర్సులు 20 నుంచి 25 మంది వరకు వస్తారు. అన్ని రకాల సిబ్బంది పెరుగుతారు. దాదాపు అన్ని రకాల కేసులకు వైద్యం అందుతుంది. ఆసుపత్రి అన్ని విధాలా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ప్రత్యేక వార్డులు ఏర్పాటు అవుతాయి. ఈ నేపథ్యంలో రోగులు ఏలాంటి వ్యాధికైనా ప్రైవేటు ఆసుపత్రిని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండదు.

ప్రతిపాదనలు కాగితాలకే...

సామాజిక ఆసుపత్రి నుంచి ప్రాంతీయ ఆసుపత్రిగా స్థాయి పెంచేందుకు గత పదేళ్లుగా ప్రయత్నాలు సాగుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలో వున్న సమయంలో మంత్రి బొత్స సత్యనారాయణ వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. అప్పట్లో వైద్య ఆరోగ్య అధికారులు ప్రాంతీయ ఆసుపత్రిగా సూచిక బోర్డులను పెట్టుకోవాలని ఆదేశించారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆసుపత్రి స్థాయి పెంపునకు పలుదపాలు హామీ ఇచ్చారు. ప్రతి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలోనూ తీర్మానం చేసి పంపుతున్నారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన కనిపించడం లేదు. జిల్లా కేంద్ర ఆసుపత్రులకు 60 కిటోమీటర్ల లోపునున్న ప్రాంతాల్లో ప్రాంతీయ ఆసుపత్రుల మంజూరు చేయడం సాధ్యమ కాదని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల సమన్వయ కర్త డాక్టర్ ఉషశ్రీ అంటున్నారు. ఈ లెక్కన ఈ ఆసుపత్రి స్థాయి పెంపు కలే.

ఓపీకి నిత్యం 250 నుంచి 300 మంది

శృంగవరపుకోట సామాజిక ఆసుపత్రి విశాఖపట్టణం గిరిజన ప్రాంతాలకు ముఖద్వారం. ప్రధానంగా ఈ ఆసుపత్రికి అత్యధిక శాతం రోగులు ఈ జిల్లాకు చెందిన అరకు, అనంతగిరి, డుమ్రిగూడ మండలాలకు చెందిన గిరిజనులు. వీరితో పాటు శృంగవరపుకోట, వేపాడ, జామి, లక్కవరపుకోట, కొత్తవలస మండలాలతో పాటు గంట్యాడ మండలానికి చెందిన ప్రజలు ఇక్కడ వైద్య సహాయం పొందుతున్నారు. దీంతో నిత్యం 250 నుంచి 300 వరకు ఓపీకి వస్తారు. మలేరియా, డయేరియా వంటి వ్యాధుల బారిన పడి అప్పుడప్పుడు మరింత ఎక్కువమంది ఆశ్రయిస్తారు. ఇలాంటి సందర్భాల్లో ఒకే పడకపై ఇద్దరు సర్దుకుంటున్న సంఘటనలున్నాయి. దీనిని ప్రాంతీయ ఆసుపత్రిస్థాయికి పెంచితేనే ఇలాంటి సమస్యలకు విముక్తి లభిస్తుందని, ఉన్నత వైద్యం అందుబాటులోకి వస్తుందని ఈ ప్రాంత వాసులు అభిప్రాయపడుతున్నారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దీనిపై మరింత దృష్టి సారించి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి సమస్యలు తీసుకువెళ్తే ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నారు.



సామాజిక ఆసుపత్రిలో ఇబ్బందుల మధ్య రోగులు



ఓపీ విభాగానికి వచ్చిన వివిధ ప్రాంత ప్రజలు



వినూత్నం... విభిన్నం

● కొత్త పథకాలతో ప్రజల ముంగిట ఆర్టీసీ ● ప్రమాద బీమా వర్తింపు

● వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులకు రాయితీ ● పక్షోత్సవాలతో మరిన్ని పథకాలు

(మెంటాడ)

"వేగం కాదు ముఖ్యం.. సుఖము, సురక్షిత ప్రయాణమూ లక్ష్యం" నినాదంతో నడుస్తున్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సరికొత్త పథకాలు, రాయితీలతో ప్రజలను ఆకట్టుకుంటోంది. ఇందులో భాగంగా ప్రయాణికులకు ప్రమాద బీమా వర్తింపు, వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులకు రాయితీతో కూడిన ప్రయాణాన్ని అందిస్తోంది. ఇప్పటికే ప్రైవేటు వాహనాల తాకిడితో ఉక్కిరిబిక్కిరి అవుతుండటంతో వివిధ పథకాలతో ప్రయాణికులను ఆకర్షించేందుకు సిద్ధమయింది. ఇందులో భాగంగా ఆర్టీసీ పక్షోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా వయోవృద్ధులకు మరిన్ని రాయితీలను ప్రకటించింది. ప్రమాదంలో ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారి కుటుంబాలకు బీమా వర్తింపజేసి ఆసరాగా నిలుస్తోంది. ఆర్టీసీ అంజిస్తున్న పలు సేవలను విస్తృత పరిచేందుకు ఏటా ఈ పక్షోత్సవాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా కేవలం ఆధార్ కార్డు సహాయంతో వివిధ రాయితీలతో కూడిన కార్డులను నిర్దేశించిన ధరకు అందిస్తోంది.

ఉచిత బస్‌పాస్‌లు

విద్యను ప్రోత్సహించే దిశగా ఆర్టీసీ అందిస్తున్న సౌలభ్యం ఉచిత బస్‌పాస్. వీటిని 12 ఏళ్లలోపు విద్యార్థులకు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారికి అందిస్తారు. పదోతరగతి వరకు చదువుకునే విద్యార్థినులకు ఉచిత పాస్ అందిస్తారు.

వికలాంగులకు ప్రత్యేకం

వికలాంగులకు సంస్థ ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తోంది. బస్సులో సీటు కేటాయించడమే కాకుండా వారి ప్రయాణంలో రాయితీ అందిస్తోంది. 40 శాతం అంగవైకల్యం ఉన్నట్టు ధ్రువీకరణ పత్రం ఉంటే పాసు వర్తిస్తుంది. ఏడాదిపాటు 50 శాతం రాయితీ అందుతుంది. నూరుశాతం అంగవైకల్యం ధ్రువీకరణ ఉంటే, వెంట ఉండేవారికి 50 శాతం రాయితీతో ఈ పాస్ ... అందిస్తుంది.

హెచ్‌ఐవీ రోగులకు

హెచ్‌ఐవి రోగులుగా ప్రభుత్వ వైద్యులతో ధ్రువీకరణ పత్రం పొందిన వారికి ఈ పాస్‌లను అందిస్తారు. ప్రయాణంలో వీరితో పాటు సహాయకునికి కూడా 50 శాతం రాయితీ వర్తిస్తుంది. ప్రతి ఏటా ఓఆర్ (ఆక్యుపెన్సీ రేషియో) పెంచుకునే క్రమంలో భాగంగా వివిధ వినూత్న పథకాలతో ప్రజల ముంగిటకు ఆర్టీసీ వస్తోంది. దీని ద్వారా ప్రైవేటు వాహనాల తాకిడిని తట్టుకుంటూనే సంస్థ ఆర్థికాభివృద్ధికి, మెరుగైన రవాణాను అందించేందుకు కృషి చేస్తోంది.

వనిత ఫ్యామిలీ కార్డు

దారిద్ర్య రేఖకు దిగువన ఉండేవారంతా తెల్లరేషన్‌కార్డు కలిగిన వారు. వీరికి ఈ కార్డు ఎంతో ఉపయుక్తం. కుటుంబం మొత్తానికి ప్రయాణంలో పది శాతం రాయితీతో పాటు ప్రమాద సమయంలో రూ.1.5లక్షలు బీమాను సంస్థ అందిస్తోంది. ఈ కార్డు కావాల్సిన వారు కేవలం రూ .100 చెల్లిస్తే సరిపోతుంది. అదనంగా మరో రూ 20 చెల్లిస్తే వనిత యాడ్ ఆన్‌కార్డు పొందవచ్చు.

వృద్ధులకు 25 శాతం తక్కువ

ఆర్టీసీ ఎటువంటి పాస్‌లు అందించకుండా వృద్ధులకు వారి వయసు ధ్రువీకరణ ఆధారంగా తక్షణం బస్సులోనే అందించే రాయితీ ఇది. 60 ఏళ్లు నిండిన వృద్ధులు తమ వయసు ధ్రువీకరణ పత్రాలైన ఆధార్, పాన్‌కార్డు, రేషన్‌కార్డులలో ఏదో ఒకటి చూపి ప్రయాణంలో 25శాతం రాయితీ పొందవచ్చు.

నవ్యకార్డుతో రాయితీ

ప్రస్తుతం కొనసాగుతున్న క్యాట్ కార్డు స్థానంలో నవ్యకార్డును ప్రవేశపెట్టనుంది. ఈ కార్డు పొందేందుకు ఏడాదికి రూ.250 చెల్లించాలి. దీంతో ప్రతి ప్రయాణంలో 10 శాతం రాయితీ, పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్‌డీలక్స్ బస్సుల్లో వినియోగించుకోవచ్చు.

రెన్యువల్‌కు రూ.150

నవ్య క్యాట్ కార్డును రెండో ఏడాదికి కొనసాగింపు తీసుకుంటే కేవలం రూ.150 చెల్లిస్తే సరిపోతుంది. టిక్కెట్ ధర 10 శాతంతో పాటు ప్రమాద బీమా వర్తిస్తుంది.

యాడాన్‌కార్డుతో నలుగురికి మేలు

నవ్యకార్డు దారులతో పాటు మరొకరికి తక్కువ ధరకు సమాన రాయితీతో బీమా సౌకర్యం కల్పించే కార్డు ఇది. నవ్యకార్డున్న వారు సంస్థకు మరో రూ.100 చెల్లిస్తే ఈ కార్డు ఇస్తారు. కుటుంబంలో భార్య భర్త, పెళ్లికాని ఇద్దరు పిల్లల వరకు కార్డు పొందవచ్చు. నవ్య కార్డుకు అందే పదిశాతం రాయితీ, బీమా సౌకర్యం వర్తిస్తాయి.



కర్రి సత్యనారాయణను సన్మానిస్తున్న బొబ్బిలి యువరాజు బేబినాయన

కళా తృష్ణ

● స్టేజి కళాకారులను ఆదుకుంటున్న నట సమాఖ్య

● సొంత డబ్బుతో కళలను ప్రోత్సహిస్తున్న సత్యనారాయణ

(బొబ్బిలి)

పాశ్చాత్య సంస్కృతి, సంప్రదాయాలకు అలవాటుపడిపోయిన నేటి సమాజంలో కనుమరుగవుతున్న స్టేజీ కళాకారులను ఆదుకుని, వారిలోని కళను ప్రోత్సహించి, ప్రదర్శనలు ఇప్పిస్తూ తన కళాభిమానాన్ని, కళా తృష్ణను తీర్చుకుంటున్నారు బొబ్బిలికి చెందిన నట సమాఖ్య అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ. ఇతను గతంలో ఎంపీడీవోగా, వ్యవసాయాధికారిగా, అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు. విద్యార్థి దశ నుంచి స్టేజిపై నాటికలు, ఇతర పద్య పౌరాణిక నాటికలు వేసి ప్రేక్షకుల్ని రంజింప జేసిన నటుడాయన. తనలోని కళాభిమానాన్ని వదులుకోలేక 1999లో బొబ్బిలిలో నటసమాఖ్య సంస్థను స్థాపించి దాని ద్వారా ఎంతో మంది స్టేజి కళాకారులకు అవకాశాలిప్పించారు. అంతరించిపోతున్న పద్య, గద్య, నాటక, పౌరాణిక, అష్టావధాన కార్యక్రమాలను తన సొంత డబ్బుతో ప్రతి ఏటా ఏర్పాటు చేస్తూ ఆ కళలకు ప్రాణం పోస్తున్నారు.

సేవాభిమానిగా..

కళాకారులను, ఉత్తమ అధికారులను, సంఘ సంస్కర్తలను స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులను వారు చేసిన సేవలకు తగ్గట్టుగా ఎప్పటికప్పుడు సన్మానిస్తున్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో అనేక ప్రతిష్టాత్మక, సాంస్కృతిక సంస్థలకు సత్యనారాయణ గౌరవాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఇతనికి విశాఖపట్టణానికి చెందిన ఎన్టీఆర్ కళాపరిషత్ సంస్థ కళాభిమాని పురస్కారంతో గౌరవించగా, అదే నగరానికి చెందిన విశాఖ రత్న కళాక్రియేషన్స్ కళారత్న పురస్కారంతో గౌరవించింది. ఈయన కళామ్మ తల్లికి చేస్తున్న సేవలు చూసి బొబ్బిలి యువరాజ బేబినాయన, ఆయన సోదరుడు సుజయకృష్ణరంగారావు అనేక సందర్భాల్లో సత్కరించారు. సత్యనారాయణ కళారంగానికే కాక ఆధ్యాత్మిక రంగంలోనూ తనదైన శైలిలో ముద్ర వేసుకుంటూ తన స్వగ్రామం మల్లంపేటలో కోదండ రామ, షిరిడీ సాయిబాబా ఆలయాలను నిర్మించి దైవభక్తిని చాటుకున్నారు.

ఆయన ఓ కళాకారుడు. స్టేజిపై ఎన్నో ప్రదర్శనలిచ్చి ప్రేక్షకులను రంజింపజేసిన నటుడు. అంతేకాదు వివిధ హోదాల్లో ప్రభుత్వ ఉద్యోగం చేసి విరమణానంతరం తనలోని కళాతృష్ణను తీర్చుకునేందుకు నట సమాఖ్యను స్థాపించారు. ఎంతో మంది కళాకారుల వెనకుండి ముందుకు నడిపిస్తున్నారు. అంతరించిపోతున్న కళలకు చేయూతనిచ్చి భవిష్యత్ తరాలకు అందులోని ఆనందాన్ని అందిస్తున్నారు బొబ్బిలికి చెందిన సత్యనారాయణ.



బొబ్బిలి కళాభారతిలో నరమేధం నాటిక

కళ అంతరించిపోకూడదు

చిన్ననాటి నుంచి నాకు నాటికలు, పౌరాణిక నాటకాలు, స్టేజీ నాటికలు ఎంతో ఇష్టం. కళాశాల చదువు వరకు అనేక స్టేజీ ప్రోగ్రాంలు వేసేవాడిని. ప్రస్తుతం సినిమా ప్రభావం కారణంగా నాటికలు, పౌరాణిక నాటికలు కనుమరుగవుతున్నాయి. వాటిని కాపాడేందుకు నటసమాఖ్యను స్థాపించి కళామతల్లిని బతికించుకునేందుకు ప్రయత్నిస్తున్నా. భవిష్యత్తు తరాలకు ఈ కళల సారాన్ని అందించడమే లక్ష్యం. తుది శ్వాస వరకు కళామతల్లి సేవకు అంకితమవుతాను.

-కర్రి సత్యనారాయణ, నటసమాఖ్య అధ్యక్షుడు, బొబ్బిలి





● రూ.130 కోట్లతో 30 కొండ శిఖర గ్రామాలకు రహదారులు
● ఉపాధి హామీ, ప్రత్యేక నిధులు మంజూరు
● ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

గిరికి బాటలు!

గుమ్మలక్ష్మీపురం: కొండపై గల గిరిజన గ్రామాలకు ఎట్టకేలకు రహదారులు వేయనున్నారు. శిఖర గ్రామాలకు రోడ్లు లేకపోవడంతో గిరిజనులు అన్నింటా వెనుకబడివున్నారు. మౌలిక సదుపాయాలకు సైతం నోచుకోలేదు. విద్య, వైద్యం, నిత్యావసర సరుకులకు కొండదిగాల్సిందే. సరైన రహదారులు లేకపోవడంతో నానా ఇబ్బందులు పడేవారు. ఎట్టకేలకు జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కొండ శిఖర గ్రామాలకు రోడ్లు వేసేందుకు ముందుకురావడంతో గిరిపుత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు మంజూరు....

ఐటీడీఏ పరిధిలోని గిరిజన మండలాల్లోని కొండ శిఖర గ్రామాలకు రహదారులు వేయడానికి సుమారు రూ.130కోట్లు వరకు నిధులు ఖర్చు చేయనున్నారు. ఇందులో భాగంగా భద్రగిరి గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ సబ్ డివిజన్‌కు 30రోడ్లు మంజూరయ్యాయి. ఉపాధి హామీ పథకం, స్పెషల్ డెవలప్‌మెంట్ ప్రొగ్రాం నిధులు ఖర్చు చేయాలని కలెక్టర్ వివేక్‌యాదవ్ పరిపాలనా అనుమతి ఇచ్చారు. సంబంధిత గిరిజన సంక్షేమశాఖ ఇంజినీర్లు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. ఈరహదారుల్లో మట్టి పనిని ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో కూలీలచే, కొండలపై గల పనులను యంత్రాలచే చేయడానికి ఎస్‌డీపీ నిధులు ఖర్చు చేయ నున్నారు. ఈ పనులను ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వీటీడీఏల ద్వారా చేపట్టేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. పనులకు సంబంధించి ప్రణాళిక సిద్ధమైంది.



కొండపై ఉన్న గిరిజన గ్రామం

గతంలో నిలిచిన పనులు

గతంలో సువర్ణ పండాదాస్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పనిచేసిన సమయంలో కొండలపై గల పలు గ్రామాలకు రోడ్లు వేయించారు. ఆయన బదిలీ తరువాత పలు కారణాల వల్ల రహదారుల నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుత పీవో డాక్టర్ లక్ష్మీశ కొండ శిఖర గ్రామాలకు రహదారులు వేయాలన్న కృతనిశ్చయంతో ఉన్నారు. ఈ రహదారులు వేస్తే మారుమూల గిరిజన ప్రజలకు రవాణా, విద్య, వైద్య సేవలు అందుతాయి. గతంలో కొండ శిఖర గ్రామస్థులు సైతం పలుమార్లు రహదారి నిర్మాణం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగారు. ఎట్టకేలకు రోడ్డు పనులు మంజూరు కావడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శుభపరిణామం

ఎట్టకేలకు కొండ శిఖర గ్రామాలకు రహదారులు మంజూరు చేయడం ఆనందంగా ఉంది. ఈపనులను త్వరితగతిన పూర్తిచేసేలా చూడాలి. రోడ్డు సదుపాయం లేకపోవడంతో అన్నింటా వెనుకబడిపోయాం. పనులు మంజూరు చేసిన కలెక్టర్ వివేక్ యాదవ్, ఐటీడీఏ పీవో డాక్టర్ లక్ష్మీశకు ధన్యవాదాలు.

- కడ్రక కళావతి, సర్పంచ్



పనులు పూర్తి చేస్తాం

కొండ శిఖర గ్రామాల రహదారులకు కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం. పంచాయతీ సర్పంచ్‌లు, వీటీడీఏల ద్వారా రహదారుల పనులు చేపడతాం.

- డాక్టర్ లక్ష్మీశ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి

సమాచారం

సివిల్స్ ర్యాంకర్ గోపాలకృష్ణకు నేడు సన్మానం



గజపతినగరం రూరల్: ఆలిండియా స్థాయిలో సివిల్స్‌లో 3వ ర్యాంకు సాధించిన రోణంకి. గోపాలకృష్ణకు బుధవారం మార్కెట్‌యార్డులోని సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎస్ఐ పి.వరప్రసాద్ తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సుతో పాటు గోపాలకృష్ణకు అభినందన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ పాలరాజు, సీఐ లీలారావు హాజరవుతారని తెలిపారు.

రాష్ట్ర వాలీబాల్ అండర్-14 ఎంపిక కమిటీ సభ్యుడిగా సూరిబాబు



కొత్తవలస: రాష్ట్ర వాలీబాల్ అండర్-14 ఎంపిక కమిటీ సభ్య డిగా జిల్లాలోని కొత్తవలసకు చెందిన జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు గవర సూరిబాబు ఎంపికయ్యారు. ప్రస్తుతం సూరిబాబు విశాఖపట్టణం పోర్టుట్రస్టు వాలీబాల్ కోచ్‌గా వ్యవహరిసున్నాడు. ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు ప్రకాశం జిల్లా గూడూరులో అండర్-14కు సంబంధించిన బాలురు, బాలికల అంతర్ జిల్లాల వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తారు. ఎంపిక కమిటీకి సంబంధించి సభ్యుడిగా సూరిబాబును రాష్ట్ర వాలీబాల్ అసోయేషన్ ప్రకటించింది. సూరిబాబును ఎంపిక కావడం పట్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఛైర్మన్ గొరపల్లి జయప్రకాష్, అధ్యక్షుడు కృష్ణంరాజు, కార్యదర్శి భగవాన్‌దాస్, కొత్తవలస స్పోర్ట్స్ అండ్‌గేమ్స్ అధ్యక్షుడు మహేంద్ర అభినందనలు తెలిపారు.

జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఛైర్మన్‌గా గొరపల్లి

కొత్తవలస: జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఛైర్మన్‌గా కొత్తవలసకు చెందిన మాజీ ఎంపీపీ గొరపల్లి జయప్రకాష్ (శివ)ను రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ నియమించింది. ఈమేరకు నియామక పత్రాన్ని జయప్రకాష్‌కు పంపించారు. అలాగే జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్కవరపుకోట మండలం, బీమాళి గ్రామానికి చెందిన కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శిగా విజయనగరానికి చెందిన భగవాన్‌దాస్‌ను, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు గవర సూరిబాబును నియమించారు.

రైతు వ్యతిరేక ప్రభుత్వం

● ప్రాజెక్టుల స్థితిగతులపై త్వరలో నాయకుల పర్యటన ● వైసీపీ నేత చిన్నశ్రీను



విలేఖరులతో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా కన్వీనర్ చిన్నశ్రీను

దాసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు అయినప్పటికీ రైతాంగాన్ని పూర్తిగా విస్మరించిందని వైసీపీ జిల్లా వ్యవహారాల కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) విమర్శించారు. మంగళవారం సత్యాకార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కేంద్ర మంత్రి అశోక్ జాడ లేదని, రాష్ట్ర మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావుకు ప్రాజెక్టులపై అవగాహన లేదని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జిల్లాలోని రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తోటపల్లి, పెద్దగెడ్డ, తారకరామతీర్థసాగర్, జంఘావతి తదితర ప్రాజెక్టులకు అధిక శాతం నిధులు మంజూరు చేశారన్నారు. తోటపల్లి పనులు 90 శాతం వరకు పూర్తయ్యాయని కేవలం పది శాతం మాత్రమే మిగిలాయని తెలిపారు. ఆ పనులను తెలుగుదేశం ప్రభుత్వం పూర్తి చేయాల్సి ఉందని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఆనాడే చెప్పారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చినా ఆ పనులు పూర్తి చేయలేక పోయిందన్నారు. ఏడాదికి రైతులకు రూ.13 వందల కోట్లు బ్యాంక్‌లు రుణాలు మంజూరు చేయాల్సి ఉండగా కేవలం రూ.450 కోట్లు రుణాలు మాత్రమే ఇచ్చారని తెలిపారు. జిల్లాలోని ప్రాజెక్టు పరిస్థితులు, రైతుల సమస్యలపై పార్టీ నేతలు పది రోజుల్లో జిల్లాలో పర్యటిస్తారని చెప్పారు. సమావేశంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఉపాధ్యక్షుడు చనుముళ్ల వెంకటరమణ, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కె.వి.సూర్యనారాయణ రాజు, వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవనాపు విజయ్, అలజంగి జోగారావు, ఎం.ఎల్.ఎన్.రాజు పాల్గొన్నారు.

పది కళాశాలలకు వసతి గృహాలు

కలెక్టరేట్: జిల్లాలోని కొత్తగా పది కళాశాలలకు వసతి గృహాలను ఏర్పాటు చేశామని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె.సునీల్‌రాజకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం, ఎస్‌కోట, గజపతినగరం, చీపురుపల్లి, కొత్తవలస, బలిజిపేటలో బాలుర వసతి గృహాలు, పార్వతీపురం, కొత్తవలస, గజపతినగరం, విజయనగరం సుంకరివీధిలో బాలికల వసతి గృహాలు ఏర్పాటు చేశామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న పది మంది వార్డెన్లను బీసీ వెల్ఫేర్‌కు డిప్యుటేషన్‌పై సర్దుబాటు చేశామని పేర్కొన్నారు.

'వృద్ధులను గౌరవించడం మన బాధ్యత'

దాసన్నపేట: సమాజంలో వృద్ధులను గౌరవించడం మన బాధ్యతని ఎస్పీ పాలరాజు అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వృద్ధులను గౌరవిస్తే, సమాజంలో మరింత గౌరవం పెరుగుతుందన్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో కూడా వృద్ధులను గౌరవించే కార్యక్రమానికి శ్రీకారం చుడతామన్నారు. వృద్ధులు ఒకప్పుడు ఎంతో పనిచేసి వుంటారని, వారి అనుభవాలను నేటి యువత పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగాలని కోరారు. వృద్ధులపై ఎవరైనా దాడులకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రోటర్లీ క్లబ్ ప్రతినిధులు సోమయాజులు, వీఎస్ఎన్ కుమార్‌తో పాటు, రోటరీ క్లబ్ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సహకార బ్యాంకులకు... ఆదాయ పన్ను రద్దు చేయండి

● విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ రాఘవేంద్రరావు

దాసన్నపేట: సహకార బ్యాంకులకు ఆదాయ పన్నును రద్దు చేయాలని విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు కేంద్రప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం విజయనగరం పట్టణంలోని టీటీడీ కల్యాణమండపంలో బ్యాంకు డైరెక్టర్, సభాధ్యక్షుడు గుడివాడ భాస్కరరావు అధ్యక్షతన విజయనగరం బ్రాంచి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ ప్రపంచంలోని చాలా దేశాల్లో సహకార బ్యాంకుల్లో ఆదాయపన్ను లేదన్నారు. యూపీఏ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉన్న చిదంబరం సహకార బ్యాంకులను వ్యాపార బ్యాంకులుగా పరిగణిస్తూ ఆదాయ పన్ను వేయాలని నిర్ణయించారన్నారు. బీజేపీ భ్రుత్వం అధికారంలోకి వస్తే సహకార బ్యాంకులకు ఆదాయ పన్ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని, నేటికీ అమలు చేయలేదని తెలిపారు.



మాట్లాడుతున్న ఛైర్మన్ రాఘవేంద్రరావు

ఈవిషయమై కేంద్రమంత్రి అరుణ్‌జెట్లీని కలిసి వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని వాపోయారు. సహకార బ్యాంకు 1916లో ఏర్పాటైందన్నారు. నాటి నుంచి నేటి వరకు విజయవంతంగా నడుస్తోందని చెప్పారు. అర్బన్ బ్యాంకు నిబంధనలకు అనుకూలంగా పనిచేస్తుందని తెలిపారు. ఇంతవరకు ఏ ప్రభుత్వం నుంచి కూడా సాయం పొందలేదన్నారు. నేడు సుమారు రూ.17వేల కోట్ల డిపాజిట్లతో రూ.18వేల కోట్లు రుణాలు ఇచ్చామని చెప్పారు. విశాఖ కోఆపరేటివ్ బ్యాంకుల్లో డబ్బులు డిపాజిట్ చేసిన వారికి 6శాతం వడ్డీ ఇస్తున్నామన్నారు. సమావేశంలో బ్రాంచి మేనేజర్ చంద్రశేఖర్, డైరెక్టర్లు ప్రసాదరావు, పద్మావతి, రామకృష్ణారావు, శివప్రకాశ్‌తో పాటు బ్యాంకు ప్రతినిధులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బ్యాంకు డైరెక్టర్లు, ఉద్యోగులు, సిబ్బంది

ఆలోచన విధానం, సునిశిత దృష్టి.. ప్రధానం

పోలిక పరీక్ష

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో పదం, దానికి ఒక సంబంధం ఇస్తారు. మరో పదం ఇచ్చి ఆ పదానికి కూడా అలాంటి సంబంధాన్నే తెలపమని అడుగుతారు. ఈ విభాగంలోని ప్రశ్నల్లో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు కూడా ఉంటాయి. అభ్యర్థి ఆలోచన విధానం, విజ్ఞానం, సునిశిత దృష్టి, పరిశీలనాత్మకతను అంచనా వేయడమే ఈ పరీక్ష ముఖ్యోద్దేశం. ఇందులో మూడు రకాల ప్రశ్నలు ఉంటాయి. అవి..

1. పదాల పోలిక పరీక్ష
2. వర్ణమాల అక్షరాల పోలిక పరీక్ష
3. సంఖ్యలతో పోలిక పరీక్ష



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

మోడల్ - 1

1. చాక్‌పీస్: నల్లబల్ల:: ---- : పలక
ఎ) కలం బి) పెన్సిల్ సి) బలపం డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: నల్లబల్లపై చాక్ పీస్‌తో రాస్తారు. అదేవిధంగా పలకపై బలపంతో రాస్తారు.

2. విటమిన్ ఎ : రేచీకటి :: ----- : రికెట్స్
ఎ) విటమిన్ బి బి) విటమిన్ సి
సి) విటమిన్ డి డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: విటమిన్ ఎ లోపంతో వచ్చే వ్యాధి రేచీకటి. అదేవిధంగా విటమిన్ డి లోపంతో వచ్చే వ్యాధి రికెట్స్

3. పత్రం: క్లోరోఫిల్ :: రక్తం : -----
ఎ) కెరొటిన్ బి) జాంథోఫిల్
సి) హిమోగ్లోబిన్ డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: పత్రాల ఆకులు పచ్చగా ఉండటానికి కారణం క్లోరోఫిల్. అదేవిధంగా రక్తం ఎర్రగా ఉండడానికి కారణం హిమోగ్లోబిన్

4. ధర్మామీటర్: ఉష్ణోగ్రత :: అమ్మీటర్ : -------
ఎ) విద్యుత్ బి) ఉష్ణం సి) తేమ డి) వేగం
సమాధానం : **ఎ**
వివరణ: ఉష్ణోగ్రతను కొలిచే సాధనం ధర్మామీటర్. అలాగే విద్యుత్‌ను కొలిచేది అమ్మీటర్

5. రైతు : పొలం :: శాస్త్రజ్ఞుడు: -------
ఎ) కర్మాగారం బి) పాఠశాల
సి) ప్రయోగశాల డి) రంగస్థలం
సమాధానం: **సి**
వివరణ: రైతు పనిచేసే ప్రదేశం పొలం. అదేవిధంగా శాస్త్రవేత్త పనిచేసే ప్రదేశం ప్రయోగశాల

6. పక్షులు : ఆర్నిథాలజీ::గుండె: ------
ఎ) హెమటాలజీ బి) కార్డియాలజీ
సి) సెమన్‌టిక్స్ డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: పక్షులను గురించి వివరించే శాస్త్రం ఆర్నిథాలజీ. అదేవిధంగా హృదయ స్పందన గురించి వివరించే శాస్త్రం కార్డియాలజీ

7. రైతు : నాగలి :: సైనికుడు: ---------
ఎ) తుపాకి బి) కత్తి సి) సూది డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: నాగలిని ఉపయోగించే వ్యక్తి రైతు. అదేవిధంగా తుపాకిని ఉపయోగించే వ్యక్తి సైనికుడు

8. పాల స్వచ్ఛత: లాక్టోమీటర్ :: భూకంపాలు: ---
ఎ) బారోమీటర్ బి) అనిమోమీటర్
సి) ఆడో మీటర్ డి) సిస్మోగ్రాఫ్
సమాధానం: **డి**
వివరణ: పాల స్వచ్ఛతను కొలిచే పరికరం లాక్టోమీటర్. అలాగే భూకంప తీవ్రతను కొలిచే సాధనం సిస్మోగ్రాఫ్

9. బలం: వాట్ :: విద్యుత్ : --------
ఎ) జౌల్ బి) డిగ్రీ సి) ఆంపియర్ డి) సెకండ్స్
సమాధానం: **సి**
వివరణ: బలానికి ప్రమాణం వాట్ అలాగే విద్యుత్‌కు ప్రమాణం ఆంపియర్

10. ముఖేష్: హాకీ :: చెస్ : -------
ఎ) గగన్ నారంగ్ బి) హరి కృష్ణ
సి) లక్ష్మణ్ డి) ఎవరూకాదు
సమాధానం: **బి**
వివరణ: ముఖేష్ హాకీ క్రీడాకారుడు. అలాగే హరికృష్ణ చెస్ క్రీడాకారుడు

11. కొలంబో : శ్రీలంక :: ------ : ఆఫ్ఘనిస్థాన్
ఎ) ఇస్లామాబాద్ బి) కాబూల్ సి) తింపు డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: శ్రీలంక రాజధాని కొలంబో. అలాగే ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్

12. హస్తినాపురం : న్యూఢిల్లీ :: మద్రాస్ : -----
ఎ) చెన్నై బి) పనాజి సి) కోల్‌కతా డి) ముంబై
సమాధానం: **ఎ**
వివరణ: హస్తినాపురానికి కొత్త పేరు న్యూఢిల్లీ, అలాగే మద్రాస్‌కు కొత్త పేరు చెన్నై

13. భరతనాట్యం: తమిళనాడు :: యక్షగానం: -------
ఎ) కేరళ బి) మహారాష్ట్ర సి) కర్ణాటక డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: తమిళనాడు శాస్త్రీయ నృత్యం భరత నాట్యం. కర్ణాటక శాస్త్రీయ నృత్యం యక్షగానం

14. న్యూజిలాండ్ జాతీయ పక్షి : కివి :: మన జాతీయ పక్షి : --------
ఎ) నెమలి బి) పావురం సి) చిలుక డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: న్యూజిలాండ్ జాతీయ పక్షి కివి అదేవిధంగా మన జాతీయ పక్షి నెమలి.

15. చార్మినార్: హైదరాబాద్ :: తాజ్‌మహల్:-------
ఎ) న్యూఢిల్లీ బి) ఆగ్రా సి) మీరట్ డి) ఔరంగాబాద్
సమాధానం: **బి**
వివరణ: చార్మినార్ హైదరాబాద్‌లో ఉంది. తాజ్‌మహల్ ఆగ్రాలో ఉంది.

16. ఇండియా : రూపాయి :: జపాన్ : -------
ఎ) డాలర్ బి) ఫ్రాంక్ సి) యన్ డి) దీనార్
సమాధానం: **సి**
వివరణ: ఇండియా కరెన్సీ రూపాయి. జపాన్ కరెన్సీ యన్

17. గ్రహాలు : ఖగోళ శాస్త్రం :: నాణేలు : -----------
ఎ) సిస్మోగ్రాఫ్ బి) పేలియోగ్రఫీ
సి) పాథాలజీ డి) న్యూమిస్‌మాటిక్స్
సమాధానం: **డి**
వివరణ: గ్రహాల గురించి వివరించే శాస్త్రం ఖగోళశాస్త్రం. అలాగే నాణేల గురించి వివరించే శాస్త్రం న్యూమిస్‌మాటిక్స్

18. ఆర్య సమాజం: దయానంద సరస్వతి:: రామకృష్ణ మిషన్: --------
ఎ) అనిబిసెంట్ బి) స్వామి వివేకానంద
సి) నివేదిత డి) ఎవరూకాదు
సమాధానం: **బి**
వివరణ: ఆర్య సమాజ స్థాపకుడు దయానంద సరస్వతి. అదేవిధంగా రామకృష్ణ మిషన్ స్థాపకుడు స్వామి వివేకానంద

19. స్వామి వివేకానంద: నరేంద్రదత్:: దయానంద సరస్వతి: -------
ఎ) గధాధరుడు బి) మూల శంకర్
సి) రామచందర్ డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: స్వామి వివేకానంద అసలు పేరు నరేంద్ర దత్. దయానంద సరస్వతి అసలు పేరు మూల్ శంకర్

20. మెగస్తనీస్: ఇండికా:: పాణిని: -----------
ఎ) అష్టాధ్యాయి బి) హర్ష చరిత్ర
సి) చరక సంహిత డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: మెగస్తనీస్ రచించిన గ్రంథం ఇండికా, అదేవిధంగా పాణిని రచించిన గ్రంథం అష్టాధ్యాయి.

21. పాస్కల్: ఒత్తిడి:: ఆంపియర్: -------
ఎ) విద్యుత్ బి) బలం సి) శక్తి డి) స్వచ్ఛత
సమాధానం: **ఎ**
వివరణ: పాస్కల్ అనేది ఒత్తిడికి ప్రమాణం. అలాగే ఆంపియర్ అనేది విద్యుత్‌కు ప్రమాణం

22. కన్నడం: కర్ణాటక:: మరాఠీ: -------
ఎ) మధ్యప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) గుజరాత్ డి) రాజస్థాన్

23. హాంకాంగ్: చైనా:: వాటికన్: --------
ఎ) నార్వే బి) డెన్మార్క్
సి) నెదర్‌లాండ్ డి) రోమ్
సమాధానం: **డి**
వివరణ: చైనాలోని ఒక నగరం హాంకాంగ్. అలాగే రోమ్‌లోని నగరం వాటికన్ సిటీ

24. ఇన్సులిన్: హార్మోన్::ట్రిప్సిన్: -------
ఎ) ఎంజైమ్ బి) విటమిన్ సి) హార్మోన్ డి) గ్రంధి
సమాధానం: **ఎ**
వివరణ: ఇన్సులిన్ అనేది హార్మోన్. అలాగే ట్రిప్సిన్ అనేది ఒక ఎంజైమ్

25. వినడం: చెముడు:: మాట్లాడడం: --------
ఎ) నిశ్శబ్దం బి) మూగ సి) శాంతి డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: వినలేకపోవడం చెముడు అలాగే మాట్లాడలేకపోవడం మూగ

26. భాక్రానంగల్: సట్లెజ్:: హీరాకుడ్ : -------
ఎ) గోదావరి బి) కృష్ణ సి) కావేరి డి) మహానది
సమాధానం: **డి**
వివరణ: భాక్రానంగల్ డ్యామ్ సట్లెజ్ నదిపై ఉంది అలాగే హీరాకుడ్ డ్యామ్ మహానదిపై ఉంది.

27. హరిత విప్లవం: మొక్కలు:: నీలి విప్లవం: ------
ఎ) చేపలు బి) పాలు సి) నూనె గింజలు డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: మొక్కల అధికోత్పత్తికి చేపట్టిన కార్యక్రమం హరిత విప్లవం. అలాగే చేపల అధిక దిగుబడికి చేపట్టిన కార్యక్రమం నీలి విప్లవం

28. తూర్పు: వాయవ్యం:: నైరుతి: ----
ఎ) ఈశాన్యం బి) తూర్పు సి) ఆగ్నేయం డి) ఉత్తరం
సమాధానం: **బి**
వివరణ: తూర్పునకు 135 డిగ్రీల అపసవ్యదిశ వాయవ్యం. నైరుతికి 135 డిగ్రీల అపసవ్య దిశ తూర్పు

29. సత్యజిత్ రే: సినిమా:: పికాసో: ------
ఎ) రచయిత బి) నాటక కర్త
సి) చిత్రకారుడు డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: సినిమా రంగానికి చెందిన ప్రముఖుడు సత్యజిత్ రే. అలాగే సుప్రసిద్ధ చిత్రకారుడు పికాసో

30. రెస్టారెంట్: మెను:: లైబ్రరీ: -----
ఎ) చదువు బి) పుస్తకాలు సి) విద్య డి) క్యాటలాగ్
సమాధానం: **డి**
వివరణ: మెను అనేది ఐటెమ్స్ లిస్ట్. కేటలాగ్ అనేది బుక్స్ లిస్ట్

31. ఓనం: కేరళ:: బిహు: ------
ఎ) కర్ణాటక బి) మిజోరాం సి) అసోం డి) ఒడిశా
సమాధానం: **సి**
వివరణ: కేరళ ప్రజలు చేసుకొనే పండుగ ఓనం. అసోం ప్రజలు చేసుకొనే పండుగ బిహు

32. ప్రమాదం: అజాగ్రత:: వ్యాధులు: -------
ఎ) అపరిశుభ్రత బి) వైద్యుడు
సి) మందులు డి) వైద్యం సమాధానం: **ఎ**
వివరణ: అజాగ్రత్తతో ప్రమాదం లభిస్తుంది. అలాగే అపరిశుభ్రత వల్ల వ్యాధులు ప్రబలుతాయి.

33. శిల్పం: రూపం:: పాట ------
ఎ) సంగీతం బి) గానం సి) చెప్పలేం డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: శిల్పానికి మంచి రూపం ఉండాలి. అలాగే పాటకు మంచి గానం ఉండాలి.

అడ్మిషన్స్

ఐఎన్ఎటి 2017

పుణెలోని ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐయుసిఏఏ), నేషనల్ సెంటర్ ఫర్ రేడియో ఆస్ట్రో ఫిజిక్స్ (ఎన్‌సిఆర్ఏ) సంస్థల్లో పిహెచ్‌డి చేసే వారికి ఉద్దేశించిన రీసెర్చ్ స్కాలర్‌షిప్‌నకు ప్రకటన విడుదలైంది.
విభాగాలు: ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, ఫిజిక్స్
అర్హత: ఆగస్టు నాటికి 55 శాతం మార్కులతో (బిఎస్సీ/ ఎమ్మెస్సీ/ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ)(ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్స్/ ఆస్ట్రానమీ/ అప్లయిడ్ మేథమెటిక్స్) లేదా బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ పూర్తి.
ఎంపిక: ఐయుసిఏఏ - ఎన్‌సిఆర్ఏ అడ్మిషన్ టెస్ట్(ఐఎన్ఎటి 2017), ఇంటర్వ్యూ ద్వారా
పరీక్ష కేంద్రం: ఐయుసిఏఏ, పుణె
ఇంటర్వ్యూ: డిసెంబరు 7, 8
వేదిక: ఎన్‌సిఆర్ఏ - టిఐఎఫ్ఆర్, పుణె
దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 15, 2017
వెబ్‌సైట్: http://inat.ncra.tifr.res.in/inat

పుణె పాలిటెక్నిక్

పుణెలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ - **అడ్వాన్స్‌డ్ డిప్లొమా(ఆటోమోటివ్ మెకట్రానిక్స్)** ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ స్కిల్ బేస్డ్ జాబ్ ఓరియంటెడ్ కోర్సును **'మెర్సిడెజ్ - బెంజ్'** సహకారంతో నిర్వహిస్తున్నారు.
కోర్సు వ్యవధి: ఏడాది
అర్హత: డిప్లొమా/ డిగ్రీ (ఇంజనీరింగ్)
ఎంపిక: ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా
ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఆగస్టు 18
పూర్తి వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చు.
వెబ్‌సైట్: www.gppuneamc.org

ఎయిమ్స్

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- పిహెచ్‌డి ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన **'ఆన్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్'**కు దరఖాస్తులు కోరుతోంది.
ఎగ్జామినేషన్ తేదీ: సెప్టెంబరు 8
పరీక్ష కేంద్రం: ఢిల్లీ/ ఎన్‌సిఆర్
ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 3, 2017
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 17, 2017
వెబ్‌సైట్: www.aiimsexams.org

డిఎస్‌సి

ద ఢిల్లీ స్కూల్ ఆఫ్ కమ్యూనికేషన్(డిఎస్‌సి)- పీజీ(కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. మ్యాట్/ క్యాట్ అర్హత పొంది ఉండాలి. లేదా డిఎస్‌సి ఇంటర్నల్ అడ్మిషన్ టెస్ట్‌లో అర్హత పొంది ఉండాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 7, 2017
వెబ్‌సైట్: www.dsc.edu.in/


డిఐఎంహెచ్

చెన్నైలోని డైరెక్టరేట్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ అండ్ హోమియోపతి (డిఐఎంహెచ్)- బిఎస్ఎంఎస్/ బిఏఎంఎస్/ బిఎన్‌వైఎస్/ బియుఎంఎస్/ బిహెచ్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: హయ్యర్ సెకండరీ
క్యాంపస్‌లు: తిరునల్వేలి. చెన్నై, మధురై, కన్యాకుమారి **దరఖాస్తు ఫీజు:** రూ.500
అప్లికేషన్ డౌన్‌లోడింగ్‌కు చివరి తేదీ: ఆగస్టు 30, 2017
హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31, 2017
చిరునామా: The Secretary, Selection Committee, Directorate of Indian Medicine and Homoeopathy, Arignar Anna Govt.Hospital of Indian Medicine Campus, Arumbakkam, Chennai-600106
వెబ్‌సైట్: www.tnhealth.org

‘ద లైఫ్ డివైన్’ గ్రంథ రచయిత ఎవరు?

హోంరూల్ ఉద్యమం

1. భారతదేశం బ్రిటిష్ సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉంటూ స్వయంపాలన సాగించుకొనే స్థితిని సాధించే లక్ష్యంతో ప్రారంభమైన ఉద్యమం?
ఎ) సహాయనిరాకరణ ఉద్యమం
బి) హోంరూల్ ఉద్యమం
సి) క్విట్ ఇండియా ఉద్యమం డి) ఉప్పుసత్యాగ్రహం
2. హోంరూల్ లీగ్‌ను 1916 ఏప్రిల్‌లో స్థాపించింది?
ఎ) బాలగంగాధర్ తిలక్ బి) సుబ్రమణ్య అయ్యర్
సి) సి.పి.రామస్వామి అయ్యర్ డి) పి.కె.తెలాంగ్
3. హోంరూల్ అనే పదాన్ని ఏ ఉద్యమం నుంచి స్వీకరించారు?
ఎ) గ్రీక్ ఉద్యమం బి) లాటిన్ ఉద్యమం
సి) ఐరిష్ ఉద్యమం డి) గ్రీన్‌పీస్ ఉద్యమం
4. 1916 సెప్టెంబరులో హోంరూల్ లీగ్‌ను స్థాపించింది?
ఎ) మోతీలాల్ నెహ్రూ బి) అనిబిసెంట్
సి) పి.కె.తెలాంగ్ డి) ఎస్.సుబ్రమణ్య అయ్యర్
5. 1897లో హోంరూల్ లీగ్ అనే పదాన్ని మొట్టమొదట ఉపయోగించింది?
ఎ) శ్యాంజీ కృష్ణవర్మ బి) శ్రీకృష్ణ కార్పడే
సి) నరసింహచింతామన్ కేల్కర్
డి) మోతీలాల్ నెహ్రూ
6. ‘న్యూ ఇండియా’ పత్రికను స్థాపించింది?
ఎ) శ్యాంజీ కృష్ణవర్మ బి) బి.పి.వాడియా
సి) జె.ఎస్.అరుండేల్ డి) అనిబిసెంట్
7. ‘ఇండియన్ ఉమెన్స్ అసోసియేషన్’ అనే సంస్థను స్థాపించింది?
ఎ) మహమ్మద్ అలీ జిన్నా
బి) అంబికా చరణ్ మజుందర్
సి) అనిబిసెంట్ డి) సురేంద్రనాథ్ బెనర్జీ
8. 1885లో Fabian societyలో చేరి Fabian Essays అనే పత్రికలో సోషలిజం మీద వ్యాసాలు రాసింది?
ఎ) అనిబిసెంట్ బి) భగవాన్‌దాస్
సి) బి.పి.వాడియా డి) జె.ఎస్.అరుండేల్
9. అనిబిసెంట్ దివ్యజ్ఞాన సమాజంలో ఎప్పుడు చేరారు?
ఎ) 1885 బి) 1889 సి) 1895 డి) 1899
10. బెనారస్‌లో ‘కేంద్రీయ హిందూ కళాశాల’ను స్థాపించింది?
ఎ) గాంధీ బి) రాస్‌బిహారి ఘోష్
సి) అనిబిసెంట్ డి) బాలగంగాధర్ తిలక్
11. ‘భగవద్గీత’ను అనిబిసెంట్ ఎవరి సహకారంతో ఆంగ్లంలోకి అనువదించారు?
ఎ) రాస్‌బిహారి ఘోష్ బి) బి.పి.వాడియా
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) డాక్టర్ భగవాన్ దాస్
12. భారతీయులు పాశ్చాత్య సంప్రదాయాల పట్ల ఆకర్షితులు కావడాన్ని వ్యతిరేకించింది?
ఎ) సాండర్స్ బి) అనిబిసెంట్
సి) చెమ్స్‌ఫర్డ్ డి) మాంటేగ్
13. 1907లో కల్నల్ ఆల్కాట్ మరణం తరవాత దివ్యజ్ఞాన సమాజ బాధ్యతలు చేపట్టింది?
ఎ) అనిబిసెంట్ బి) బాలగంగాధర్ తిలక్
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) జె.ఎస్.అరుండేల్
14. ‘ద లైఫ్ డివైన్’ అనే గ్రంథాన్ని రచించింది?
ఎ) అరవింద్‌ఘోష్ బి) తిలక్
సి) లాలాలజపతిరాయ్ డి) బిపిన్ చంద్రపాల్
15. 1895-1907 మధ్య బెనారస్ కేంద్రంగా హిందూ మతం గురించి ఉపన్యాసాలు చేసింది?
ఎ) పి.కె.తెలాంగ్ బి) ఎస్.సుబ్రమణ్య అయ్యర్
సి) సి.పి.రామస్వామి అయ్యర్ డి) అనిబిసెంట్
16. 1916 లక్నో సమావేశంలో అతివాదులు తిరిగి కాంగ్రెస్ చేరడంలో కీలక పాత్ర పోషించింది?
ఎ) అనిబిసెంట్ బి) సురేంద్రనాథ్ బెనర్జీ
సి) రాస్‌బిహారి ఘోష్
డి) బాలకృష్ణ శివరాం మోహన్‌జీ
17. 'Englands difficulty is Indian opportunity' అనే నినాదాన్ని ఇచ్చింది?
ఎ) చాంబర్లీన్ బి) అనిబిసెంట్
సి) బి.పి.వాడియా డి) మహమ్మద్ అలీ జిన్నా
18. కాంగ్రెస్, ముస్లిం లీగ్ మధ్య 1916లో లక్నో ఒడంబడిక జరగడంలో కీలక పాత్ర పోషించింది?
ఎ) సి.పి.రామస్వామి అయ్యర్
బి) పి.కె.తెలాంగ్
సి) అనిబిసెంట్ డి) బి.పి.వాడియా
19. ‘న్యూ ఇండియా’ డైలీ ఎప్పుడు ధరావతును కోల్పోయింది?
ఎ) 1914 బి) 1912 సి) 1915 డి) 1916
20. హోంరూల్ ఉద్యమానికి ప్రతిస్పందిస్తూ ఆగస్టు ప్రకటన చేసింది?
ఎ) చాంబర్లీన్ బి) మాంటేగ్
సి) హార్డింజ్ డి) పాల్ రిచర్డ్
21. ఏ సంవత్సరంలో అనిబిసెంట్ రాజకీయ రంగప్రవేశం చేస్తూ భారతదేశానికి హోంరూల్ ఇవ్వాలని కోరారు?
ఎ) 1911 బి) 1912 సి) 1913 డి) 1914
22. 1917లో ఏ ఐఎన్‌సి సమావేశానికి అనిబిసెంట్ నాయకత్వం వహించారు?
ఎ) కలకత్తా బి) బొంబాయి సి) మద్రాసు డి) గౌహతి
23. ఐఎన్‌సికి అధ్యక్షత వహించిన తొలి మహిళ?
ఎ) దుర్గాభాయి దేశ్‌ముఖ్ బి) విజయలక్ష్మి పండిట్
సి) నిర్మలాదేశ్ పాండే డి) అనిబిసెంట్



కె. చెంచుకుమార్
సీనియర్ ఫ్యాకల్టీ

పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ



బాలగంగాధర్ తిలక్



అనిబిసెంట్

24. ‘బాయ్ స్కౌట్ అసోసియేషన్’ అనే సంస్థను స్థాపించింది?
ఎ) మహాత్మాగాంధీ బి) అనిబిసెంట్
సి) మోతీలాల్ నెహ్రూ
డి) వినాయక దామోదర్ సావర్కర్
25. మద్రాసులోని అడయార్‌లో అనిబిసెంట్ స్థాపించిన జాతీయ విశ్వవిద్యాలయానికి చాన్సలర్‌గా వ్యవహరించింది?
ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్ బి) శ్యాంజీ కృష్ణవర్మ
సి) విజయలక్ష్మి పండిట్ డి) బి.పి.వాడియా
26. 1916 మేలో చిత్తూరు జిల్లాలోని మదనపల్లిలో ‘థియోసాఫికల్ కళాశాల’ను స్థాపించింది?
ఎ) జె.ఎం.చటర్జీ బి) చాంబర్లీన్
సి) అనిబిసెంట్ డి) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య
27. అనిబిసెంట్ ముఖ్య శిష్యుడు?
ఎ) కొండా వెంకటప్పయ్య
బి) పర్వతనేని వీరయ్య చౌదరి
సి) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య డి) జిడ్డు కృష్ణమూర్తి
28. 'At the feet of master' గ్రంథ రచయిత?
ఎ) జిడ్డు కృష్ణమూర్తి బి) నీలకంఠ బ్రహ్మచారి
సి) అనిబిసెంట్ డి) విజయలక్ష్మి పండిట్
29. బ్రిటిష్ సారథ్యం కింద ఉంచుతూనే భారతీయులకు క్రమానుగతంగా స్వయం పరిపాలన ఇస్తామని ప్రకటన చేసిన భారత రాజ్య కార్యదర్శి?
ఎ) మింటో బి) మాంటేగ్ సి) మార్లే డి) హార్డింజ్
30. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌లో ముఖ్యపాత్ర పోషించింది?
ఎ) గణేష్ శ్రీకృష్ణ కార్పడే
బి) నరసింహ చింతామన్ కేల్కర్
సి) బాలకృష్ణ శివరాం మోహన్‌జీ డి) పైవారందరూ
31. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు అధ్యక్షుడిగా పని చేసింది?
ఎ) చాంబర్లీన్ బి) మార్లే
సి) జోసెఫ్ బాప్టిస్టా డి) పి.కె.తెలాంగ్
32. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు కార్యదర్శి?
ఎ) పాల్ రిచర్ట్ బి) కేల్కర్
సి) మీరా రిచర్డ్ డి) ఎస్.పి.సిన్హా
33. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ ఉద్యమం ఏయే ప్రాంతాలకు పరిమితం అయింది?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) కర్ణాటక డి) బి, సి
34. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరించింది?
ఎ) సర్ ఎస్.సుబ్రమణ్య అయ్యర్
బి) కేల్కర్ సి) జోసెఫ్ బాప్టిస్టా
డి) బాలగంగాధర్ తిలక్
35. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు ప్రధాన కార్యదర్శులుగా వ్యవహరించింది?
ఎ) జోసెఫ్ బాప్టిస్టా బి) సి.పి.రామస్వామి అయ్యర్
సి) పి.కె.తెలాంగ్ డి) బి, సి
36. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ ఉద్యమం ఏయే ప్రాంతాలకు విస్తరించింది?
ఎ) దక్షిణ భారతదేశం బి) బీహార్, బెంగాల్
సి) యునైటెడ్ ప్రావిన్స్, సింధు డి) పైవన్నీ
37. అనిబిసెంట్ కృషి ఫలితంగా ఏ ఐఎన్‌సి సమావేశంలో బాలగంగాధర్ తిలక్ కాంగ్రెస్‌లో చేరారు?
ఎ) కలకత్తా బి) బొంబాయి సి) లక్నో డి) పూనా
38. 1916లో జరిగిన లక్నో కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షత వహించింది?
ఎ) రాస్‌బిహారి ఘోష్
బి) అంబికా చరణ్ మజుందర్
సి) అరుండేల్ డి) వాడియా
39. భారతదేశానికి స్వపరిపాలన ఇవ్వాలని ఏ ఐఎన్‌సి సమావేశం తీర్మానించింది?
ఎ) లక్నో బి) భోపాల్ సి) అమృత్‌సర్ డి) లాహోర్
40. కాంగ్రెస్, ముస్లింలీగ్ మధ్య రాజ్యాంగ సంస్కరణల విషయమై కుదిరిన ఒడంబడిక ఎప్పుడు జరిగింది?
ఎ) 1915 బి) 1916 సి) 1917 డి) 1918
41. Common Schemeను రూపొందించడంలో ముఖ్యపాత్ర వహించింది?
ఎ) మహాత్మాగాంధీ బి) బాలగంగాధర్ తిలక్
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) మోతీలాల్ నెహ్రూ
42. 1916 డిసెంబర్‌లో ఏ ప్రాంతంలో సమావేశమై కాంగ్రెస్, ముస్లింలీగ్‌లు ఒక సామన్య ప్రణాళిక కోసం చెరొక కమిటీని నియమించాయి?
ఎ) మద్రాస్ బి) తిరువనంతపురం
సి) లక్నో డి) బెంగళూరు
43. హోంరూల్ ఉద్యమ కాలం?
ఎ) 1916-18 బి) 1920-22 సి) 1930-32 డి) 1940-42
44. భారతదేశ వైశ్రాయిగా 1916లో నియమితులైనది?
ఎ) మార్లే బి) లార్డ్ చెమ్స్‌ఫర్డ్
సి) మింటో డి) లార్డ్ కర్జన్
45. శాడ్లర్ కమిషన్‌ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
ఎ) 1914 బి) 1915 సి) 1916 డి) 1917
46. ‘వందేమాతరం’ అనే పత్రికను నడిపిన అతివాద నాయకుడు?
ఎ) మహాత్మాగాంధీ బి) అరవింద్ ఘోష్
సి) తిలక్ డి) లాలాలజపతి రాయ్
47. మితవాద రాజకీయాలను Policy of prayer, petition and protestగా అభివర్ణించింది?
ఎ) తిలక్ బి) లాలాలజపతిరాయ్
సి) అరవింద్ ఘోష్ డి) బిపిన్ చంద్రపాల్
48. ‘సావిత్రి’ అనే గ్రంథం రచించింది?
ఎ) మదన్ మోహన్ మాలవ్యా
బి) లాలాలజపతిరాయ్
సి) బాలగంగాధర్ తిలక్ డి) అరవింద్ ఘోష్
49. అరవింద్ ఘోష్ జన్మస్థలం?
ఎ) గౌహతి బి) కలకత్తా
సి) భువనేశ్వర్ డి) మద్రాసు

సమాధానాలు

1) బి	8) ఎ	15) డి	24) బి	33) డి	42) సి
2) ఎ	9) బి	16) ఎ	25) ఎ	34) ఎ	43) ఎ
3) సి	10) సి	17) బి	26) సి	35) డి	44) బి
4) బి	11) డి	18) సి	27) డి	36) డి	45) సి
5) ఎ	12) బి	19) డి	28) ఎ	37) సి	46) బి
6) డి	13) ఎ	20) బి	29) బి	38) బి	47) సి
7) సి	14) ఎ	21) సి	30) డి	39) ఎ	48) డి
		22) ఎ	31) సి	40) బి	49) బి
		23) డి	32) బి	41) డి	

JOBS ఉద్యోగాలు

నీతి ఆయోగ్

నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా ఆయోగ్ (నీతి ఆయోగ్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 173
పోస్టులు - ఖాళీలు: అడ్వైజర్/ సీనియర్ అడ్వైజర్ 7, జాయింట్ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, డిప్యూటీ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ 28, రీసెర్చ్ ఆఫీసర్(ఫ్లెక్సీ పూల్) 28, ఎకనామిక్ ఆఫీసర్ (ఫ్లెక్సీ పూల్)28, ఎకనామిక్ ఆఫీసర్ 44
అర్హత: పోస్టును అనుసరించి పీజీ/ ఎంబీబీఎస్
వయసు: 26 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 25, 2017
వెబ్‌సైట్: www.niti.gov.in

సఫ్దర్‌జంగ్ హాస్పిటల్

ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ హాస్పిటల్- జూనియర్ రెసిడెంట్ (నాన్ పీజీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 58
కాంట్రాక్ట్ వ్యవధి: ఏడాది
అర్హత: ఎంబీబీఎస్ డిగ్రీ ఉత్తీర్ణత + ఢిల్లీ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు పొంది ఉండాలి. అభ్యర్థులు 2015 జూలై 1 తరవాతనే ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి.
ఎంపిక: రాత పరీక్ష, కౌన్సెలింగ్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.500 (ఒబిసిలకు రూ.250 కాగా ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు మినహాయింపు వర్తిస్తుంది).
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును నిర్దేశిత చిరునామాకు పంపాలి
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 10, 2017
చిరునామా: The Medical Superintendent, Safdarjung Hospital & VMMC, New Delhi- 110029
వెబ్‌సైట్: www.vmmc.sjh.nic.in/

ఇండియన్ ఆర్మీ

ఇండియన్ ఆర్మీ కింది పోస్టుల భర్తీకోసం విడివిడిగా దరఖాస్తులు కోరుతోంది.
లా గ్రాడ్యుయేట్స్
ఖాళీలు: 14 (పురుషులకు 10, మహిళలకు 4 పోస్టులు కేటాయించారు)
అర్హత: 55 శాతం మార్కులతో లా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు మూడేళ్ల అనుభవం ఉండాలి. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా/ స్టేట్‌లో రిజిస్ట్రేషన్‌కు అర్హత పొంది ఉండాలి.
వయసు: 21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 23, 2017
ఎన్‌సిసి స్పెషల్ ఎంట్రీ (43 కోర్స్)
ఖాళీలు: 54 (పురుషులకు 50, మహిళలకు 4 పోస్టులు కేటాయించారు)
అర్హత: ఎన్‌సిసి సర్టిఫికెట్‌తోపాటు 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. బ్యాటిల్ క్యాజువాలిటీస్/ ఆర్మీ పర్సనల్ పిల్లలకైతే ఎన్‌సిసి సర్టిఫికెట్ అవసరం లేదు.
వయసు: 19 నుంచి 25 ఏళ్లు
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 23, 2017
కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ **ఖాళీలు:** 142
ట్రేడ్స్ వారీ ఖాళీలు: మెటీరియల్ అసిస్టెంట్ 6, ఎల్‌డిసి 1, ఫార్మసిస్ట్ 1, టెలీ ఆపరేటర్ 1, ఫైర్‌మన్ 36, ట్రేడ్స్‌మన్(మేట్) 94, ఎంటిఎస్ 1, దోబి 1, టైలర్ 1
అర్హత: పోస్టును అనుసరించి బిఇ/ బిటెక్/ డిఫార్మసీ/ డిప్లొమా / ఇంటర్/ 10వ తరగతి
వయసు: పోస్టును అనుసరించి 18 నుంచి 27 ఏళ్లు
ఎంపిక: ఫిజికల్ అండ్యూరెన్స్ టెస్ట్, స్కిల్ టెస్ట్, రాత పరీక్ష ఆధారంగా.
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును స్పీడ్ / రిజిస్టర్డ్/ ఆర్డినరీ పోస్టుద్వారా నిర్దేశిత చిరునామాకు పంపాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 16, 2017
చిరునామా: Commandant 21 Field Ammunition Depot - 909721
వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in

ఆంధ్రజ్యోతి
13
కురుపాం
బుధవారం 2 ఆగస్టు 2017
కురుపాం । గుమ్మలక్ష్మీపురం । జియ్యమ్మవలస । కొమరాడ । గరుగుబిల్లి

నేడు వాలీబాల్ ఫైనల్ పోటీలు

ఎల్విన్‌పేట (గుమ్మలక్ష్మీపురం): ఎల్విన్‌పేటలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ ఫైనల్స్ పోటీలను బుధవారం నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపారు. ఇటీవల మండలంలోని దుడ్డుఖల్లు, బొడ్డెంఖర్ల, కొత్తగూడ, ఎల్విన్‌పేట కేంద్రాల్లో వాలీబాల్ పోటీలను నిర్వహించామని, ఈ పోటీల్లో విజయం సాధించిన 8 బృందాలను కలుపుతూ ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఫైనల్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. గిరిజన యువతలో ప్రతిభను వెలికితీయడానికి ఈ పోటీలే దోహదం చేస్తాయని ఆయన స్పష్టం చేశారు.

వ్యాక్సిన్లు ఎంతగానో ఉపయోగకరం

గరుగుబిల్లి: చిన్నారుల ఆరోగ్యానికి వ్యాక్సిన్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంపీపీ జి.ఉషాసరస్వతి, వైస్ ఎంపీపీ ధనుంజయరావు అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పిల్లలకు టీకాలు వేయించుకొనేందుకు తల్లిదండ్రులను ప్రోత్సహించాలన్నారు. రావివలస, గరుగుబిల్లి వైద్యాధికారులు డాక్టర్ ఎన్.రజని, ఆర్‌వీ రేవతి మాట్లాడుతూ మండలంలో సెప్టెంబర్ 8వ తేదీ వరకు టీకాల వేయనున్నట్టు చెప్పారు. ఎంపీహెచ్‌ఈవో బొత్స శ్రీరాములునాయుడు మాట్లాడుతూ ప్రతి రోజూ 200 మందికి ఒక బృందం టీకాలు వేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఛైర్మన్ పెద్దింటి పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గరుగుబిల్లిలో టీకాలు వేస్తున్న దృశ్యం

రావాడరామభద్రపురంలో..

కురుపాం: కురుపాంలో విద్యార్థులకు తట్టు, పొంగు నివారణ టీకాలు వేశారు. మంగళవారం ఈ కార్యక్రమంలో భాగంగా కురుపాంలో రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టీకాలు వేశారు. ఈ సందర్భంగా కేజీబీవీలో పీహెచ్‌సీ వైద్యాధికారి వి.భాగ్యశ్రీ, ఏఎంసీ ఛైర్మన్ కోలా రంజిత్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ అందవరపు కోటేశ్వరరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బండి రాజు విద్యార్థులకు ఎంఆర్ టీకాలు వేసినట్టు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి, కేజీబీవీ ప్రత్యేకాధికారి శ్రీరంజని, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డీవీఎస్ఎస్ అరుణ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హెచ్ఎం నారాయణరావు, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పిల్లలకు ఎంఆర్ టీకాలు వేస్తున్న దృశ్యం

ఏజెన్సీలో కానరాని బయోమెట్రిక్ హాజరు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో బయోమెట్రిక్ హాజరు విధానం కానరావడం లేదు. ఎంపీడీవో కార్యాలయం, ఆసుపత్రులు, వెలుగు కార్యాలయం, వివిధ విద్యా సంస్థల్లో బయోమెట్రిక్ ఏర్పాటు చేసినా అమలుకావడం లేదు. ఏజెన్సీ మండలాల్లో 90 శాతం మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు వారు పనిచేసే గ్రామాల్లో, మండల కేంద్రాల్లో ఉండటం లేదు. వీరందరూ పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, తదితర ప్రాంతాల నుంచి రోజూ వస్తూ, వెళుతుంటారు. ఈ కారణంగా ఏజెన్సీలో ఉద్యోగాల సమయపాలన ఆశించిన విధంగా ఉండదు. ఈ కారణంగా బయోమెట్రిక్ విధానం అమలుకు చిత్తశుద్ధి కానరావడం లేదు. నెట్‌వర్క్ లేదని, యంత్రాలు పనిచేయడం లేదని, వచ్చిన యంత్రాలు అమర్చలేదని ఇలా వివిధ సాకులు చెబుతుంటారు. ఏజెన్సీలోని ప్రభుత్వ సంస్థల్లో బయోమెట్రిక్ విధానం శత శాతం అమలైతే ఉద్యోగుల పనితీరు మెరుగుపడి గిరిజన ప్రజలకు మరిన్ని సేవలందుతాయి. జిల్లా ఉన్నతాధికారులు బయోమెట్రిక్ హాజరు విధానం అమలుకు చిత్తశుద్ధిగా కృషి చేయాలని గిరిజన నాయకులు కోరుతున్నారు. అంతేకాకుండా ఏజెన్సీలో చాలా మంది ఉద్యోగులు ఆడిందే ఆటగా పాడిందే పాటగా ఉద్యోగాలు చెయ్యడంతో ఈ విధానానికి తూట్లు పొడుస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

పాఠశాలలకు ఏజెన్సీల ద్వారా గుడ్లు

● **భోజన నిర్వాహకులకు కళ్లెం**

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల పరిధిలోని విద్యార్థినీ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి ఏజెన్సీల నుంచి గుడ్లు సరఫరా చేస్తున్నారు. మండలానికి 52 పాఠశాలలకు ప్రత్యేక వాహనంపై గుడ్లు సరఫరా చేస్తున్నారు. గతంలో భోజన నిర్వాహకులకే ప్రభుత్వం గుడ్ల బాధ్యత అప్పగించింది. సక్రమంగా గుడ్లు అందించకపోవడంతో విమర్శలు వచ్చాయి. దీంతో నేరుగా పాఠశాలలకు అప్పగించేలా ఏజెన్సీలకు ప్రభుత్వం అప్పగించింది. ప్రస్తుతం సరఫరా చేస్తున్న గుడ్లకు మొదటి వారం పసుపు రంగు, రెండవ వారం ఎరుపు రంగు, మూడవ వారం గులాబీ రంగు, నాల్గవ వారం నీలం రంగులతో కూడిన గుర్తులను వేస్తూ అందిస్తున్నారు. సోమ, బుధ, శు క్రవారాల్లో గుడ్లు, మిగిలిన రోజుల్లో కాయగూరలు, పప్పు, సాంబారు అందించాల్సి ఉంది. పాఠశాలలకు ఒక్కొక్క గుడ్డును రూ. 2.35లకు ఏజెన్సీ నిర్వాహకులు సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రా లకు అందిస్తున్న గుడ్లకు ప్రత్యేక మార్కును వేశారు.



కొత్తూరు పాఠశాలకు సరఫరా చేస్తున్న గుడ్లు

సర్కార్ బడుల్లో కానరాని స్వచ్ఛత

● **ఆరుబయటే పిల్లల మల మూత్ర విసర్జన**

కురుపాం రూరల్: స్వచ్ఛభారత్ పిలుపుకు మండల విద్యాశాఖ గండికొడుతోంది. స్వచ్ఛభారత్‌లో భాగంగా బహిరంగ మలమూత్ర విసర్జన దురలవాటు నుంచి పిల్లలను కాపాడాలనే భావంతో అన్ని పాఠశాలల్లోనూ మరుగుదొడ్లు నిర్మించారు. వీటిని శుభ్రం చేసేందుకు వెలుగు సంస్థ ద్వారా స్థానికంగా ఉండే మహిళలకు ఉపాధి కల్పించారు. వెలుగు శాఖ ద్వారా అవసరమైన శుభ్రపరిచే బ్రష్‌లు, ఫినాయల్, యాసిడ్ తదితర సామగ్రిని సరఫరా చేస్తున్నారు. అయితే ఇదంతా కాగితాలకే పరిమితం. చాలా పాఠశాలల్లో స్వచ్ఛత కన్పించడం లేదు. మరుగుదొడ్లు కట్టించిన అధికారులు తగిన నీటి ఏర్పాట్లు చేయకపోవడంతో మరుగుదొడ్లకు తాళాలు వేసే ఉంటున్నాయి. పిల్లలు యథావిధిగా ఆరుబయటే కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. కొన్ని పాఠశాల్లో అయితే మరుగుదొడ్లు శిథిలం కాగా, మరికొన్నిటిలో అసలు నిర్మాణాలే లేవు. గుమ్మగడబవలస పాఠశాలలో 25 మంది పిల్లలు ఉండగా మరుగుదొడ్లకు తలుపులు లేవు. రన్నింగ్ వాటర్ లేదు. మరి ఇటువంటి పరిస్థితుల్లో పిల్లలకు మరుగుదొడ్ల అలవాటు ఎలా అలవడుతుందో ప్రభుత్వానికే తెలియాలి.



గుమ్మగడబవలసలో మరుగుదొడ్ల దుస్థితి

రెవెన్యూ సమస్యలపై నిర్లక్ష్యం తగదు

గరుగుబిల్లి: రెవెన్యూ సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా ఉం డకూడదని సీసీఎల్ఏ కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా సూచించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్హులైన వారికి రుణ అర్హత కార్డులను అందించాలన్నారు. మ్యూటేషన్లు, వెబ్ ల్యాండ్‌లకు సంబంధించి రైతులకు అసౌకర్యం కలగకుండా వేగ వంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణమూర్తి, ఆర్ఐ పి.శ్రీనివాసరావు, సీనియర్ సహాయకులు ఎస్.తిరుపతినాయుడులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరైన తహసీల్దార్, సిబ్బంది

నేడు పాలిటెక్నిక్ కళాశాల భవనం ప్రారంభం

చినమేరంగి (జియ్యమ్మవలస): చినమేరంగిలోని శ్రీమతి శత్రుచర్ల శశికళాదేవి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనం బుధవారం ప్రారంభించనున్నట్టు ప్రిన్సిపాల్ ఏవీ విజయసింహ చెప్పారు. ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు చేతులమీదుగా ప్రారంభమవుతుందని తెలిపారు. నాలుగేళ్లుగా ఇంటిగ్రేటెడ్ వసతిగృహంలో పాలిటెక్నిక్ కళాశాల కొనసాగుతున్న విషయం పాఠకులకు విదితమే. ఈ భవనం ప్రారంభమైతే విద్యార్థులకు కొంత ఉపశమనం లభిస్తుంది. గతంలో దీనిపై ఆంధ్రజ్యోతిలో అనేక కథనాలు వచ్చాయి.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

కొంకడివరం (గరుగుబిల్లి): తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వంగపండు వెంకటరమణమ్మ, నల్ల గౌరమ్మలు అన్నారు. మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొంకడివరం, లఖనాపురం గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ముందుగా అవగాహనకు వీధుల్లో ర్యాలీ నిర్వహించి తల్లిపాల విశిష్టతను తెలియపర్చారు. ఈ సందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ తల్లిపాలలో అధిక పోషక విలువలు ఉన్నాయన్నారు. జన్మించిన గంటలోపు శిశువుకు విధిగా ముర్రుపాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



కొంకడివరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

తల్లిపాలు సంజీవిని

భద్రగిరి (గుమ్మలక్ష్మీపురం): భద్రగిరి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల మంగళవారం వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలు సంజీవినిలా కాపాడుతాయన్నారు. బిడ్డ పుట్టిన రోజు నుంచి క్రమం తప్పకుండా తల్లిపాలు పట్టాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బాలింతలకు తల్లిపాలు ఇవ్వడంపై తగిన అవగాహన కల్పించాలన్నారు.

అర్హులైన వారికి గృహాల మంజూరు

ఉల్లిభద్ర (గరుగుబిల్లి): అర్హులైన వారికి పక్కా గృహం మంజూరు చేయనున్నట్టు ఎంపీడీవో జి.పార్వతి అన్నారు. మంగళవారం ఉల్లిభద్రలో లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత జన్మభూమిలో దరఖాస్తు చేసుకున్నవారిని పరిశీలించడానికి ఈ నెల 8వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్టు చెప్పారు. దరఖాస్తు చేసుకున్న వారి ఆధార్, రేషన్, బ్యాంకు, ఉపాధి హామీ జాబ్ కార్డు నకలు అందించాలన్నారు. గృహ నిర్మాణానికి అవసరమైన స్థలం ఉండాలన్నారు. మండలం మొత్తంపై పరిశీలించి పూర్తి జాబితాను ఈ నెల 10 నాటికి ఉన్నతాధికారులకు అందించనున్నట్టు చెప్పారు. తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణమూర్తి గిజబలో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీవీ రమణమ్మ కొంకడివరంలో, గృహ నిర్మాణశాఖ జేఈ దొనక చిరంజీవి రావుపల్లిలో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు, వీఆర్‌వోలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పరిసరాలు పరిశుభ్రతతోనే గ్రామాల్లో ఆరోగ్యం సాధ్యపడుతుందని ఎంపీడీవో జి.పార్వతి అన్నారు. ఉల్లిభద్రలో ఉపాధి హామీ వేతనదారులు రహదారుల శుభ్రతతో పాటు పిచ్చి మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధ వారాల్లో విధిగా పారిశుధ్యాన్ని పాటించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మరడాన తవిటినాయుడు, ఉపాధి ఏపీవో టి.రామకృష్ణంనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కండ్యాన రాహుల్ పాల్గొన్నారు.



ఉల్లిభద్రలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 2, 5

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారులు, ప్రియతముల విషయాల్లో ప్రోత్సాహకరం. ఉన్నత విద్యా విషయాలు, సమావేశాలు, చర్చల్లో సత్ఫలితాలు సాధిస్తారు. ప్రయాణాలు, వ్యూహరచనలకు అనుకూలం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగవుతుంది. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. ఇంటి అవసరాలకు సకాలంలో డబ్బు చేతికి అందుతుంది. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

మిథునరాశి:(మే21-జూన్21): శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. బంధుమిత్రులతో సమావేశాలు ఫలిస్తాయి. ప్రియతముల నుంచి కీలక సమాచారం అందుకుంటారు. సమావేశాల్లో, బృందకార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు.

కర్కాటకరాశి:(జూన్22-జూలై23): విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆర్థిక విషయాల్లో సహోద్యోగులు సహకరిస్తారు. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. క్యాటరింగ్, రిటైల్ రంగం, హోటల్, వైద్య రంగాల వారికి ప్రోత్సాహకరం.

సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): పెట్టుబడులు, పొదుపు పథకాలు లాభిస్తాయి. విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. సృజనాత్మక రంగాల వారికి ప్రోత్సాహకరం. చిన్నారుల విషయంలో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి శుభప్రదం. బదిలీలు, మార్పులకు సంబంధించి ముఖ్య సమాచారం అందుకుంటారు. సంస్మరణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సాంత్వన కలిగిస్తాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో అదనపు ఆదాయం అందుకుంటారు. పెట్టుబడులు, పొదుపు పథకాల విషయంలో పెద్దల నుంచి మంచి సలహాలు లభిస్తాయి.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): అంచనాలు ఫలించడంతో మనసు ఉల్లాసంగా ఉంటుంది. కొత్త పనులు ప్రారంభిస్తాయి. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల కోసం నిధుల సేకరణకు ప్రయత్నిస్తారు. ప్రయాణాలు, సమావేశాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు. సమావేశాలు, వేడుకల్లో పాల్గొంటారు. పెట్టుబడులు ప్రోత్సాహకరం. బృందకార్యక్రమాల్లో పాల్గొంటారు. భాగస్వామి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది.

మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): వృత్తిపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి. ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

మొదటి పేజీ తరువాయి

'గ్రోత్' లేదు

పంపించారు. వాటికి సంస్థలు ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందని ఏపీఐఐసీ అధికారులు వీరికి ఇచ్చిన భూములను రద్దు చేశారు. దీనిపై ఆ సంస్థలు స్పందిస్తూ విద్యుత్, రోడ్ల సౌకర్యం లేవని, వీటిని ఏపీఐఐసీ అధికారులు కల్పించగలిగితే వెంటనే తాము పరిశ్రమల నిర్మాణ పనులు చేపడతామని కోర్టుకు విన్నవించారు. దీనిపై కోర్టు ఇంకా ఎటువంటి ఆర్డర్ జారీ చేయలేదు. అయినప్పటికీ కోర్టుకు వెళ్లడంతో ఆయా యాజమాన్యాల భూములపై అధికారులు ఏ చర్యా తీసుకోలేకపోతున్నారు. ఇదే సమయంలో చిన్న పరిశ్రమలకు ఇచ్చిన సుమారు 61 ఎకరాలు రద్దు చేస్తూ పారిశ్రామిక వేత్తలకు నోటీసులు జారీ చేశారు. ఏళ్లైనాగాని గ్రోత్ సెంటర్‌కు పరిశ్రమల రాక ప్రశ్నార్థకంగా మారింది. పారిశ్రామిక వేత్తలు తాము తీసుకున్న భూముల్లో అగ్రిమెంట్ జరిగిన నాటి నుంచి రెండు సంవత్సరాల లోపు పనులు ప్రారంభించాల్సి ఉంది. ఇది జరగకపోవడంతో అధికారులు రద్దు నిర్ణయాలు తీసుకుంటున్నా వాటికి సవాలక్ష నిబంధనలు అడ్డు తగులుతున్నాయి. ఇంకోవైపు పరిశ్రమల యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసి స్థానికులు, భూములిచ్చిన రైతులు భూములు రద్దు చేస్తే తమకివ్వాలని కోరుతున్నారు. కాగా పెద్ద సంస్థలైన బీకేస్టీల్స్, మాయిల్, విశాఖ స్టీల్స్ వంటి పరిశ్రమలు వస్తేనే ఎక్కువ మంది యువతకు ఉపాధి లభిస్తుంది.

స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించండి
- రామినాయడు, రైతు, పణుకువలస

గ్రోత్‌సెంటర్‌లో పరిశ్రమల కోసం భూములిచ్చిన రైతుల పిల్లలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. 30 ఏళ్ల కిందట ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని రైతుల వారసులకు ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

ప్రాణాలైనా అర్పిస్తాం

ఆవేదనను అర్థం చేసుకుంటే అభివృద్ధిని అడ్డుకోమని, ప్రభుత్వానికి సహకరిస్తాని చెప్పారు. రిజర్వాయర్ పనులు జరుగుతున్న తీరుపై సమీక్షించేందుకు, పనులను పరిశీలించేందుకు కలెక్టర్ వివేక్ యాదవ్ ఇతర రెవెన్యూ అధికారులు మంగళవారం రిజర్వాయర్ ఇంజినీరింగ్ అధికారులతో కలసి సారిపల్లి వచ్చారు. గట్లపై నుంచి మొత్తం రిజర్వాయర్ గర్భాన్ని, గట్టు పనులను పరిశీలించారు. ఇందుకు సంబంధించి ఎంత వరకు పనులు జరిగాయన్న విషయంపై నీటి పారుదల శాఖ జిల్లా ఎస్ఈ డోల తిరుమలరావు మ్యాప్ ఆధారంగా వివరించారు. మొత్తం గుర్ల మండలంలోని ఆనందపురం వద్ద బ్యారేజి నిర్మాణం దగ్గర నుంచి రిజర్వాయర్ వరకు కాలువల నిర్మాణం, గట్లు నిర్మాణం, సేకరణ కాని 260 ఎకరాల భూముల వివాదం, బిల్లులు చెల్లించేందుకు నిధుల సమస్య తదితర విషయాల గురించి తిరుమలరావు తెలియజేశారు. అలాగే గుర్ల మండలం దమరిసింగి నుంచి నెల్లిమర్ల మండలం గొర్లెపేట గ్రామాల మధ్య ఉన్న అటవీశాఖ పరిధిలోని కొండలో సుమారు ఒకటిన్నర కిలోమీటర పరిధిలో టన్నెల్ (సొరంగ కాల్వ మార్గం) తవ్వాల్సి ఉందని, ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు జారీ కాలేదని వివరించారు. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తిచేసి 2018 డిసెంబరు నాటికి రిజర్వాయర్ నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తున్నామని కలెక్టర్‌కు వివరించారు. నాబార్డు నుంచి 250 కోట్ల రుణం ఇటీవల మంజూరు అయిన దృష్ట్యా నిధుల సమస్య లేదని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇంతలో అక్కడకు చేరుకున్న సారిపల్లి రైతులు తమ ఆవేదనను కలెక్టర్ వద్ద వెళ్లగక్కారు. తమ గ్రామం చుట్టూ గట్లు వేశారని, గ్రామానికి ఆనుకుని ఉన్న కొండలను గట్లతో కలుపుతున్నారని, రాబోయే కాలంలో తమ ఇళ్లు కూలి పోయే పరిస్థితికి వస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తమ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించి మరో చోట పునరావాస గ్రామాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. సుమారు ఒక్కో ఎకరా పది నుంచి 15 లక్షల విలువ చేసే భూములకు నష్టపరిహారంగా కేవలం లక్షన్నర మాత్రమే ఇచ్చి భూములను దౌర్జన్యంగా తీసుకున్నారని తెలిపారు. సారిపల్లి గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించండి. లేదంటే రిజర్వాయర్ డిజైన్ మార్చండి. కనీసం రిజర్వాయర్ గట్ల దిశ మార్చండి అంటూ వేడుకున్నారు. లేదంటే సామూహికంగా ఆత్మహత్య చేసుకోవడానికైనా సిద్ధమంటూ తేల్చిచెప్పారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సారిపల్లి గ్రామస్థులు కోరిన విధంగా గట్ల దిశను మార్చేందుకు అవకాశాలను పరిశీలించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న భూవివాదాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం టన్నెల్ తవ్వాల్సిన ప్రాంతాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు అనిత, బాల త్రిపుర సుందరి, నెల్లిమర్ల తహసీల్దార్ కె.చిన్నారావు, ఎంపీడీవో కె.రాజ్‌కుమార్, సారిపల్లి రైతుల ప్రతినిధులు సారిపల్లి బాబూరావు, నడిపేన వెంకటరావు ఉన్నారు.



సారిపల్లిలో పర్యటిస్తున్న కలెక్టర్

వర్షా 'భారం'

ఖరీఫ్ సాగుపై రైతుల ఆందోళన
జూన్, జూలైలో తక్కువ వర్షపాతం

(కలెక్టరేట్)

వర్షాభావంతో వరి పంటపై రైతులు అశలు వదులుకునే పరిస్థితి కన్పిస్తోంది. సాధారణగా ఖరీఫ్ సీజన్‌లో పంట చేతికందాలంటే జూన్, జూలైలో కురిసిన వర్షాలే కీలకం. ఈ ఏడాది కురవాల్సిన వర్షం కంటే తక్కువగా నమోదైంది. మరోవైపు ఎండిపోతున్న వరి నారును రక్షించుకోవడానికి చాలా మంది రైతులు ప్రయత్నం చేస్తుండగా ఇంకొందరు నారును బతికించుకోలేక విడిచిపెడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ శాఖ దృష్టి పెట్టింది. జిల్లాలో ఇంత వరకూ ఎంత మేరలో సాగు చేశారు? ఎటువంటి పంటలు వేయాలి? అనేదానిపై ఆయా శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదికలు కూడా ఇస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా అన్ని రకాలు పంటలు కలిపి 1,92,010 హెక్టార్ల సాధారణ విస్తీర్ణం ఉండగా ఇప్పటివరకూ 45,650 హెక్టార్లలోనే సాగు చేస్తున్నారు.వరి పంటకు సంబంధించి జిల్లాలో సాధారణ విస్తీర్ణం 1,18,812 హెక్టార్లు కాగా ఇప్పటి వరకూ 5,204 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. విజయనగరం డివిజన్‌లో 2,284 హెక్టార్లలో, పార్వతీపురం డివిజన్‌లో 2,920 హెక్టార్లలో నాట్లు, ఎద వేశారు. జూన్‌లో 128.4 మిల్లీమీటర్లు వర్షం కురవాల్సి ఉండగా 121.3 మిల్లీ మీటర్లు కురిసింది. అంటే 5.6 మిల్లీ మీటర్లు వర్షం తక్కువగా నమోదైంది. జూలైకు సంబంధించి 178.7 మిల్లీ మీటర్లు వర్షం కురవాల్సి ఉండగా 125.4 మిల్లీ మీటర్లు మాత్రమే కురిసింది. 29.8 మిల్లీమీటర్లు తక్కువగా నమోదైంది. ఈ రెండు నెలలు కలిపి 19.7 మిల్లీమీటర్లు తక్కువగా కురిసింది. విజయనగరం మండలంలో చాలా తక్కువ వర్షం నమోదైంది. 12 మండలాల్లో సాధారణ వర్షపాతం, 19 మండలాల్లో తక్కువ వర్ష పాతం కురిసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. దత్తిరాజేరు, పూసపాటిరేగ మండలాల్లో మాత్రమే కురవాల్సిన వర్షం కంటే అధికంగా కురిసింది. గత ఏడాది జూన్‌లో జిల్లాలో 42 మిల్లీ మీటర్ల వాన అధికంగా కురిసింది. జూలైలో మూడు మిల్లీ మీటర్లు ఎక్కువగా కురిసింది. ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. మరోవైపు ప్రాజెక్టుల్లో కూడా పూర్తిస్థాయి నీరు లేదు. ఉన్న మేరకు విడదల చేసి కొన్ని చోట్ల నాట్లు వేస్తున్నారు. మరి కొన్ని చోట్ల నారును రక్షించుకునే పనిలో ఉన్నారు. చెరువులు,బావుల్లో నీరు లేదు. ఇప్పటికే రెండుసార్లు ఆయిల్ ఇంజన్ల ద్వారా నారుమళ్లను తడిపారు. ఇదిలా ఉంటే ప్రస్తుత పరిస్థితిలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని కలెక్టరు వివేక్ యాదవ్ వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. ఎటువంటి విత్తనాలు అవసరమో గుర్తించాలని ఆయా శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం మండల స్థాయి అధికారుతో సమావేశం నిర్వహించనున్నారు. వారి నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతారు. ఈ నెల 15 లోగా చూసి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.



ట్రాక్టర్ బోల్తా.. ఒకరికి గాయాలు

సాలూరు రూరల్: ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు గాయాలపాలైన సంఘటన జీగిరాం సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఐదుగురు గిరిజన కూలీలకు ప్రమాదం తప్పింది. పాచిపెంట మండలం కందిరివలస నుంచి ఐదుగురు గిరిజన కూలీలతో ట్రాక్టర్ ఉదయ మే సాలూరుకు బయలు దేరింది. ఈ ట్రాక్టర్ జీగిరాం సమీపానికి వచ్చేసరికి మలుపు తిరుగుతున్న సమయంలో వేగంగా వస్తుండడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సమయంలో ట్రాక్టర్ తొట్టెలో ఐదుగురు ఉన్నారు. తొట్టె కల్వర్ట్‌కు ఒడ్డుకు మధ్య బోల్తా పడడంతో వారు ప్రాణాపాయం నుంచి బయట పడ్డారు. మణి అనే వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. ట్రాక్టర్ బోల్తా పడడం చూసిన పలువురు తొట్టెలో ఉన్న ఐదుగురు గురించి ఆందోళన చెందారు. అయితే వారు సురక్షితంగా బయటకు రావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

చికెన్ ధరలు

	బాయిలర్	వెన్‌కాబ్
రిటైల్‌ధర	65	60
విత్‌స్కిన్	100	102
స్కిన్‌లెస్	110	120

కోడి గుడ్లు (నెక్)

విశాఖపట్నం	రూ.360
విజయనగరం	రూ.364
శ్రీకాకుళం	రూ.364

సూక్తి

లక్ష్య సాధనలో ఎన్నిసార్లు ఓడినా సరే.. మరోసారి ప్రయత్నించు.



వావ్.. చార్లెస్ వంతెన

స్విట్జర్లాండ్‌లోని ఆల్ప్స్ పర్వతాల్లో పచ్చదనం పరుచుకున్న అందాలతో, ప్రకృతి శోభతో అలరారే రెండు కొండ ప్రాంత గ్రామాలే.. జెర్మట్, గ్రెచెన్. వాటి మధ్యలో లోతైన గ్రాబెంగూఫర్ లోయ. గ్రెచెన్ నుంచి జెర్మట్‌కు చేరుకోవాలంటే ఆ లోయతో పాటు, చిన్న చిన్న కొండలూ ఎక్కి దిగాల్సిందే. మొత్తంగా మూడు గంటల సమయం పడుతుంది. అక్కడి ప్రజలకు ఇప్పుడు ఆ సమస్య తీరిపోయింది. కేవలం పది నిముషాల్లోనే ఇరు గ్రామాలకు చకచకా వెళ్లిపోవచ్చు. ఎలానో తెలుసా? ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెన అక్కడ ప్రారంభించారు.



ఆల్ప్స్‌పర్వతాల్లోని రెండు కొండల మధ్య ఓ పొడవాటి వంతెన నిర్మించారు. దాని పేరు "చార్లెస్ కువోనెన్'. గాలికి ఊగుతూ, తూగుతూ ఉండే ఆ వంతెనను చూస్తుంటే.. కొందరికి కొండల మధ్య వెండి ఊయల్లా తోస్తుంది. ఇంకొందరికి నడిచే రోలర్ కోస్టర్‌లా కనిపిస్తుంది. ఇది సస్పెన్షన్ మోడల్ బ్రిడ్జి. వంతెనపై నడుస్తుంటే కాస్త ఊగుతూ ఉంటుంది.

జూలై 29న ప్రారంభమైన ఈ వంతేన ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనగా రికార్డుల్లోకి ఎక్కింది. దీని పొడవు 494 మీటర్లు.


ఈ వంతెన భూ ఉపరి తలానికి 85 మీటర్ల ఎత్తులో ఉంది.

ఇప్పటివరకు జర్మనీలోని 'టైటాన్ -ఆర్‌టీ' వంతెనను అతి పొడవైనదిగా పేర్కొనేవారు.


ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనల్లో రష్యాలోని 'స్కైపార్క్ బ్రిడ్జ్' మూడో స్థానంలో ఉంది. 2016 సోచి ఒలింపిక్స్ సందర్భంగా దీన్ని నిర్మించారు.

ఎత్తయిన ప్రదేశాలను చూసి భయపడేవారు, 'చార్లెస్ కువోనెన్' వంతెన దాటాలంటే కళ్లు మూసుకోవాల్సిందేనని జెర్మట్ ట్రావెల్ బోర్డు ప్రతినిధి అంటున్నారు.

రోడ్డు మార్గంలో వంతెన కట్టాలంటేనే ఓ నెల రోజుల సమయం పడుతుంది. కానీ రెండు కొండల మధ్యలో నిర్మించిన ఈ బ్రిడ్జిని కేవలం 10 వారాల్లోనే పూర్తి చేయడం విశేషం.



బొమ్మ గీయండి



టంగ్ ట్విస్టర్స్



1. I would if I could, and if I couldn't, how could I? You couldn't, unless you could, could you?
2. The crow flew over the river with a lump of raw liver.
3. National Sheepshire Sheep Association

ఒకే అక్షరం

1. TOTAL	మొ	
2. BUD	మొ	
3. PLANT	మొ	

నవ్వుల్ నవ్వుల్



రాహుల్ : కుట్టేముందు దోమలు ఎందుకు శబ్దం చేస్తాయి?

రోహిత్ : దాడి చేయబోతున్నాను అని వర్తమానం ఇవ్వడం యుద్ధనీతిలో భాగం.

చుక్కలు కలపండి



దారి కనుక్కోండి



ఔనా!



వందలో డెబ్బై శాతం మంది 'హైపనిక్ జెర్క్' ఎదుర్కొన్నవారే. ఇదేదో కొత్త వ్యాధి అని అనుకుంటున్నారా? అదేం కాదు. మాంచి నిద్రలో ఉన్నప్పుడు ఎక్కడ నుంచో కింద పడుతున్నట్టు అనిపించి చటుక్కున మెలకువ వస్తుంది. అదే 'హైపనిక్ జెర్క్'.

మీకుతెలుసా?

మీకు చెట్లతో కూడిన అరణ్యాలే తెలుసు.. మరి శిలలతో ఉన్న అడవి తెలుసా? చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లో ఉన్న పొడవైన శిలల సముదాయాన్నే 'స్టోన్ ఫారెస్ట్' అని పిలుస్తారు.



చెప్పగలరా?

జాలిలో ఉన్నా కానీ గాలిలో లేను
బిరుదులో ఉన్నా కానీ అరుదులో లేను
లిపిలో ఉన్నా కానీ తాపిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

జంతర్‌మంతర్

ఈ కింద పదాలను సరిచేయండి

1. ఐత్యంకమ ▸ ....
2. సందనపా ▸ ....
3. పిగూడుట్ట ▸ ....

- పత్తిపాక అంకిత, కోరుట్ల

జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింద పదాలను సరిచేయండి

1. IRAN ▸ ....
2. IDWE ▸ ....
3. DMBU ▸ ....

- గుర్రాల సాయిసుధ, మెట్‌పల్లి

జవాబులు

1.RAIN 2.WIDE 3.DUMB

జంబ్లింగ్ వర్డ్స్ :

జంతర్‌మంతర్ : 1. ఐకమత్యం 2. సంపాదన 3. పిట్టగూడు

చెప్పగలరా? : జాబిలి

ఒకే అక్షరం : 1. మొత్తం 2. మొగ్గ 3. మొక్క.

ఒకే టీకాతో రెండు వ్యాధుల నిర్మూలన

● చిన్నారులకు ఎంఆర్ టీకా తప్పనిసరి: కలెక్టర్ వివేక్ ● జిల్లాలో 5,52,812 మంది పిల్లలు: డీఎంహెచ్‌వో పద్మజ

విజయనగరం టౌన్/రింగురోడ్డు: 9 నెలల నుంచి 15 ఏళ్ల వయసు గల పిల్లలకు ఎంఆర్ టీకా వేయించాలని కలెక్టర్ వివేక్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని మహరాజా సంస్కృత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో తట్టు, రుబెల్లా టీకా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 8 వరకు నిర్వహిస్తున్న తట్టు, రుబెల్లా టీకా (ఎంఆర్)ను శతశాతం పూర్తిచేయాలని, ఒక టీకాతో చిన్నారులను వ్యాధులు రక్షించవచ్చన్నారు. ఈ టీకాతో చిన్నారులకు న్యూమోనియా, విరేచనాలు, మెదడు వాపు వంటి వ్యాధులు ప్రబలవని, రుబెల్లా వ్యాధి సోకిన గర్భిణికి పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని తెలిపారు. కొన్ని సమయాల్లో గర్భస్రావం, శిశువు మృతిచెందడం వంటివి జరుగుతాయని చెప్పారు. ఈ తరుణంలో గ్రామాల్లో ఎంఆర్ టీకాపై ప్రచారం చేపట్టి, చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వివేక్, హాజరైన విద్యార్థినులు

డీఎంహెచ్‌వో సి.పద్మజ మాట్లాడుతూ, జిల్లాలో 5,52,812 మంది చిన్నారులను గుర్తించామని, 5337 శిబిరాలు ఏర్పాటు చేశామని, వాటిలో పాఠశాలల్లో 3068, బహిరంగ ప్రదేశాల్లో 943, ఇళ్ల వద్ద 127 శిబిరాలతోపాటు మొబైల్ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే 761 మంది ఏఎన్‌ఎంలను, 80 మంది స్టాఫ్‌నర్సులు, 318 సూపర్‌వైజర్లు, 2550 మంది ఆశా వర్కర్లు, 3557 అంగన్‌వాడీ కార్యకర్తలను నియమించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మీసాల గీత, మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ, ఏజేసీ కె.నాగేశ్వరరావు, వైద్య, ఆరోగ్య శాఖ అదనపు సంచాలకురాలు గీతాప్రసాదిని, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఉషశ్రీ, రోటరీయన్ డాక్టర్ బీఎస్ఆర్ మూర్తి, సంస్కృత కళాశాల ప్రిన్సిపల్ స్వప్నహైందవి, ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

● బ్రిటీష్, ఏషియన్ ట్రస్టు సంచాలకుడు అపరజిత్ అగర్వాల్
● మండలంలో ట్రస్టు సభ్యులు పర్యటన

మెంటాడ: పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు అని బ్రిటీష్, ఏషియన్ ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థ ఇంగ్లాండ్ సంచాలకుడు అపరిజిత్ అగర్వాల్ అన్నారు. మంగళవారం పిట్టాడ, గుర్ల గ్రామాల్లో ట్రస్టు బృందం సభ్యులు పర్యటించి, రైతులు భాగస్వామ్యంతో తయారు చేసిన ద్రవ జీవామృతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సేంద్రీయ పద్ధతిలో సాగు చేస్తే పంటలు ఏ విధంగా ఉన్నాయి, దిగుబడి వివరాలు రైతులను అడిగి తెలుసుకుని, పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం, వచ్చిన ఫలితాలు తెలుసుకోవడానికి రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో పర్యటించినట్టు చెప్పారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయంపై ఆర్‌వైఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థ విస్తృత ప్రచారం చేస్తుందని, నిధుల మంజూరుకు ప్రతిపాదిస్తామన్నారు. ఈ విధానాన్ని ఇతర దేశాలు అవలంబిస్తున్నాయని చెప్పారు. అలాగే మాతాశిశు సంరక్షణకు చేయూతనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కరన్ వబిక్, వ్యవసాయ జేడీ లీలావతి, డీపీఎం భాషా, ఏవోలు రాజశేఖర్, హేమసుందర్, రైతురెడ్డి చంద్రరావు, క్షేత్ర సహాయకులు రొంగలి శంకరరావు, అయినాల శ్రీనువాసరావు పాల్గొన్నారు.



జీవామృతం తయారీ విధానం పరిశీలిస్తున్న సభ్యులు

ప్రయాణికుల సేవలో..
విజయనగరం డిపో ముందంజ

● ఆర్టీసీ ఆర్ఎం అప్పన్న

విజయనగరం టౌన్: ప్రయాణికుల భద్రతా వారోత్సవాలతో పాటు రాయితీ కార్డుల అమ్మకాల్లో ఆర్టీసీ నెక్ రీజియన్‌లో విజయనగరం డిపో ప్రథమ స్థానంలో నిలిచిందని సంస్థ ఆర్.అప్పన్న తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆర్ఎం తన చాంబర్‌లో జరిగిన డిపో మేనేజర్ల సమావేశంలో విజయనగరం డిపో మేనేజర్ ఎన్‌వీఎస్ వేణుగోపాల్‌ను అభినందించారు. భవిష్యత్‌లో కూడా ఇదే పంథాను కొనసాగించాలని ఆకాంక్షించారు. రాయితీ కార్డులకు సంబంధించి నవ్య కార్డులు 867, వనిత కార్డులు 2,481, విహారి-01, మంత్లీ/సీజన్ కార్డులు 355, మొత్తం 3,704 కార్డులు విక్రయించారని ఆర్ఎం అప్పన్న కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు వరప్రసాద్, ఎ.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, వంశీ, బీవీఎస్ నాయుడు, సన్యాసిరావు, మోహిని తదితరులు పాల్గొన్నారు.

● **భద్రతా వారోత్సవాలు విజయవంతం**

ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు వారాల పాటు విజయనగరంలో నిర్వహించిన ప్రయాణికుల భద్రతా వారోత్సవాలు విజయవంతం అయ్యాయి. ఇందుకు సహకరించిన అసిస్టెంట్ మేనేజర్ శర్మతో పాటు సిబ్బందికి డీఎం వేణుగోపాల్ కృతజ్ఞతలు తెలిపారు. విజయనగరం ఆర్టీసీ డిపోను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తాం అని, సురక్షిత ప్రయాణం ఆర్టీసీతోనే సాధ్యమని ప్రయాణికులకు వివరించి, ఓఆర్ శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు.



డీఎం వేణుగోపాల్‌ను అభినందిస్తున్న ఆర్ఎం అప్పన్న

ప్రవర్తనే వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది

● గొప్ప వ్యక్తులుగా ఎదగాలంటే మంచి నడవడిక అవసరం ● సాహితీవేత్త యండమూరి వీరేంద్రనాథ్


చెరుకుపల్లి(భోగాపురం): విద్యార్థి నడవడిక, ప్రవర్తనే అతని వ్యక్తిత్వాన్ని తెలియజేస్తాయని సాహితీవేత్త, వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. చెరుకుపల్లి సమీప అవంతీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా యండమూరి హాజరై, మాట్లాడారు. జీవితంలో విద్యార్థులు ఏదో సాధించాలని, గొప్ప వ్యక్తులుగా పేరు తెచ్చుకోవాలని, మంచి ఉద్యోగాలు సంపాదించాలని ఆశయంతో ఉంటారు. మరికొంత మంది విద్యార్థి దశలోనే సరదగా గడుపుదాం అని చూస్తుంటారు. అయితే బాగా చదువుకొని ప్రయోజకులు కావాలని వారి తల్లిదండ్రులు పిల్లల గురించి ఆలోచిస్తారని తెలిపారు. గొప్ప వ్యక్తులుగా ఎదగాలంటే ముందు మంచి నడవడిక, ప్రవర్తన, ఇతరులను, పెద్దలను, గౌరవించడం, స్నేహ పూర్వకంగా ఉండడం అలవర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి, వారి మనో విజ్ఞానాన్ని పరిశీలించారు. అలాగే ఆయన అనుభవాలు విద్యార్థులకు తెలియజేసి, విద్యార్థి అన్ని విధాలా అభివృద్ధి చెందడానికి అవసరమైన సూచనలు ఇచ్చారు. అవంతీ విద్యాసంస్థల చైర్మన్, అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనువాసరావు మాట్లాడుతూ, యండమూరి సూచనలు, సలహాలు ప్రతీ విద్యార్థికి ఉపయోగపడతాయన్నారు. ఈ అవగాహన సదస్సు ఈనెల 5వరకు కొనసాగుతుందని తెలిపారు. ఉన్నతులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.



విద్యార్థిని ప్రశ్నిస్తున్న యండమూరి, హాజరైన విద్యార్థులు

పైడితల్లికి బత్తాయిల అలంకరణ

రింగురోడ్డు: విజయనగరం పట్టణంలో కొలువుదీరిన పైడితల్లి అమ్మవారికి బత్తాయి పండ్లుతో, అరెసలతో మంగళవారం అలంకరించారు. అలాగే వేకువజామునుంచే అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేషఅర్చన, కుంకుమ పూజలు నిర్వహించారు. దీంతో ఆలయం భక్తులు బారులుదీరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ ఈవో భానురాజా ప్రత్యేక చర్యలు చేపట్టారు.



అమ్మవారికి అలంకరించిన బత్తాయిలు

'ఆదివాసీ ఆరోగ్య' విద్యార్థులకు వరం

● ఐటీడీఏ పీవో డాక్టర్ లక్ష్మీశ

పార్వతీపురం: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఆదివాసీ ఆరోగ్య కార్యక్రమం విద్యార్థులకు వరం లాంటిదని ఐటీడీఏ పీవో డాక్టర్ లక్ష్మీశ అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం డోకిశీల ఆశ్రమ పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 55 ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలను నియమించామని, అన్నారు. ఏమైనా అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే జిల్లాకు నియమించిన ముగ్గురు కో-ఆర్డినేటర్లకు తెలియజేయాలని సూచించారు. జిల్లాలో ఆదివాసీ ఆరోగ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు సీనియర్ కో-ఆర్డినేటర్ శర్వాన్‌ను ప్రైవేట ఏజెన్సీ ద్వారా నియమించినట్టు తెలిపారు. కేవలం ఆరోగ్య సమస్యలే కాకుండా విద్యార్థుల విద్యా నైపుణ్యాలపై కూడా దృష్టి కేంద్రీకరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రవికుమార్, జడ్పీటీసీ గౌరీశ్వరి, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ మడక కృష్ణవేణి, టీడీపీ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, మడక విశ్వనాథం, డోకిశీల పీహెచ్‌సీ వైద్యాధికారి దీపక్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీవో లక్ష్మీశ

పరిశుభ్రంతో రోగాలు దూరం

బొబ్బిలి రూరల్: గ్రామం పరిశుభ్రంగా ఉంటే రోగాలు దూరమవుతాయని ఎంపీడీవో ఎ.త్రినాథరావు తెలిపారు. మంగళవారం ఆయన జగన్నాథపురంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత మరుగుదొడ్లు వాడి, బహిరంగ మలవిసర్జన విడనాడాలన్నారు. చెత్తా చెదారాలు ఇంటి ముందు కాలువల్లో వేయరాదన్నారు. రోడ్లపై పశువుల కట్టుట తగదన్నారు. గ్రామం పరిశుభ్రంగా ఉంచుకుంటే గ్రామానికి దోమల బెడతతో పాటు మలేరియా, డయేరియా వంటి అంటువ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు.



మొక్కలు నాటుతున్న ఎస్‌ఐ, ఆటో డ్రైవర్లు

మొక్కలు నాటిన పోలీసులు

రామభద్రపురం: రామభద్రపురం - రాజాం రోడ్డులో సుమారు 100 నేరేడు, వేప, కాము మొక్కలు ఆటో డ్రైవర్‌లతో కలిసి ఎస్‌ఐ డీడీ నాయుడు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మంగళవారం నాటించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ, వనం - మనం కార్యక్రమంలో భాగంగా ఇంటి ఆవరణలో, ఖాళీ స్థలాల్లో రోడ్డుకిరువైపులా మొక్కలు నాటాలన్నారు. సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే పనులను చేపడతామని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీ బోను వెంకటరమణ, శ్రీనివాసరావు, ఉమెన్ పీసీలు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో మౌలిక వసతుల కరువు

బొబ్బిలి: ప్రభుత్వ వసతిగృహాల్లో మౌలిక వసతులు కరువు అయ్యాయని, వెంటనే కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఏఎస్‌డబ్ల్యూవో వీఎల్‌ఎం స్వరూపాకుమారికి వినతి పత్రం అందజేశారు. వసతిగృహంలో నెలకు రెండుసార్లు వైద్య శిబిరాలు నిర్వహించాలని, రక్షిత నీటిని ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు పౌష్టికాహారం పూర్తిస్థాయిలో అందించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపి

రామభద్రపురం: ఫిజియోథెరపితో వ్యాధి తీవ్రత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వైద్యాధికారి రాజమోహన్ తెలిపారు. మంగళవారం మండల భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఫిజియోథెరపి వైద్యసేవలు నిర్వహించారు. సేవలను ఎంఈవో ఎ.తిరుమలప్రసాద్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్టీలు కొల్లి ఈశ్వరరావు, అచ్యుతరావు, కేర్‌టేకర్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఇళ్లు లేని వారి వివరాలు సేకరణ

బొబ్బిలి రూరల్: జగన్నాథపురంలో మంగళవారం ఎంపీడీవో ఎ.త్రినాథరావు ఇళ్లులేని వారి వివరాలు సేకరించారు. గ్రామంలోని ఆయన గ్రామసభ ఏర్పాటు చేశారు. గతంలో ఇళ్లు పొందని వారి పేర్లను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో ఇల్లు లేనివారు ఎవరైన ఉంటే వారు నేరుగా హౌసింగ్ కార్యాలయాలకు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

తెర్లాం: విజయరాంపురం, ఎన్.బూర్జివలస, సుందరాడ, ఉద్దవోలు గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. 2011లో కట్టిన ఇళ్ల వివరాలపై ఎంపీడీవో భానుమూర్తి, తహసీల్దార్ కె.సుభాష్‌బాబులు వివరాలు సేకరించారు. అప్పట్లో నిర్మించిన ఇళ్లు ఏఏ దశల్లో ఉన్నాయి. ఎంత మేరకు బిల్లులు జరిగాయి. ఎందుకు బిల్లులు చెల్లింపులు జరగలేదనే వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సంతోషికుమారి, సర్వేయర్ పోలిపల్లి, వీఆర్వోలు పాపారావు, కె.లక్ష్మణరావు, హౌసింగ్ ఏఈ దొరబాబు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి

బొబ్బిలి రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలని ఎంపీడీవో ఎ.త్రినాథరావు సూచించారు. మంగళవారం ఆయన జగన్నాథపురం అంగన్‌వాడీ-2 కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల హాజరు, అమృతహస్తం అమలు వంటి విషయాలను కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. ప్రీస్కూల్ హాజరు ప్రకారం పిల్లలుండాలన్నారు. హాజరు ఎక్కువ వేసి పిల్లలు తక్కువగా ఉంటే సహించేది లేదని హెచ్చరించారు.



ప్రతి చిన్నారికీ తట్టు, రుబెల్లా టీకా తప్పనిసరి

రామభద్రపురం: 9 నెలల నుంచి 15 ఏళ్ల లోపు గల చిన్నారులకు తట్టు, రుబెల్లా వ్యాధులు సోకకుండా ఎంఆర్ టీకా వేయించాలని వైద్యాధికారి సంజీవ నాయుడు పిలుపునిచ్చారు. ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 8 వరకు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో టీకా వేయనున్నట్టు తెలిపారు. మంగళవారం రామభద్రపురం మారుతీ కాలనీ పాఠశాలలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ చొక్కాపు రామకృష్ణ ఆధ్వర్యంలో టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మండలంలో ఉన్న అన్ని పాఠశాలలకు టీకా డోసులు పంపిణీ చేశారు. అలాగే నాయుడువలస ఎంపీయూపీ పాఠశాలలో హెచ్‌ఎం నాగభూషణం విద్యార్థులకు టీకా వేశారు. ఈ కార్యక్రమంలో బొప్పె రవికుమార్, కర్రి శ్రీను, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

తెర్లాం: ఒకే టీకాతో రెండు వ్యాధుల నిర్మూలనకు ఎంఆర్ వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ ఎన్‌వీ రామలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం తెర్లాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాక్సిన్ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 9 నెలల నుంచి 15 ఏళ్ల లోపు వయసు గల పిల్లలు ఈ వ్యాక్సిన్ విధిగా వేసుకోవాలన్నారు. భవిష్యత్‌లో మంచి ఆరోగ్యాన్ని ఇస్తుందని వైద్యులు రవికుమార్, నాగేశ్వరరావులు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు, ఎంపీహెచ్‌ఈవోలు, వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.





తెర్లాం, నాయుడువలస పాఠశాలలో చిన్నారులకు టీకాలు వైద్య సిబ్బంది

చైనా ఉత్పత్తులను బహిష్కరించండి

బొబ్బిలి: దేశంలో చైనా ఉత్పత్తులను ప్రజలు బహిష్కరించాలని పట్టణంలోని 6వ వార్డు కౌన్సిలర్ సుంకరి సాయిరమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పూల బాగ్‌లో ఉన్న డోలా మండపం వద్ద హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో చైనా ఉత్పత్తుల బహిష్కరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశం పొరుగు దేశాలతో సత్సంబంధాలు పెంచుకుని స్నేహ హస్తం అందిస్తే, పాకిస్తాన్, చైనా దేశాలు భారతదేశాన్ని ఎప్పుడు కొల్లగొడతామా అని చూస్తున్నారన్నారు. చైనా ఉత్పత్తులకు అతి పెద్ద మార్కెట్ భారతదేశం అని, ఇక్కడ చైనా ఉత్పత్తులను నిషేధించిన ప్రజలు బహిష్కరించినా.. చైనాకు చావుదెబ్బ తప్పదని హెచ్చరించారు. విజ్ఞతి గల భారత ప్రజలు స్వచ్ఛందంగా చైనా ఉత్పత్తులను బహిష్కరించి, ఆ దేశ ఆర్థిక మూలాలను కూకట వేళ్లతో పెకలించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రచార కరపత్రాలను విడుదల చేశారు.



ప్రచార కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు చెలికాని కేశవరావు, పెంటస్వామినాయుడు, వ్యాపారవేత్త గెంబలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డలకు శ్రేష్ఠం

తెర్లాం: తల్లిపాలు వారోత్సవాల్లో కూనాయవలస అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.బాలామణి తల్లిపాలు విశిష్టతపై పలు సూచనలు అందించారు. తల్లిపాలు బిడ్డలకు ఆరోగ్యంతోపాటు ఆత్మస్థైర్యాన్ని నింపుతాదన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు సింహాచలం, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: తల్లిపాలు చిన్నారులకు శ్రేష్టమని పారాది గ్రామ సర్పంచ్ అల్లాడ భాస్కరరావు తెలిపారు. గ్రామంలో మంగళవారం తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అన్న అమృతహస్త పథకం అమలు కేంద్రాల్లో విధిగా నిర్వహించాలని, గర్భిణులు, బాలింతలకు కేంద్రాల్లోనే భోజనాలు తినేలా చూడాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు.



పారాదిలో గర్భిణులకు సీమంతాలు

కళాశాలలో ఫ్రెషర్స్‌డే

తెర్లాం: స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

వరుస విధానంలో అధిక దిగుబడులు

రామభద్రపురం: వరినాట్లు వరుస విధానంలో వేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో అనురాధ పండా తెలిపారు. మంగళవారం తారాపురం, జన్నివలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తారాపురంలో వరినాట్లు వరుస విధానంలో నాటే విధానాన్ని స్వయంగా చేసి, పైరుకు గాలి, వెలుతురు తగిలి, దుబ్బు బాగా పెరుగుతుందని తెలిపారు. తెగుళ్ల ఆశించకుండా ఉంటుందని, ఎకరాకు 4 నుంచి 5 అధిక దిగుబడి వస్తుందన్నారు. అనంతరం పత్తి, వేరుశనగ, మొక్కజొన్న పంటలు పరిశీలించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సురేష్, ఎంపీఈవోలు లత, సంధ్య, కృష్ణవేణి, చిన్నమ్మలు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: వరినాట్లు వరుస క్రమంలో నాటినట్లైతే దుబ్బు బాగా చేస్తుందని ఏవో ఎం.శ్యాంసుందరరావు తెలిపారు. జీఎస్ పురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు వరుస క్రమంలో వరినాట్లు వేయడం వల్ల దుబ్బుకు దుబ్బుకు దూరం ఉండి, గాలి, వెలుతురు తగిలి ఆరోగ్యవంతంగా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో బి.జోగినాయుడు, రైతులు పాల్గొన్నారు.



తారాపురంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

గ్యాస్ సమాచారం

గత నెల 31న బుక్ చేసుకున్న బొబ్బిలి శ్రీవెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీ పరిధిలో బొబ్బిలి రూరల్, బాడంగి, మక్కువ, తెర్లాం, సీతానగరం, రామభద్రపురం, బలిజిపేట మండలాల వినియోగదారులకు, ఈనెల 1న బుక్ చేసుకున్న బొబ్బిలి పట్టణ వినియోగదారులకు బుధవారం గ్యాస్ సరఫరా చేస్తారు.

చైర్‌పర్సన్ దంపతులకు ఘనస్వాగతం

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపల్ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి, భాస్కరరావు దంపతులు ఇటీవల అమెరికా వెళ్లి మంగళవారం ఉదయం బొబ్బిలి చేరుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్‌లు, మున్సిపల్ సిబ్బంది అచ్యుతవల్లి దంపతులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో చైర్‌పర్సన్ అచ్యుతవల్లి మాట్లాడుతూ, అమెరికాలో పారిశుధ్యంపై ఒక నిర్దిష్టమైన కమిటీ ఉందని, అక్కడ ఎవరి విధులు వారే నిర్వహించుకుంటారని, మనకు ఆ పరిస్థితి లేదన్నారు. అమెరికాలో చెత్త వేయకుండా తమ చేతిలో ఉంచుకుని చెత్తకుండీ ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లి వేస్తారని, అదే వ్యక్తులు మన ఇండియాకు వస్తే అక్కడ సిస్టం మరిచిపోయి ఎక్కడపడితే అక్కడ చెత్త పడేస్తారన్నారు. అక్కడ ఉన్న చట్టం మన దేశంలో కూడా అమలు చేస్తే బాగుంటుందన్నారు. నిబంధనలు అమలు చేయడంలో అమెరికా ఏ మాత్రం వెనుకడుగు వేయదని తెలిపారు. ప్రధాన పట్టణాల్లో అమలవుతున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానం మనదేశంలో అమలు చేస్తే బాగుంటుందన్నారు.

బొబ్బిలిలో సినిమాలు

సాయిగణపతి	- వాసుకీ
శ్రీవాసవి	- నిన్ను కోరి
వెంకటకృష్ణ	- ఫిదా
వెంకటేష్	- డర్టీ ప్రేమ
శ్రీలక్ష్మి	- గౌతమ్‌నంద

నీతి కథలపై విద్యార్థులకు పోటీలు

చీపురుపల్లి రూరల్: నీతి కథలపై పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్టు ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ మంగళవారం తెలిపారు. బాల్యం నుంచే పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గరివిడి, చీపురుపల్లి మండలాల నుంచి ఇప్పటికే విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నట్టు తెలిపారు. ఆగస్టు 14న పోటీలు నిర్వహించి, విజేతలకు 15న బహుమతులు అందజేస్తామని రమణ చెప్పారు. అధిక సంఖ్య విద్యార్థులు హాజరుకావాలని కోరారు.



రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

వల్లాపురంలో అపరిశుభ్రత

గుర్ల: వల్లాపురం గ్రామంలో అపరిశుభ్రత తాండవిస్తుంది. ప్రధాన వీధుల్లో మురికి నీరు, చెత్త, ఈగలతో దర్శనమిస్తుంది. ఎటు చూసినా.. వీధుల్లో చెడువాసనతోపాటు దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. రెండు నెలల నుంచి అధికారులకు చెప్పినా.. పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పాఠశాల ఆవరణ సమీపంలో గొల్లవీధి వద్ద పెంట కుప్పలు రోడ్డు మీద వేయడంతో పాఠశాలల్లో విద్యార్థులు ముక్కు మూసుకునే పరిస్థితి ఏర్పడుతుందని ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకంపై ఈగలు చేరి, విద్యార్థులకు రోగాలు వస్తున్నట్టు విద్యార్థులు తల్లితండ్రులు చెబుతున్నారు.

గడ్డి పెంపకంతో లాభాలెన్నో

చీపురుపల్లి: పశుగ్రాసాల పెంపకంతో రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయని ఎమ్మెల్యే కిమిడి మృణాళిని తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఊరూర పశుగ్రాసం పథకంపై రివ్యూ నిర్వహించారు. ముందుగా అధికారులు పథకం అమలుపై రైతులకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు వివిధ పంటలతో పాటు గడ్డి పెంపకం చేపట్టాలని, దీని ద్వారా రైతుకు ఏడాదికి రూ.22 వేలు ప్రభుత్వం ఇస్తున్నట్టు చెప్పారు. అంతే కాకుండా పండించిన గడ్డిని రైతే విక్రయించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఈసీఎస్ చైర్మన్ దన్నాన రామచంద్రుడు, ఎంపీడీవో రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు రౌతు కామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభివృద్ధికి కృషి

గరివిడి: దివ్యాంగుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఈవో పి.రామారావు తెలిపారు. సహిత విద్య వారోత్సవాలలో భాగంగా మంగళవారం ఆయన మండల భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగ పిల్లలు సర్వతోముఖ అభివృద్ధికి భవిత భవనం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను వివరించారు. అలాగే పిల్లల హాజరు పట్టిక, విద్య, ఆటపాటలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.రమణారావు, పి.సుమలత పాల్గొన్నారు.



పిల్లల హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎంఈవో

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే కిమిడి మృణాళిని

గుర్ల: ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయంగా పని చేస్తుందని ఎమ్మెల్యే కిమిడి మృణాళిని తెలిపారు. మంగళవారం గుర్ల జడ్పీ పాఠశాలల్లో తట్టు, రుబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నారని, ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, చెడు వ్యసనాల కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ తిరుమలరాజు పద్మిని, ఎంపీపీ జమ్ము సత్యం, టీడీపీ మండల అధ్యక్షుడు వెన్నె సన్యాసినాయుడు, సర్పంచ్‌లు కిల్లారి వెంకటలక్ష్మి, సూర్యనారాయణ, కర్రోతు రమణమ్మ, గోవింద్, మండల విప్ సంచాన సన్యాసినాయుడు, ఆత్మ డైరెక్టర్ కనిమెరక కృష్ణ, నేతలు చనుమల్ల మహేశ్వరరావు కిరణ్‌కుమార్,



గరివిడిలో టీకాలు వేస్తున్న సిబ్బంది





చీపురుపల్లి, గర్భాంలో టీకాలు వేస్తున్న ఎమ్మెల్యే మృణాళిని, వైద్య సిబ్బంది

వైద్యాధికారి చండీప్రియ పాల్గొన్నారు. తెట్టంగి పీహెచ్‌సీలో వైద్యాధికారి సంతోష్ రూప ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెన్నె సన్యాసినాయుడు ఎంఆర్ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గరివిడి: 9 నెలల నుంచి 15 ఏళ్ల లోపు గల చిన్నారులకు తట్టు, రుబెల్లా టీకాలు వేయాలని గరివిడి పీహెచ్‌సీ సలహా సంఘం అధ్యక్షుడు పొండ్రంకి కామేశ్వరరావు సూచించారు. మంగళవారం గోదావరి దేవి షరాఫ్ పాఠశాలలో వైద్యాధికారి పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో టీకాలు విద్యార్థులకు వేశారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ, టీకాలను ప్రభుత్వం ఉచితంగా వేయిస్తుందని, పిల్లలకు ఎలాంటి రోగాలు రాకుండా ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు సరస్వతి, విజయలక్ష్మి, కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరకముడిదాం: ఎంఆర్ టీకాతో తట్టు, రుబెల్లా వ్యాధులను నిర్మూలించవచ్చని గర్భాం పీహెచ్‌సీ వైద్యాధికారి టి.తిరుమలరావు తెలిపారు. గర్భాం గ్రామంలోని రవితేజ పాఠశాలలో ఎంఆర్ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మొత్తం 200 మంది విద్యార్థులకు టీకా వేశారు.

చీపురుపల్లి: చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలంటే ఎంఆర్ టీకా తప్పనిసరిగా వేయించాలని ఎమ్మెల్యే కిమిడి మృణాళిని తెలిపారు. మంగళవారం పట్టణంలో జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో తట్టు, రుబెల్లా టీకా కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ టీకా వల్ల భవిష్యత్‌లో ప్రాణాంతక వ్యాధులు ప్రబల వని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ, ఆర్ఈసీఎస్ చైర్మన్లు పెరిచర్ల సీతారామరాజు, దన్నాన రామచంద్రుడు, టీడీపీ నాయకుడు కిమిడి నాగార్జున పాల్గొన్నారు.

చీపురుపల్లి రూరల్: చిన్న పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి అర్చనాదేవి సూచించారు. మంగళవారం కర్లాంలో చిన్నారులకు ఎంఆర్ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రెస్కో డైరెక్టర్ కెల్ల రామారావు, సర్పంచ్ బాణాన రామకృష్ణంనాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందికి సర్పంచ్‌లతో పనిలేదా?

● కనీసం సమాచారం ఎందుకివ్వరు? ● సర్పంచ్‌లు, నాయకుల ఆగ్రహం

మెరకముడిదాం: ఉపాధి హామీ పథకం అధికారులకు, సిబ్బందికి సర్పంచ్‌లతో పనిలేదా? గ్రామ సర్పంచ్‌కు పనులు ఎలా జరుగుతాయి? పూర్తిగా ప్రగతి కుంటిపడిపోవడంలో మీ నిర్లక్ష్యమే ప్రధాన కారణం అంటూ సర్పంచ్‌లు, మండల నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీవో జగన్నాథరాజు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం అమలుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, నాయకులు బూర్లె నరేష్‌కుమార్, మండల సత్యన్నారాయణ, కోట్ల విశ్వేశ్వరరావు, లంక భాస్కరరావు, టి.హరిబాబు, ఎస్.వెంకటపతిరాజు తదితరుల ఉపాధి సిబ్బంది తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉపాధి పథకం నుంచి ఏ పనులు నివేదికలు కూడా అందజేయడం లేదని అన్నారు. మండలంలోని ఉపాధి ప్రగతి దిగజారిపోయిందని, ప్రగతిని పరిశీలించడంటూ పత్రాలను చూపించారు. ఉత్తరావల్లి, పులిగుమ్మి గ్రామాల్లో కొంతకాలంగా క్షేత్ర సహాయకులు లేరని, నియామక విషయంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని పలువురు ప్రశ్నించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ పి.సింహాచలం, ఏపీవో శేఖర్, ఈసీ జోగారావు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



సభలో అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్‌లు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

గరివిడి: కుమరాం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీ అయిన లంక చిరంజీవి, మదుండి వెంకటేశ్వరరావు, సుంకరి శ్రీరాములకు మంగళవారం హెచ్ఎం జె.పద్మ ఆధ్వర్యంలో సన్మానించారు. అలాగే తాటిగూడ జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేసి బదిలీ అయిన ఎస్.సూర్యారావును హెచ్ఎం ఎం.లీలాకుమారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



కుమరాంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రణాళిక లేకపోతే ఇబ్బంది పడతాం

చీపురుపల్లి: తోటపల్లి కుడి కాలువ నీరు విడుదల విషయంలో ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్లలేకపోతే భవిష్యత్‌లో ఇబ్బంది పడతామని ఎమ్మెల్యే కిమిడి మృణాళిని అన్నారు. సోమవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో తోటపల్లి ప్రాజెక్టు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సమస్యలను ఎమ్మెల్యే అధికారులకు వివరించారు. ముఖ్యంగా చెరువులకు నీరు అందడం లేదని వాపోయారు. దీనిపై ప్రాజెక్టు డీఈ డోల తిరుమలరావు మాట్లాడుతూ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో తోటపల్లి కాలువల పరిధిలో పూర్తిస్థాయిలో నీరు అందడం లేదన్న మాట వాస్తవం అని, రెండు జిల్లాల్లో 500 కిలోమీటర్ల పిల్ల కాలువలు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించగా, ఇందులో 420 కిలో మీటర్లు పూర్తి చేసినట్టు తెలిపారు. మధ్యలో చెరువులకు గండి కొట్టడం వల్ల నీరు సరిపోవడం లేదని, ఇటువంటి విషయాల్లో రైతులు సహకరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, తోటపల్లి కాలువల ద్వారా ఎన్ని క్యూసెక్కుల నీరు అవసరమో ముందుగా ప్రణాళిక చేసుకోవాలని చెప్పారు. దీనిని సంబంధిత మంత్రి, సీఎం దృష్టికి తీసుకువెళ్లి ఇంకా ఎక్కువ నీరు విడుదల చేయడానికి అనుమతులు తీసుకోవాలని సూచించారు. బొబ్బిలికి 10 వేల ఎకరాలకు నీరు ఇవ్వవలసిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. గజపతినగరం కాలువ పనులు పూర్తి కాలేదని తెలిపారు. ప్రతి ఎకరాకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ బలగం కృష్ణమూర్తి, ఈఈ రామచంద్రరావు, డీఈ రామకృష్ణ, తహసీల్దార్, ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మృణాళిని

సమయపాలన పాటించండి

బొబ్బిలి రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలని ఎంపీడీవో ఎ.త్రినాథరావు సూచించారు. మంగళవారం ఆయన జగన్నాథపురం అంగన్‌వాడీ-2 కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల హాజరు, అమృతహస్తం అమలు విషయాలను కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు.

చీపురుపల్లిలో సినిమాలు

అనురాగ్	- వైశాఖం
అమోగ్	- శమంతకమణి
వంశీ	- నిన్నున్న కోరి
విష్ణు	- ఫిదా
నటరాజ్	- బాహుబలి - 2

53మంది ఉపాధ్యాయుల బదిలీ

దత్తిరాజేరు: మండల పరిధిలోని పాఠశాలలకు చెందిన 53మంది ఉపాధ్యాయులు బదిలీ అయినట్లు మండల విద్యాశాఖాధికారి ఎం.వెంకటరమణ తెలిపారు. మంగళవారం 43మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారని తెలిపారు. మరో పదిమంది రేపటికల్లా విధుల్లో చేరతారని తెలిపారు. మండలంలో మొత్తం 63 పాఠశాలల్లో 175 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని పూర్తిస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.



నియామక పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ

ఆధునిక పద్ధతిలో సాగు చేయండి



రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో హర్షలత

గంట్యాడ : రైతులు ఆధునిక పద్ధతిలో సాగు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి గ్రేష్ హర్షలత అన్నారు. మంగళవారం గింజేరు, పెదమజ్జిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి సాగు చేసే రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. పచ్చి రొట్ట ఎరువులు వినియోగం, వాడకంపై అవగాహన కల్పించారు. వరి నారును రక్షించుకునేందుకు రైతులకు అవగాహన కల్పించారు. అవసరమైతే ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

● **పత్తి సాగుపై అవగాహన**



దత్తిలో పత్తి పంటను పరిశీలిస్తున్న దృశ్యం

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలో వ్యవసాయాధికారిణి గోవిందమ్మ ఆధ్వర్యంలో పత్తి సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా పత్తిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా సాగులో సస్యరక్షణ తెగుళ్ళ నివారణకు చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ తిరుపతిరావు, ఎంపిఈఓ సాయి, సీఆర్‌పీ అప్పారావు, సీఓ పార్వతి, రైతులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

దత్తిరాజేరు: మండలంలోని జాతీయ రహదారిపై సోమవారం రాత్రి పెదమానాపురం ఎస్ఐ నాయుడు ఆధ్వర్యంలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అధిక ప్రయాణికులతో నడుపుతున్న 9మంది ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడి

● **మద్యం సీసాలు, ఖైనీ, గుట్కాలు స్వాధీనం**

గంట్యాడ : మండలంలోని లక్కిడాం, బుడతనాపల్లి గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తుల నుంచి మద్యం సీసాలను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గంట్యాడ ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాలు ప్రకారం బుడతనాపల్లి గ్రామంలోని ఒక వ్యక్తి వద్ద నుంచి 10 మద్యం సీసాలు, ఖైనీ,గుట్కాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. లక్కిడాం గ్రామంలోని 18 సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా మద్యం, ఖైనీ, గుట్కాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు, ఖైనీ గుట్కాలు

పిల్లల ఆరోగ్యమే మహాభాగ్యం

ఎంఆర్ వ్యాక్సిన్ ప్రారంభం





గజపతినగరం, దత్తిరాజేరులో చిన్నారులకు ఎం.ఆర్. వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

మరుపల్లి(గజపతినగరం రూరల్): పిల్లలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి అన్నారు. మంగళవారం మండలంలోని మరుపల్లి ఎం.పి.పి పాఠశాలలో విద్యార్థులకు ఎం.ఆర్. వ్యాక్సిన్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మీజిల్స్, రుబెల్లా వ్యాధులు రెండింటినీ నిలువరించేందుకు ప్రభుత్వం ఈ వ్యాక్సిన్‌ను తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను అదికారులు సక్రమంగా నిర్వర్తించినప్పుడే దానికి సార్థకత ఉంటుందన్నారు. మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిని జయశ్రీ మాట్లాడుతూ మండలంలోని 14,258మంది పిల్లలను గుర్తించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్.ఓ జోస్పిన్, హెచ్ఎం మోహనరావు, ఏఎన్ఎం భాగ్యలత, అంగన్‌వాడీ కార్యకర్త సన్యాసమ్మ, హెల్త్ అసిస్టెంట్ ఈశ్వరరావు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: ఎంఆర్ వ్యాక్సిన్ చిన్నారుల ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని ఎంపీపీ బెజవాడ రాజేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలందరికి ఈ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయాలని ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కెవివి సత్యనారాయణ, ఎంపీడీవో కెవిఆర్ పట్నాయక్, తహసీల్దార్ జి.కల్పవల్లి, సీహెచ్ఓ కృష్ణమూర్తి, హెల్త్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ : పిల్లలందరికీ ఎంఆర్ టీకాలు వేయించాలని ఎంపీపీ దేవుడమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం పెంటశ్రీరాంపురం గ్రామంలోని టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అదేవిధంగా లక్కిడాం గ్రామంలోని జడ్పీటీసీ సభ్యులు రమేష్‌కుమార్ చేతుల మీదుగా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు పద్మావతి, టీడీపీనేత కిలపర్తి పరదేశినాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి: రెండు జబ్బులకు ఒకే టీకా ఎంఆర్ వ్యాక్సిన్‌ను బొండపల్లి ఉన్నతపాఠశాలలో జడ్పీటీసీ, ఎంపీపీ బాలాజీ ఎల్లమ్మలు ప్రారంభించారు. మంగళవారం మండలంలో 9 కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలకు చెందిన 1073 మంది విద్యార్థులకు టీకాలు వేశారు. దేవుపల్లి పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారి కనకదుర్గ ఆధ్వర్యంలో ఉన్న పాఠశాలలో ఆసుపత్రి సలహా సంఘం అధ్యక్షుడు జిజె వర్మ ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.మిధున, సర్పంచ్ వర్రిసత్యవేణి, ఎంపిటిసి జె సూర్యనారాయణమ్మ, ఎంపడిఓ ప్రకాశరావు, ఎంఈఓ సింహాచలంతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



బొండపల్లిలో టీకా వేస్తున్న దృశ్యం

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

గుడివాడ(గజపతినగరం రూరల్): ఉపాధిహామీ కూలీలు తమ బ్యాంక్ ఖాతాలకు సంబంధించి ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేసుకోవాలని ఉపాధి హామీ ఏపీవో కృష్ణవేణి అన్నారు. మంగళవారం మండలంలోని గుడివాడ, బంగారమ్మపేట, భూదేవిపేట గ్రామాల్లో కూలీలకు ఆధార్ అనుసంధానంపై అవగాహన కల్పించారు. మండలంలోని ఇంతవరకు 700 మందికి ఆధార్ అనుసంధానం కాలేదని తెలిపారు. దీనివలన ప్రభుత్వం ఇచ్చే రాయితీలను. పథకాలను కోల్పోయే అవకాశం ఉందని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ జాబ్‌కార్డుతో పాటు బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈసీ తిరుమలరావు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.



కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీవో కృష్ణవేణి



సమావేశంలో మాట్లాడుతున్న సూపర్ వైజర్ విద్యవతి

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

పాతబగ్గాం(గజపతినగరంరూరల్): తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.విద్యవతి తెలిపారు. మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పాతబగ్గాం గ్రామంలో బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల సంస్కృతికి సుస్థిర ప్రోత్సాహం అందించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. విద్యావంతులు తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లెంక పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యత నిర్మూలనకు సహకరించాలి

● **ఎంపీడీవో ప్రకాశరావు**

బొండపల్లి: గ్రామాల్లో నిరక్షరాస్యత నిర్మూలనకు చిట్టి గురువులు సహకరించాలని ఎంపీడీవో ఎం.ప్రకాశరావు కోరారు. మంగళవారం బొండపల్లి గ్రామం ఉన్నత పాఠశాలలో బోధన కరదీపికను చిట్టిగురువులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిట్టి గురువుల సంతకం చేయడం వరకు తీర్చిదిద్దడమే కాకుండా చదవడం, రాయడం నేర్పించాలని సూచించారు. జడ్పీటీసీ బండారు బాలాజీ మాట్లాడుతూ అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.



చిట్టిగురువులతో మాట్లాడుతున్న ఎంపీడీవో



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

గంగచోళ్లపెంట (గజపతినగరం రూరల్) : మండలంలోని గంగచోళ్ల పెంట గ్రామం లో ఎం.పి.పి పాఠశాలలో మంగళవారం జిల్లా ఆర్య వైశ్య సంఘం వాసవీ సరస్వతీ ట్రస్టు ద్వారా 68 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు ఎ.శేఖర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తమవంతు సహాయ సహకారాలందించాలనే ధ్యేయంతో పుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యలో ఉత్తమ ప్రతిభ కనబర్చినవారికి ప్రోత్సాహకం అందిస్తున్నామన్నారు. ఈకార్యక్ర మంలో ప్రధాన కార్యదర్శి కోట ఈశ్వరరావు, కోశాధికారి వజ్రపు తాతాజీ, మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, ఎ.వి.యస్. శేఖర్, పి.వి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వాలీబాల్ ఫైనల్ పోటీలు

ఎల్విన్‌పేట (గుమ్మలక్ష్మీపురం): ఎల్విన్‌పేటలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తునన వాలీబాల్ ఫైనల్స్ పోటీలను బుధవారం నిర్వహిస్తున్నట్టు ఎస్‌ఐ కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపారు. ఇటీవల మండలంలోని దుడ్డుఖల్లు, బొడ్డెంఖర్జ, కొత్తగూడ, ఎల్విన్‌పేట కేంద్రాల్లో వాలీబాల్ పోటీలను నిర్వహించామని, ఈ పోటీల్లో విజయం సాధించిన 8 బృందాలను కలుపుతూ ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఫైనల్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. గిరిజన యువతలో ప్రతిభను వెలికితీయడానికి ఈ పోటీలే దోహదం చేస్తాయని ఆయన స్పష్టం చేశారు.

వ్యాక్సిన్లు ఎంతగానో ఉపయోగకరం

గరుగుబిల్లి: చిన్నారుల ఆరోగ్యానికి వ్యాక్సిన్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంపీపీ జి.ఉషాసరస్వతి, వైస్ ఎంపీపీ ధనుంజయరావు అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పిల్లలకు టీకాలు వేయించుకొనేందుకు తల్లిదండ్రులను ప్రోత్సహించాలన్నారు. రావివలస, గరుగుబిల్లి వైద్యాధికారులు డాక్టర్ ఎన్.రజని, ఆర్‌వీ రేవతి మాట్లాడుతూ మండలంలో సెప్టెంబర్ 8వ తేదీ వరకు టీకాల వేయనున్నట్టు చెప్పారు. ఎంపీహెచ్‌ఈవో బొత్స శ్రీరాములునాయుడు మాట్లాడుతూ ప్రతి రోజూ 200 మందికి ఒక బృందం టీకాలు వేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ పెద్దింటి పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


గరుగుబిల్లిలో టీకాలు వేస్తున్న దృశ్యం

రావాడరామభద్రపురంలో..

కురుపాం: కురుపాంలో విద్యార్థులకు తట్టు, పొంగు నివారణ టీకాలు వేశారు. మంగళవారం ఈ కార్యక్రమంలో భాగంగా కురుపాంలో రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టీకాలు వేశారు. ఈ సందర్భంగా కేజీబీవీలో పీహెచ్‌సీ వైద్యాధికారి వి.భాగ్యశ్రీ, ఏఎంసీ చైర్మన్ కోలా రంజిత్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ అంధవరపు కోటేశ్వరరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ బండి రాజు విద్యార్థులకు ఎంఆర్ టీకాలు వేసినట్టు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి, కేజీబీవీ ప్రత్యేకాధికారి శ్రీరంజిని, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డీవీఎస్‌ఎస్ అరుణ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం నారాయణరావు, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పిల్లలకు ఎంఆర్ టీకాలు వేస్తున్న దృశ్యం

ఏజెన్సీలో కానరాని బయోమెట్రిక్ హాజరు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో బయోమెట్రిక్ హాజరు విధానం కానరావడం లేదు. ఎంపీడీవో కార్యాలయం, ఆసుపత్రులు, వెలుగు కార్యాలయం, వివిధ విద్యా సంస్థల్లో బయోమెట్రిక్ ఏర్పాటు చేసినా అమలుకావడం లేదు. ఏజెన్సీ మండలాల్లో 90 శాతం మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు వారు పనిచేసేమ గ్రామాల్లో, మండల కేంద్రాల్లో ఉండటం లేదు. వీరందరూ పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, తదితర ప్రాంతాల నుంచి రోజూ వస్తూ, వెళుతుంటారు. ఈ కారణంగా ఏజెన్సీలో ఉద్యోగాల సమయపాలన ఆశించిన విధంగా ఉండదు. ఈ కారణంగా బయోమెట్రిక్ విధానం అమలుకు చిత్తశుద్ధి కానరావడం లేదు. నెట్‌వర్క్ లేదని, యంత్రాలు పనిచేయడం లేదని, వచ్చిన యంత్రాలు అమర్చలేదని ఇలా వివిధ షాకులు చెబుతుంటారు. ఏజెన్సీలోని ప్రభుత్వ సంస్థల్లో బయోమెట్రిక్ విధానం శత శాతం అమలైతే ఉద్యోగుల పనితీరు మెరుగుపడి గిరిజన ప్రజలకు మరిన్ని సేవలందుతాయి. జిల్లా ఉన్నతాధికారులు బయోమెట్రిక్ హాజరు విధానం అమలుకు చిత్తశుద్ధిగా కృషి చేయాలని గిరిజన నాయకులు కోరుతున్నారు. అంతేకాకుండా ఏజెన్సీలో చాలా మంది ఉద్యోగులు ఆడిందే ఆటగా పాడిందే పాటగా ఉద్యోగాలు చెయ్యడంతో ఈ విధానానికి తూట్లు పొడుస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

పాఠశాలలకు ఏజెన్సీల ద్వారా గుడ్లు

● **భోజన నిర్వాహకులకు కళ్లెం**

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల పరిధిలోని విద్యార్థినీ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి ఏజెన్సీల నుంచి గుడ్లు సరఫరా చేస్తున్నారు. మండలానికి 52 పాఠశాలలకు ప్రత్యేక వాహనంపై గుడ్లు సరఫరా చేస్తున్నారు. గతంలో భోజన నిర్వాహకులకే ప్రభుత్వం గుడ్లు బాధ్యత అప్పగించింది. సక్రమంగా గుడ్లు అందించకపోవడంతో విమర్శలు వచ్చాయి. దీంతో నేరుగా పాఠశాలలకు అప్పగించేలా ఏజెన్సీలకు ప్రభుత్వం అప్పగించింది. ప్రస్తుతం సరఫరా చేస్తున్న గుడ్లుకు మొదటి వారం పసుపు రంగు, రెండవ వారం ఎరుపు రంగు, మూడవ వారం గులాబీ రంగు, నాల్గవ వారం నీలం రంగులతో కూడిన గుర్తులను వేస్తూ అందిస్తున్నారు.

సోమ, బుధ, శుక్రవారాల్లో గుడ్లు, మిగిలిన రోజుల్లో కాయగూరలు, పప్పు, సాంబారు అందించాల్సి ఉంది. పాఠశాలలకు ఒక్కొక్క గుడ్డును రూ. 2.35లకు ఏజెన్సీ నిర్వాహకులు సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రా లకు అందిస్తున్న గుడ్లుకు ప్రత్యేక మార్కును వేశారు.


కొత్తూరు పాఠశాలకు సరఫరా చేస్తున్న గుడ్లు

సర్కార్ బడుల్లో కానరాని స్వచ్ఛత

● **ఆరుబయటే పిల్లల మల మూత్ర విసర్జన**

కురుపాం రూరల్: స్వచ్ఛభారత్ పిలుపుకు మండల విద్యాశాఖ గండికొడుతోంది. స్వచ్ఛభారత్‌లో భాగంగా బహిరంగ మలమూత్ర విసర్జన దురలవాటు నుంచి పిల్లలను కాపాడాలనే భావంతో అన్ని పాఠశాలల్లోనూ మరుగుదొడ్లల నిర్మించారు. వీటిని శుభ్రం చేసేందుకు వెలుగు సంస్థ ద్వారా స్థానికంగా ఉండే మహిళలకు ఉపాధి కల్పించారు. వెలుగు శాఖ ద్వారా అవసరమైన శుభ్రపరిచే బ్రష్‌లు, ఫినాయల్, యాసిడ్ తదితర సామగ్రిని సరఫరా చేస్తున్నారు. అయితే ఇదంతా కాగితాలకే పరిమితం. చాలా పాఠశాలల్లో స్వచ్ఛత కన్పించడం లేదు. మరుగుదొడ్లు కట్టించిన అధికారులు తగిన నీటి ఏర్పాట్లు చేయకపోవడంతో మరుగుదొడ్లకు తాళాలు వేసే ఉంటున్నాయి. పిల్లలు యథావిధిగా ఆరుబయటే కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. కొన్ని పాఠశాల్లో అయితే మరుగుదొడ్లు శిథిలం కాగా, మరికొన్నిటిలో అసలు నిర్మాణాలే లేవు. గుమ్మగదబవలస పాఠశాలలో 25 మంది పిల్లలు ఉండగా మరుగుదొడ్లకు తలుపులు లేవు. రన్నింగ్ వాటర్ లేదు. మరి ఇటువంటి పరిస్థితుల్లో పిల్లలకు మరుగుదొడ్ల అలవాటు ఎలా అలవడుతుందో ప్రభుత్వానికే తెలియాలి.


గుమ్మగదబవలసలో మరుగుదొడ్ల దుస్థితి

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

కొంకడివరం (గరుగుబిల్లి): తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వంగపండు వెంకటరమణమ్మ, నల్ల గౌరమ్మలు అన్నారు. మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొంకడివరం, లఖనాపురం గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ముందుగా అవగాహనకు వీధుల్లో ర్యాలీ నిర్వహించి తల్లిపాల విశిష్టతను తెలియపర్చారు. ఈ సందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ తల్లిపాలలో అధిక పోషక విలువలు ఉన్నాయన్నారు. జన్మించిన గంటలోపు శిశువుకు విధిగా ముర్రుపాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.


కొంకడివరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

తల్లిపాలు సంజీవిని

భద్రగిరి (గుమ్మలక్ష్మీపురం): భద్రగిరి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల మంగళవారం వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి విజయలక్ష్మి మాట్లాడతూ బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలు సంజీవినిలా కాపాడుతాయన్నారు. బిడ్డ పుట్టిన రోజు నుంచి క్రమం తప్పకుండా తల్లిపాలు పట్టాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బాలింతలకు తల్లిపాలు ఇవ్వడంపై తగిన అవగాహన కల్పించాలన్నారు.

రెవెన్యూ సమస్యలపై నిర్లక్ష్యం తగదు

గరుగుబిల్లి: రెవెన్యూ సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా ఉం డకూడదని సీసీఎల్‌ఏ కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా సూచించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్హులైన వారికి రుణ అర్హత కార్డులను అందించాలన్నారు. మ్యూటేషన్లు, వెబ్ ల్యాండ్‌లకు సంబంధించి రైతులకు అసౌకర్యం కలగకుండా వేగ వంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణమూర్తి, ఆర్‌ఐ పి.శ్రీనివాసరావు, సీనియర్ సహాయకులు ఎస్.తిరుపతినాయుడులు ఉన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరైన తహసీల్దార్, సిబ్బంది

నేడు పాలిటెక్నిక్ కళాశాల భవనం ప్రారంభం

చినమేరంగి (జియ్యమ్మవలస): చినమేరంగిలోని శ్రీమతి శత్రుచర్ల శశికళాదేవి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనం బుధవారం ప్రారంభించనున్నట్టు ప్రిన్సిపాల్ ఏవీ విజయసింహ చెప్పారు. ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు చేతులమీదుగా ప్రారంభమవుతుందని తెలిపారు. నాలుగేళ్లుగా ఇంటిగ్రేటెడ్ వసతిగృహంలో పాలిటెక్నిక్ కళాశాల కనొసాగుతున్న విషయం పాఠశాలకు విదితమే. ఈ భవనం ప్రారంభమైతే విద్యార్థులకు కొంత ఉపశమనం లభిస్తుంది. గతంలో దీనిపై ఆంధ్రజ్యోతిలో అనేక కథనాలు వచ్చాయి.

అర్హులైన వారికి గృహాల మంజూరు

ఉల్లిభద్ర (గరుగుబిల్లి): అర్హులైన వారికి పక్కా గృహం మంజూరు చేయనున్నట్టు ఎంపీడీవో జి.పార్వతి అన్నారు. మంగళవారం ఉల్లిభద్రలో లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత జన్మభూమిలో దరఖాస్తు చేసుకున్నవారిని పరిశీలించడానికి ఈ నెల 8వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్టు చెప్పారు. దరఖాస్తు చేసుకున్న వారి ఆధార్, రేషన్, బ్యాంకు, ఉపాధి హామీ జాబ్ కార్డు నఖలు అందించాలన్నారు. గృహ నిర్మాణానికి అవసరమైన స్థలం ఉండాలన్నారు. మండలం మొత్తంపై పరిశీలించి పూర్తి జాబితాను ఈ నెల 10 నాటికి ఉన్నతాధికారులకు అందించనున్నట్టు చెప్పారు. తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణమూర్తి గిజబలో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీవీ రమణమ్మ కొంకడివరంలో, గృహ నిర్మాశాఖ జేఈ దొనక చిరంజీవి రావుపల్లిలో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు, వీఆర్‌వోలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.


వేతనదారులక్కు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పరిసరాలు పరిశుభ్రతతోనే గ్రామాల్లో ఆరోగ్యం సాధ్యపడుతుందని ఎంపీడీవో జి.పార్వతి అన్నారు. ఉల్లిభద్రలో ఉపాధి హామీ వేతనదారులు రహదారుల శుభ్రతతో పాటు పిచ్చి మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధ వారాల్లో విధిగా పారిశుధ్యాన్ని పాటించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మరడాన తవిటినాయుడు, ఉపాధి ఏపీవో టి.రామకృష్ణంనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కండ్యాన రాహుల్ పాల్గొన్నారు.


ఉల్లిభద్రలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

రూ.35 వేల అపరాధ రుసుం వసూలు

భోగాపురం: పరిమితికి మంచి అధిక లోడుతో వెళ్తున్న మూడు లారీలకు ఆర్టీవో రూ.35వేలు అపరాధ రుసుం విధించారని ఎస్‌ఐలు తారకేశ్వరరావు, మహేష్ తెలిపారు. జాతీయ రహదరిపై మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా అధిక లోడుతో మూడు ఇసుక లారీలు వెళ్తున్నాయి. వీటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఆర్టీవో అధికారులకు సమాచారం అందించడంతో అధిక లోడు కలిగి ఉన్నందకుఉ మూడు లారీలకు రూ.35వేలు అపరాధ రుసుం విధించారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహన చోదకులు ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐలు హెచ్చరించారు.

కాలువల పరిశీలన

నందిగాం(భోగాపురం): నందిగాంలో నిరుపయోగంగా ఉన్న కాలువలను ఈవోపీఆర్డీ రామారావు మంగళవారం పరిశీలించారు. వాడుక, వర్షంనీరు పోయే విధంగా కాలువలు నిర్మించినా నిరుపయోగంగా ఉన్నాయి. వాడుక నీరు అంతా పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్తుండటంతో రైతులు అడ్డుకట్ట వేశారు. దీంతో ఒకరి వాడక నీరు ఇంకొకరి ఇంటి ముందు ప్రవహించకుండా అడ్డంగా గట్లు వేసుకున్నారు. దీనిపై పరిశీలించి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆన్‌లైన్‌లో 1451రుణ దరఖాస్తులు

పూసపాటిరేగ: ప్రభుత్వం నుంచి అందే వివిధ రుణాలకు గాను మండలంలో 1451 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారంతో గడువు ముగియడంతో బీసీలకు 234 యూనిట్లకు 767 .కాపు కార్పొరేషన్ 100 యూనిట్లకు 367, క్రిస్టియన్, ముస్లిం మైనారిటీలకు 4 యూనిట్లకు 37,. ఎస్సీలు 276, ఎస్టీలకు రెండు దరఖాస్తులందాయి. వీటి ఎంపికను ఈనెల 15లోగా పూర్తిచేయాల్సి ఉందని,మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఎంపిక తేదీని త్వరలో ప్రకటిస్తామని ఎంపీడీవో నారాయణరావు తెలిపారు.

బయోమెట్రిక్ పద్ధతిలోనే ఎరువుల అమ్మకాలు

పూసపాటిరేగ: ఇకపై ఎరువుల డీలర్లు బయోమెట్రిక్ ఆధారంగానే ఎరువులను అమ్మాలని వ్యవసాయశాఖ అధికారి ఎ.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఎరువుల డీలర్లతో సమావేశమయ్యారు. మండలంలోని 14మంది డీలర్లకు బయోమెట్రిక్ పరికరాలను అందజేస్తామన్నారు. దీనిపై త్వరలో శిక్షణ ఇస్తామన్నారు. పూర్తి స్టాకు వివరాలను తీసుకుంటున్నామన్నారు. పరికరాలు అందిన వెంటనే డీలర్లు అమలు చేయాలన్నారు.

నూతన సాగు పద్ధతులపై అవగాహన

ముంజేరు(భోగాపురం): రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులపై మంగళవారం ముంజేరులో అవగాహన సదస్సు నిర్వహించారు. డీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన పద్ధతిలో సాగుపై రైతులకు పూర్తిగా అవగాహన కల్పించారు. ఏవో నిర్మల, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో ఉపాధి కూలీలు



పారిశుధ్య కార్యక్రమంలో ఉపాధి కూలీలు

నందిగాం(భోగాపురం): పారిశుధ్య నిర్వహణలో భాగంగా ఉపాధి కూలీలు మంగళవారం నందిగాంలో పనులు చేశారు. తుప్పలు తీయడం, చెత్త ఎత్తి పోయడం తదితర పనులు నిర్వహించారు. అన్ని పంచాయతీల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్డీ రామారావు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, ఉపాధి హామీపథకం సిబ్బంది పాల్గొన్నారు.

‘నెల్లిమర్ల అభివృద్ధి టీడీపీ పుణ్యమే’



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నెల్లిమర్ల: నగర పంచాయతీలో అభివృద్ధి టీడీపీ పుణ్యమేనని ఆ పార్టీ నాయకులు లెంక అప్పలనాయుడు, అవనాపు సత్యనారాయణ, బయిరెడ్డి రమణ అన్నారు. నెల్లిమర్లలో మంగళవారం విలేఖరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి జరిగిందంటూ కొంతమంది నాయకులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక నెల్లిమర్ల, జరజాపుపేట గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఇళ్ల మంజూరుతో పాటు, ప్రతి వీధీ సిమ్మెంటు రోడ్లు వేయించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. రక్షిత నీటి పథకాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నెల్లిమర్లలో ఉన్న వేలాది పేద కుటుంబాలకు జి+3 ఇళ్ల సముదాయం నిర్మించనున్నామన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

భోగాపురం: ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ కర్రోతు బంగార్రాజు అన్నారు. భోగాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాధులు రాక ముందే నివారించాలన్నారు. ప్రాణాంతక వ్యాధుల్లో తట్టు, రుబెల్లా ఉన్నాయని వాటిని నివారించేందుకు ప్రభుత్వం టీకాలు వేస్తోందన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

పూసపాటిరేగ: స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీపీ మహంతి చిన్నంనాయుడు ఎంఆర్ వ్యాక్సిన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు ముందు జాగ్రత్త చర్యగా టీకాలను వేస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ వాక్సిన్ వేసుకునేలా చూడాలన్నారు. వైద్యాధికారి రాజేష్‌వర్మ మాట్లాడుతూ వాక్సిన్‌తో ప్రతికూల ఫలితాలు ఎదురుకావని, ఇప్పటికే 8 రాష్ట్రాల్లో అమలు చేశారన్నారు. పూర్తి పర్యవేక్షణలో సిబ్బంది వ్యాక్సిన్ వేస్తున్నారన్నారు. పాఠశాలలో 779 మంది విద్యార్థులతో పాటు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు టీకాలు వేశారు. జడ్పీటీసీ సభ్యుడు ఆకిరి ప్రసాదరావు, సర్పంచ్ పిన్నింటి సన్యాసి నాయుడు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు



పూసపాటిరేగలో గోడపత్రికలను విడుదల చేస్తున్న మహంతి, తదితరులు

భోగాపురం: విద్యార్థులకు రుబెల్లా, తట్టు టీకా వేయడం ఎంతో ఉపయోగకరమని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్‌సంధ్య అన్నారు. విద్యార్థులకు టీకా వేయాలని ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవడం మన బాధ్యతన్నారు.

నెల్లిమర్ల: మీజిల్స్ రుబెల్లా (ఎంఆర్) టీకాతో చిన్నారులకు ఎంతో రక్షణ ఉంటుందని కొండవెలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఆర్.నాగరాజు అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదన్నారు. విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వైద్య సిబ్బంది వెళ్లి టీకాలను వేశారు. సతివాడ వైద్యుడు సాంబమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



భోగాపురం టీకా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కర్రోతు బంగార్రాజు



నెల్లిమర్లలో చిన్నారులకు టీకా వేస్తున్న సిబ్బంది

తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీపీ

భోగాపురం: తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమని ఎంపీపీ కర్రోతుబంగార్రాజు అన్నారు. ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తల్లి పాలలో వ్యాధి నిరోదక శక్తి ఉంటుందన్నారు. ప్రతి తలీ శిశువుకు పాలిచ్చేలా అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ వర్కుర్సు పౌష్టికాహారానికి సంబంధించి ఆహార పదార్థాలను ఎగ్జిబిషన్‌లో ఉంచారు. అనంతరం తల్లి పాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. సీడీపీవో ధనలక్ష్మి, ఏసీడీపీవో ఆరుద్ర, పడాల శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు, వర్కుర్సు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికే షరతుల్లేని ఒప్పందం

నెల్లిమర్ల: కార్మికుల హక్కులు సాధించామని జూట్ మిల్లు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి పతివాడ అప్పారావు అన్నారు. మిల్లు గేటు వద్ద మంగళవారం కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కార్మికులకు ప్రయోజనకరమైన ఒప్పందాన్ని చేశామన్నారు. ఫిబ్రవరిలో 20 శాతం డీఏతో వేతనాలను ఇప్పించామన్నారు. కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్‌ఐ కార్డులు ఇప్పించామని, సంక్రాంతికి పూర్తి బోనస్ చెల్లింపు చేశామని వివరించారు. ఏళ్లుగా ఉన్న రూ.18కోతను నిలుపుదల చేయించామన్నారు. కాంట్రాక్టు కార్మికులకు 2016 నుంచి వేతనాలను పెంపుదల చేయించి ఎరియర్స్ ఇప్పించిన ఘనత శ్రామిక సంఘందేనన్నారు. ఏళ్లుగాపెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ చెల్లింపులను చేయించామన్నారు. యాజమాన్యం గ్రాట్యుటీ చెల్లించాలంటే షరతులు విధించేదని ఎలాంటి షరతులు లేకుండానే ఒప్పందం చేశామన్నారు. చిక్కాల వెంకట గోవిందరావు, రెడ్డి సన్యాసినాయుడు, సముద్రపు సత్యనారాయణ, పతివాడ సత్యనారాయణ, బేతా అప్పారావు, మొయిద ఆదినారాయణ పాల్గొన్నారు.



కార్మిక సభలో మాట్లాడుతున్న అప్పారావు

తీరంలో అప్రమత్తం



చింతపల్లిలో మత్యకారులను అప్రమత్తం చేస్తున్నదృశ్యం

పూసపాటిరేగ: తీరప్రాంత భద్రత దృష్ట్యా మెరైన్ పోలీసులు మత్యకారులను అప్రమత్తం చేస్తున్నారు. మంగళవారం చింతపల్లి తీరంలో మెరైన్ ఎస్‌ఐ రామారావుతోపాటు, పోలీసు సిబ్బంది మత్యకారులకు సూచనలను ఇచ్చారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ తీరంలోగాని, సముద్రంలోగాని ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే 1093కు ఫోన్‌చేసి తెలియపరచాలని మత్యకారులకు తెలిపారు. తీరప్రాంత భద్రత దృష్ట్యా మత్యకారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సముద్రంలో వేటకు వెళ్లేటపుడు సముద్రజలాల్లో అనుమానస్పద స్థితిలో బోట్లు, వ్యక్తులు కనిపిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నెంబరుకు తెలియపరచాలన్నారు. సరిహద్దుల్లో ప్రస్తుతం నెల కొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో అప్రమత్తం చేస్తున్నారు.

సినిమాలు

నెల్లిమర్ల

సాయిసుభద్ర :	ఫిదా
శ్రీనివాస :	ఏజెంట్ భైరవ

పూసపాటిరేగ

శ్రీసాయికృష్ణ :	గౌతమ్‌నంద

భోగాపురం

శ్రీగోపాలకృష్ణ :	గౌతమ్ నంద

పీస్ రేట్లు సవరించక పోతే సమ్మె

కొత్తవలస: తమకు చెల్లించే పీస్ రేట్లను సవరించకపోతే సమ్మె చేస్తామని కొత్తవలసకు చెందిన ముఠా కార్మికులు హెచ్చరించారు. ఈమేరకు వారు మర్చంట్స్ అసోసియేషన్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం సీఐటీయూ డివిజన్ కార్యదర్శి దేగల అప్పలరాజుతో కలిసి ముఠా కార్మికులు విలేఖరులతో మాట్లాడారు. 2014 మే 1న పీస్ రేట్లను ప్రకటించి రెండేళ్ల ఒప్పందం చేశారని తెలిపారు. గడువు పూర్తయినా రేట్లను సవరించలేదన్నారు. ప్రస్తుత రేట్లపై 100 శాతం పెంచాలని, ప్రతి ముఠా కార్మికుడికి రెండు జతల దుస్తులను ప్రతి ఏడాది ఇవ్వాలని డిమాండ్ చేశారు. 14 రోజుల్లోగా వీటిని నెరవేర్చాలని కోరారు.సమావేశంలో ముఠా కార్మిక సంఘ నేతలు జామి వెంకటప్పారావు, సూరెడ్డి శ్రీను, జె.శంకరరావు, జామి దేముడు, జక్కాన సత్యనారాయణ పాల్గొన్నారు.


విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు పరిశీలిస్తున్న స.హ. వేదిక నేతలు

ఎస్.కోట సబ్‌స్టేషన్ పనుల పరిశీలన

శృంగవరపుకోట: ఎస్.కోట సబ్‌స్టేషన్ పనులను మంగళవారం సమాచార హక్కు ప్రచార ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు దొడ్డి సూర్యారావు, ప్రధానకార్యదర్శి గోకేడ సూర్యనారాయణ పరిశీలించారు. ఏడీఈ కేవీ పరదేశిబాబు ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం గూర్చి వారికి వివరించారు. 50సెంట్లలో రూ.1.20 కోట్లతో నిర్మిస్తున్నట్లు చెప్పారు.


పోస్టర్ విడుదల చేస్తున్న గాడి అప్పారావు తదితరులు

చలో పార్లమెంట్ విజయవంతం చేయండి

కొత్తవలస: రైతులు, ఉపాధి కూలీల సమస్యలపై ఈ నెల 9న చేపట్టనున్న చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షుడు గాడి అప్పారావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కొత్తవలస జంక్షన్‌లో ఆ కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. ఉపాధి హామీ పథకానికి ప్రతి ఏడాది క్రమం తప్పకుండా తగినన్ని నిధులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి దేగల అప్పలరాజు, గండ్రెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న జగన్ తదితరులు

క్రషర్ కార్మికుడి కుటుంబానికి పరిహారం

వేపాడ : సోంపురం -నర్సిపల్లి మెట్ట సమీపంలో నిర్వహిస్తున్న క్రషర్‌లో ఇటీవల మృతిచెందిన కార్మికుడు వారాది రమణ కుటుంబానికి రూ.4.3లక్షల చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి చల్లా జగన్ మాట్లాడుతూ పరిహారంతో పాటు బాధిత కుటుంబానికి సగం జీతం ఇస్తామని ప్రకటించిన యజమాని రమణమూర్తి మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో జాకేరు గ్రామ ఉపసర్పంచ్ బుద్ధ అప్పలనాయుడు, కార్మిక సంఘ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల రక్తదానం


రక్తదానం చేస్తున్న వలంటీర్

శృంగవరపుకోట : ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రక్తదానం చేశారు. జిల్లా వైద్య విధాన పరిషత్ వైద్యులు వీరి నుంచి రక్తం సేకరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎస్ రామానుజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి కృష్ణకుమార్, చరిత్ర అధ్యాపకుడు చల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




కొత్తవలసలో వ్యాక్సిన్ వేస్తున్న జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ వేపాడలో టీకా వేస్తున్న ఎంపీపీ , తుమ్మికాపల్లిలో వేస్తున్న సర్పంచ్ సన్యాసమ్మ

చిన్నారులకు ఎంఆర్ టీకా వేయించండి

- ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

శృంగవరపుకోట రూరల్ : ఎంఆర్ వ్యాక్సిన్ వేయించడంలో వైద్య సిబ్బంది, తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహించరాదని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మంగళవారం ఆమె వేములాపల్లిలోని సత్యసాయి పాఠశాలలో ఈ వ్యాక్సినేషన్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ లగుడు శ్రీనివాసరావు, కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తవలస: కొత్తవలస ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఎంఆర్ టీకా వేశారు. జడ్పీటీసీ సభ్యురాలు కోళ్ల రమణమ్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొరపల్లి అలేఖ్య, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కనకాల శివ, టీడీపీ మండలాధ్యక్షుడు కోళ్ల వెంకటరమణ, మాజీ సర్పంచ్ కొరుపోలు అప్పారావు పాల్గొన్నారు.

సోంపురం(వేపాడ): బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి అనురాధ మంగళవారం సోంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎంఆర్ వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు ఉన్నత, మూడు ఎంపీపీ పాఠశాలల విద్యార్థులకు ఈ వ్యాక్సిన్ వేశామన్నారు. సర్పంచ్ మురిపిండి గంగరాజు, మాజీ సర్పంచ్ జాగారపు రామునాయుడు, ఏఎన్ఎం స్వప్నకుమారి, ట్రైనీ ఏఎన్ఎం జి.దుర్గాభవానీ తదితరులు పాల్గొన్నారు. ప్రతి విద్యార్థి మీజిల్స్, రూబెల్లా వ్యాధుల నుంచి రక్షణ పొందాలని ఎంపీపీ దాసరి లక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె వేపాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఆర్ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రమేష్‌బాబు, ఎంఈవో మంతా నాగేశ్వరరావు, హెచ్ఎం విజయకుమార్, మాజీ సర్పంచ్ గుమ్మడి భారతి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుమ్మికాపల్లి(కొత్తవలస రూరల్): వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలోని తుమ్మికాపల్లి, వియ్యంపేట, ఉత్తరాపల్లి, ముసిరాం గ్రామాల్లో వైద్యాధికారి వీవీబీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు.

కార్యక్రమంలో సర్పంచ్‌లు పిల్లా సన్యాసమ్మ, నీలంశెట్టి చిన్నంనాయుడు, చింతల రామయ్యమ్మ, పీహెచ్‌సీ చైర్మన్ పులిబంటి రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వేములాపల్లిలో ఎంఆర్ వ్యాక్సినేషన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే

నత్తే నయం..!

- ముందుకు సాగని గిరిజన బాలికల వసతిగృహం పనులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్, ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు
- మండిపడ్డ ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట: ఎస్.కోటలో నిర్మిస్తున్న బాలికల గిరిజన వసతిగృహ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ విద్యా సంవత్సరానికి దీనిని నిర్మించి ఇవ్వాలని ప్రజాప్రతినిధులు భావించారు. కానీ అందుకు అనుగుణంగా కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదు. ఈ పనులు పునాదులు, బేస్‌మెంట్ లెవెల్‌లోనే ఉన్నాయి. వచ్చే ఏడాదికి పూర్తయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మంగళవారం ఈ పనులను పరిశీలించారు. పనులు మందకొడిగా సాగడంపై మండిపడ్డారు. ఆమె వెళ్లిన సమయంలో పనులు పర్యవేక్షించాల్సిన అధికారులు అక్కడ లేరు. దీంతో ఆమెకు ఈ పనుల విలువ, ఏ సమయానికి పూర్తి చేయాలన్న సమాచారం ఇచ్చేవారు కరువయ్యారు. దీంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. ఆమె వెంట ఎంపీపీ రెడ్డి వెంకన్న, తహసీల్దార్ అరుణకుమారి, టీడీపీ మండల అధ్యక్షుడు జీఎస్ నాయుడు తదితరులు ఉన్నారు.


గిరిజన బాలికల వసతిగృహం పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ముమ్మరంగా పారిశుధ్య పనులు

వేపాడ : ఓబలయ్యపాలెంలో పారిశుధ్య పనులు మంగళవారం చేపట్టారు. ఉపాధి వేతనదారులతో కాలువల్లో పేరుకున్న చెత్త, చెదారాలను తొలగింపజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దివదారి దమయంతి, గ్రామ కార్యదర్శి పద్మ, వేతనదారులు పాల్గొన్నారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం..

శృంగవరపుకోట : తమ స్నేహితుడు జ్ఞాపకార్థం ఎస్.కోట రైల్వేకాలనీ వాసులు మంగళవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పలకలు, పుస్తకాలు, పెన్సిళ్లు అందించారు. మంగళవారం వారు మాట్లాడుతూ తమ మిత్రుడు పట్నాల చక్రధర్ మరణించి ఏడాది గడిచిన సందర్భంగా విద్యార్థులకు వీటిని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీవర్ధన్, సతీష్‌రెడ్డి, హరనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు అందిస్తున్నరైల్వేకాలనీ వాసులు


మాట్లాడుతున్న ఎంపీపీ రాజన్న

తల్లిపాల వారోత్సవాలు

కొత్తవలస: పుట్టిన వెంటనే పిల్లలకు తల్లి పాలను తప్పనిసరిగా ఇవ్వాలని ఎంపీపీ పి.రాజన్న, జడ్పీటీసీ సభ్యురాలు కోళ్ల రమణమ్మ సూచించారు. మంగళవారం కొత్తవలస ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలను పీవో ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీరు మాట్లాడుతూ తల్లి పాలను పిల్లలకు ఇస్తేనే వారు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం ఎం.రేవతి, పి.వేణుకుమార్, సీహెచ్ పరిమళకు బహుమతులనందజేశారు. కార్యక్రమంలో కొత్తవలస పీహెచ్‌సీ అధికారిణి టి.గాగ్రీదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు కోళ్ల వెంకటరమణ పాల్గొన్నారు.

వీరభద్రపురంలో స్వచ్ఛభారత్

వీరభద్రపురం(కొత్తవలస రూరల్): నరపాంలోని కోస్టల్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వీరభద్రపురంలో మంగళవారం స్వచ్ఛభారత్ పక్షాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పలు ప్రాంతాలను శుభ్రపరిచి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీఆర్‌కే నరసింహరాజు, గ్రామ ఉప సర్పంచ్ పీవీ రత్నాజీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.రవి, పీడీ అనురాధ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న కోస్టల్ విద్యార్థులు

సినిమాలు

శృంగవరపుకోట

శ్రీశ్రీనివాస------------గౌతమ్‌నంద
శ్రీవెంకటేశ్వర ------------------ఫిదా

కొత్తవలస

శ్రీజయ----------------------ఫిదా
శ్రీరాజా----------------గౌతమ్‌నంద
శ్రీలక్ష్మీనరసింహ-------------వాసుకి

జామి

జ్యోతి------------------గౌతమ్‌నంద

ఖైనీ, గుట్కాలు స్వాధీనం

మామిడిపల్లి (సాలూరు రూరల్): మామిడిపల్లిలో సాలూరు రూరల్ ఎస్.ఐ బి.గణేష్ పలు పాన్‌షాపులపై మంగళవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు పాన్‌షాపుల నుంచి 1500 రూపాయల విలువైన గుట్కా, ఖైనీలను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత గుట్కా, ఖైనీలను విక్రయానికి పాల్పడిన గౌరీశంకర్, బంగారురాజులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్.ఐ గణేష్ తెలిపారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం

సీడీపీవో ఉమాభారతి



పణుకువలసలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాచిపెంట: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని స్థానిక సీడీపీవో డి.ఉమాభారతి తెలిపారు. మంగళవారం మండలంలో గల పణుకువలస గ్రామంలో తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తల్లిపాలు ఆవశ్యకత గురించి వివరించారు. పణుకువలస అంగన్‌వాడీకి సంబంధించి న్యూట్రిషన్ గార్డెన్ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ ఆత్మకూరి సరోజిని మాజీ జడ్పీటీసీ మంచాల పారమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ, ఎన్ఆర్‌జీఈఎస్ టెక్నికల్ అసిస్టెంట్‌లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడం ఒక వరం

● టీడీపీ ఇన్‌చార్జి భంజ్‌దేవ్



రోగులకు భోజనం వడ్డిస్తున్న చైర్‌పర్సన్, భంజ్‌దేవ్

సాలూరు: పేదలకు సేవ చేసే అదృష్టం దక్కడం ఒక వరమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఆర్‌పి భంజ్‌దేవ్ అన్నారు. మంగళవారం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని టీడీపీ నేత, లారీ ఓనర్ల సంఘ అధ్యక్షుడు గొర్లె మాధవరావు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమాన్ని భంజ్‌దేవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గొర్లె విజయకుమారి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ వస్తున్న గిరిజనులకు భోజనం అందించేందుకు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా మాధవరావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో బాధపడుతూ రోజూ పదుల సంఖ్యలో రోగులు ఆస్పత్రిలో చేరుతున్నారన్నారు. పేదవర్గానికి చెందిన రోగులందరికీ మధ్యాహ్న భోజనం అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో కమిషనర్ ఎంఎం నాయుడు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీగిరాం కాలనీ రోడ్డు భూమి మాదే

సాలూరు రూరల్: జీగిరాం జూట్ కాలనీకి ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్న రోడ్డు తమ జిరాయితీ అని రైతులు వి.రామారావు, వి. రామకృష్ణ, వీఎస్ఆర్ఎస్ బాబులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రోడ్డు జిరాయితీ అని తమకు అనుకూలంగా నవంబర్ 8, 2011లో తీర్పు వచ్చిందన్నారు. జీగిరాం జూట్ కాలనీకి రోడ్డు వీటీసి నుంచి వేయడానికి స్థలం ఉందన్నారు. అయినా తమ భూమిని ఆక్రమించి రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఈ రోడ్డు రైతు జిరాయితీ అని తెలిసినప్పటికీ తమ వ్యక్తిగత లబ్ధి, రాజకీయ సౌలభ్యం కోసం కొందరు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఆక్రమణకు గురైన రోడ్డుకు పైభాగంలో దున్నడానికి వెళ్లితే కొందరు అడ్డుకున్నారన్నారు. తమ జిరాయితీ అయినా పలువురు దౌర్జన్యంగా వ్యవహరిస్తుండడంతో చేసేది లేక నిష్క్రమించామన్నారు.

ఎంఆర్ వ్యాక్సిన్ ప్రారంభం

● అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం
● మున్సిపల్ చైర్‌పర్సన్ విజయకుమారి



ఎంఆర్ వాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్



పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న వైద్యాధికారి లక్ష్మి

సాలూరు: అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ గొర్లె విజయకుమారి అన్నారు. మంగళవారం పట్టణంలోని మహంతివీధి స్కూల్‌లో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. పిల్లలకు మీజిల్స్, రుబెల్లా టీకాలను వైద్యులు సురేష్ చంద్రదేవ్ వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 9 నెలల నుంచి 15ఏళ్లలోపు వయసు కలిగిన పిల్లలందరికీ ఎంఆర్ టీకా తప్పనిసరిగా వేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో టీకా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.ఎం.నాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తోణాం (సాలూరు రూరల్): తోణాం గిరిజన ఆశ్రమ పాఠశాలలో వైద్యాధికారి రోణంకి స్వాతి మంగళవారం విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేశారు. తోణాంలో 601 మందికి వ్యాక్సిన్ వేయడానికి లక్ష్యంగా నిర్ణయించగా 512 మందికి వేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బెల్లాన శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : మక్కువ మండలంలో పలు పాఠశాలల్లో ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. శంబర జడ్పీ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి జ్యోతి ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఆర్ వ్యాక్సిన్ చిన్నారుల ఆరోగ్యానికి రక్ష అని తెలిపారు. కార్యక్రమంలో శంబర పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ తీళ్ల పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట: ప్రాణాంతకమైన మీజిల్స్, రుబెల్లా రెండింటికి సంబంధించిన వ్యాక్సిన్‌ను స్థానిక పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం 1776 మందికి వేశారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి పీవీ లక్ష్మి పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాక్సిన్‌ను 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు గల పిల్లలకు తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తోణాంలో వ్యాక్సిన్‌ను ప్రారంభిస్తున్న వైద్యాధికారి స్వాతి

ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడులు

● సాలూరు ఏవో వెంకటయ్య



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణనిస్తున్న ఏవో

సాలూరు రూరల్: ప్రకృతి వ్యవసాయం వల్ల అధిక దిగుబడులతో పాటు పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని సాలూరు మండల వ్యవసాయాధికారి వి. వెంకటయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మామిడిపల్లిలో ఆయన ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల రసాయనిక అవశేషాలు ఉండవన్నారు. భూసారం తగ్గదన్నారు. రసాయనిక ఎరువులు అధిక మోతాదులో వినియోగించడం వల్ల పర్యావరణ దుష్ఫలితాలతో పాటు తినేవారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నా యన్నారు. అందువల్ల పంట సాగులో ద్రవ జీవామృతం, ఘన జీవామృతం వాడాలన్నారు. కార్య క్రమంలో కోడికాళ్ల ఎరకయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖరాసవలసలో వరినాట్లు క్రమ పద్ధతిలో నాటాలని రైతులకు అవగాహన కల్పించారు. దీని వల్ల చీడపీడలు తగ్గుతాయన్నారు. సస్యరక్షణ చర్యలకు వీలుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైతు సుతాపల్లి గోవిందరావు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



స్పోర్ట్స్ మెటీరియల్‌ను అందజేస్తున్న దృశ్యం

విద్యతో పాటు క్రీడల్లో తర్ఫీదునివ్వండి

● పాచిపెంట ఎంఈవో జోగారావు

పాచిపెంట: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లో తర్ఫీదునివ్వాలని పాచిపెంట ఎంఈవో పల్లి జోగారావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పాఠశాలలకు స్పోర్ట్స్ మెటీరియల్, కంచాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా చాలా అవసరమన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. ఉపాధ్యాయులు మండల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పిన్నింటి ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఎంఐఎస్, ఎల్డీఏ తదితరులు పాల్గొన్నారు.

సురాపాడు ఆనకట్ట నీరు విడుదల



నీరు విడుదల చేస్తున్న తిరుపతిరావు తదితరులు

సురాపాడు (సాలూరు రూరల్): రైతులకు సాగునీరందించడానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని మక్కువ మండల జన్మభూమి కమిటీ సభ్యుడు పెంట తిరుపతిరావు అన్నారు. మంగళవారం సురాపడు ఆనకట్ట నుంచి సాగునీరు ఇరిగేషన్ ఈఈ కె.రమణమూర్తితో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు సకాలంలో సాగునీరం దించడమే లక్ష్యమన్నారు. ఇప్పటికే వెంగళరాయ సాగర్ ఆనకట్ట ద్వారా రైతులకు సాగునీరందించడం జరిగిందన్నారు. మండలంలో రైతులందరికీ మేలు చేకూర్చడమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రైతు పక్షపాతి అన్నారు. రైతు లకు ప్రయోజనాలు కల్పించేందుకే తామంతా కృషి చేస్తున్నా మన్నారు. సురాపాడు ఆనకట్ట ద్వారా 1800 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో డీఈ నాగేశ్వరరావు, శంబర పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ తీళ్ల పోలినాయుడు, సురాపాడు ఆనకట్ట చానల్ చైర్మన్ చిన్నప్ప, చొక్కాపు బుచ్చినా యుడు, రైతు కూలీ సంఘం నేత వర్మ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సమాచారం

శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ పరిధిలో గత నెల 24న గ్యాస్ బుక్ చేసుకున్న సాలూరు పట్టణం, మామిడిపల్లి, పాచిపెంట వినియోగదారులకు బుధవారం గ్యాస్ సరఫరా చేస్తారు.


విద్యార్థినికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్యురాలు

విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్లు

విజయనగరం టౌన్: విజయనగరం పట్టణ పరిధిలోని గాజులరేగ పాఠశాలలో విద్యార్థులకు తట్టు, రుబేల్లా వ్యాధులకు వ్యాక్సిన్‌ను మంగళవారం రాకోడు పీహెచ్‌సీ వైద్యురాలు పి.పావని వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల తట్టు వ్యాధి రాదన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వీవీఆర్‌ఎం రాజు, ప్రభాకరరావు, చిన్నారావు, ఏఎన్ఎం జె.లీలా, ఆశావర్కర్ పైడిరాజు, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ పాల్గొన్నారు.

నగరంలో భారీ వర్షం

● సేదదీరిన పట్టణవాసులు ● లోతట్టు ప్రాంతాలు జలమయం ● నిలిచిన వ్యాపారాలు

విజయనగరం టౌన్: విజయనగరం పట్టణంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. గతమూడు రోజులుగా పట్టణంలో వేసవిని తలపించేలా ఎండలు ఉండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. మంగళవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. మధ్యాహ్నం ఒంటిగంట తరువాత పరిస్థితిలో ఒక్కసారిగా మార్పు కనిపించింది. ఆకాశం మేఘావృతమైంది. కొద్దిసేపటికే భారీవర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు సేదదీరారు. వర్షానికి పట్టణంలో రోడ్లమీద వున్న బురదంతా కొట్టుకుపోయింది. కొన్ని ప్రాంతాల్లో కాలువల్లో పూడిక తీయకపోవడం వల్ల వర్షం, మురుగునీరు రోడ్డెక్కింది. చిన మార్కెట్, పెద్దమార్కెట్‌తో పాటు, శివారులోని లోతట్టు ప్రాంతాలు బురదమయమైంది. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, మున్సిపల్ కార్యాలయంతో పాటు పలు ప్రాంతాల్లో వర్షం నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. కాలీఘాట్ కాలనీ, పద్మావతినగర్, పూల్‌బాగ్ కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీతోపాటు పలు కాలనీల్లో వర్షం నీరు రోడ్లపై ప్రవహించింది. బీసెంట్ స్కూల్ రోడ్డు, బుచ్చెన్నకోనేరు నుంచి గాజులరేగకు వెళ్లే రహదారి బురదగా మారింది.


విజయనగరంలో వర్షం పడుతున్న దృశ్యం


తడుస్తూ రిక్షా లాగుతున్న కార్మికుడు

ఫుట్‌పాత్ వ్యాపారుల ఇక్కట్లు

మంగళవారం విజయనగరం మార్కెట్‌కు సెలవు కావడంతో షాపులు మూసివేశారు. ఈ ఒక్కరోజు ఫుట్‌పాత్ వ్యాపారం ఎక్కువగా ఉంటుంది. వివిధ ప్రాంతాల నుంచి ఫుట్‌పాత్ వ్యాపారులు ప్రధాన రహదారుల్లో వస్త్రాలు, తదితర వస్తువులను ఉంచి విక్రయాలు చేస్తుంటారు. వర్షం కారణంగా తోపుడు బళ్లు, ఫుట్‌పాత్ వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.


గ్రీవెన్స్‌సెల్‌లో వినతులు పరిశీలిస్తున్న చైర్మన్ రామకృష్ణ

సమస్యల పరిష్కారానికి కృషి

● మున్సిపల్ చైర్మన్ రామకృష్ణ

విజయనగరం టౌన్: మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌సెల్‌లో వచ్చిన వినతుల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ రామకృష్ణ చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి పలు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతులు త్వరితగతిన పరిష్కరించేలా చూస్తామన్నారు. మూడేళ్ల కాలంలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. పట్టణంలో పార్కుల నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పారు. కాలువలు, కల్వర్టులు, రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూస్తున్నామని చెప్పారు. మున్సిపాలిటీల్లో ఏమైనా సమస్యలు ఉంటే గ్రీవెన్స్‌సెల్ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బంగారునాయుడుకు డాక్టరేట్


బంగారునాయుడును అభినందిస్తున్న వేదిక ప్రతినిధులు

దాసన్నపేట: గంట్యాడ గ్రామానికి చెందిన సుంకరి బంగారునాయుడుకు ఆంధ్రాయూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. మంగళవారం తూర్పుకాపు సామాజిక వేదిక ప్రతినిధులు పట్టణంలోని వేదిక కార్యాలయంలో బంగారునాయుడుకు సన్మానించారు. ఈ సందర్భంగా వేదిక జిల్లా అధ్యక్షుడు గొర్లె వెంకటరమణ మాట్లాడుతూ తూర్పుకాపులు అన్ని రంగాల్లోను అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు మజ్జి అప్పారావు, పిన్నింటి సూర్యనారాయణ, ముదిలి తరుణవాంకుశం, నాగభూషణం, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి

దాసన్నపేట: పేద, బడుగు, బలహీన వర్గాలకు సేవ చేస్తే ఆత్మసంతృప్తి కలుగుతుందని విజయనగరం కల్కిసేవా సమితి ప్రతినిధి బోనికుమార్ అన్నారు. మంగళవారం సమితి సభ్యులు నెల్లిమర్ల మండలంలోని సతివాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా బోని కుమార్ మాట్లాడుతూ కల్కి సేవా సమితి ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు బి.ఛాయా, హైమా, పార్వతీమణి, మల్లికార్జునరావు, మల్లీ, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినికి నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మహిళా సంక్షేమానికి పెద్దపీట


మాట్లాడుతున్న శ్రీవాణి

● మహిళా కమిషన్ సభ్యురాలు శ్రీవాణి

విజయనగరం టౌన్: మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మహిళా కమిషన్ సభ్యురాలు కొయ్యాన శ్రీవాణి అన్నారు. ఉత్తరాంధ్ర స్థాయి టీడీపీ శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా ద్వారపూడిలో మంగళవారం ఇచ్చిన శిక్షణా శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. 2019లో టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని తెలిపారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నదని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. 9నెలల నుంచి 15ఏళ్ల పిల్లలకు సంబంధించి తట్టు, రుబెల్లా వ్యాధులు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక టీకాల కార్యక్రమం చేపడుతుందన్నారు. కార్యకర్తలు తమ, తమ ప్రాంతాల్లోవున్న వారిని ఈ టీకాలు వేయించుకునేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర శిక్షణ కార్యక్రమాల ఇన్‌చార్జి కలిశెట్టి అప్పలనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'గడప గడపకూ బీజేపీ'కి విశేష స్పందన

●పార్టీ పట్టణ అధ్యక్షుడు అచ్చిరెడ్డి

●వైఎస్ఆర్ నగర్‌లో కరపత్రాలతో ప్రచారం

దాసన్నపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు గడప గడపకూ బీజేపీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని పార్టీ పట్టణ అధ్యక్షుడు సత్తి అచ్చిరెడ్డి చెప్పారు. మంగళవారం పట్టణంలోని ఒకటో వార్డు పరిధిలోని వైఎస్ఆర్ నగర్‌లో గడపగడపకూ బీజేపీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి పథకాలపై కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రధాని అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. పేదోడికి సొంతింటి కలను నిజం చేస్తున్నారన్నారు. చిరువ్యాపారులకు రుణాలు మంజూరు చేసి వారిని అభివృద్ధి చెందేలా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. రైతులు, మహిళలు, వృద్ధుల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. అమృత్ నిధులతో మున్సిపాలిటీ అభివృద్ధి చేస్తున్నారన్నారు. వార్డుల్లో సమస్యలు తెలియజేస్తే వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి, పి.అశోక్, కుసుమంచి సుబ్బారావు, ప్రమీళారాణి, రమేష్, సతీష్, సంతోష్‌కుమార్, చాంద్, సుదీర్, రాంబాబు, కూర్మారావు, ప్రసాద్, దేవి, రంజిత్, శర్మ, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

సినిమా గైడ్

విజయనగరం

ఆదిత్య	: ఏజెంట్ భైరవ
శ్రీకృష్ణ	: కావేరి
న్యూపూర్ణ	: గౌతమ్‌నంద
రంజని	: ఫిదా
శివరంజని	: నిన్ను కోరి
హిమగిరి	: గౌతమ్‌నంద
సప్తగిరి	: వైశాఖం
లీలామహల్	: మాయామాల్
ఎన్‌సీఎస్	: వాసుకి

ఎన్‌సీఎస్ ఐనాక్స్

స్క్రీన్-1, స్క్రీన్-2, స్క్రీన్-3
నిన్నుకోరి, శమంతకమణి, జగ్గా జాసూస్, వార్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ఏప్స్, పటేల్‌సార్, గౌతమ్‌నంద

సమాచారం

గ్యాస్ ఏజెన్సీ ఫోన్ నంబర్లు

సాయి ఏజెన్సీ	08922-234523
ఎన్‌సీఎస్‌ఏజెన్సీ	08922- 224177, 233578
ఎన్‌వీఆర్ ఏజెన్సీ	08922-225810
శ్రీనివాసా ఏజెన్సీ	08922-224301, 285288

ఆర్టీసీ సమాచారం

విచారణ కేంద్రం	08922 225333
ఫిర్యాదుల విభాగం	7382923726
అడ్వాన్స్ బుకింగ్	08922 234911
టోల్‌ఫ్రీ నంబరు	1800 200 4599

ఎమర్జన్సీ సర్వీసెస్

పోలీస్	100
ఫైర్	101
ఆపద సమయాల్లో	108
బాలల సంరక్షణ కోసం	1098
కేంద్రాసుపత్రి అంబులెన్స్	08922 272124
ఘోషాసుపత్రి అంబులెన్స్	8008553401

రైతుబజారు ధరలు

కూరగాయలు	కిలో (రూ)
టమోటా (దేశవాళీ)	42-00
టమోటా(హైబ్రిడ్)	40-00
వంకాయలు	27-00
బీరకాయలు	18-00
బెండకాయలు	17-00
కాకర కాయలు	23-00
క్యాబేజీ	18-00
గోరు చిక్కుడు	22-00
దొండకాయలు	27-00
క్యారెట్	28-00
బీట్‌రూట్	25-00
ఉల్లిపాయలు	11-00
బంగాళదుంపలు	13-00
అల్లం	55-00
పచ్చిమిర్చి	45-00
క్యాప్సికమ్	50-00
కీర దోస	20-00

బంగారం ధరలు

24క్యారెట్లు (10 గ్రాములు)	29,200-00
22 క్యారెట్లు	27,300-00
వెండి కిలో	39,900-00

ఎంఆర్ వ్యాక్సిన్ వేయించండి

జామి: తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థినీ విద్యార్థులకు భవిష్యత్‌లో తట్టు, రుబెల్లా వ్యాధులు రాకుండా ఎంఆర్ వ్యాక్సిన్లు వేయించుకోవాలని ఏఎన్‌ఎం కె.ముత్యాలమ్మ అన్నారు. మంగళవారం జామిలోని బాపు పాఠశాలలో 417 మంది విద్యార్థులకు ఈ వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛ పరిశుభ్రతలో భాగస్వాములు కండి

● 15 వరకు పక్షోత్సవాలు ● ఎంఆర్ పీజీ కళాశాల డైరెక్టర్ భాస్కరరెడ్డి

దాసన్నపేట: స్వచ్ఛభారత్ పరిశుభ్రత పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎంఆర్ పీజీ కళాశాల డైరెక్టర్ భాస్కరరెడ్డి అన్నారు. మంగళవారం పూల్‌బాగ్‌లోని ఎంఆర్ పీజీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో స్వచ్ఛ పరిశుభ్రత పక్షోత్సవాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛ పరిశుభ్రతలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపుమేరకు కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. వలంటీర్లు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. కళాశాల ఆవరణతో పాటు చుట్టుపక్కల ఉన్న మురికివాడలు శుభ్రంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి కె.రమణయ్య, వ్యాయామ సంచాలకుడు కె.సత్యనారాయణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట రూరల్: స్వచ్ఛభారత్ కార్యక్రమం సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపీడీవో జె.మన్మధరావు అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన పారిశుధ్య పనులను ఏపీవో చినప్పయ్య పరిశీలించారు. ఈ పనుల్లో పాల్గొన్న ఉపాధి వేతనదారులకు స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పించారు. అనంతరం కిల్తంపాలెం పంచాయతీ కార్యాలయంలో వేతనదారులకు ఆధార్‌సీడింగ్‌పై ఏపీవో వివరించారు.

దివ్యాంగుల పాఠశాలలో మౌలిక వసతుల కల్పన

జామి: ప్రభుత్వం దివ్యాంగులకు అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్నదని ఐఆర్‌టీ ఉపాధ్యాయులు నారాయణరావు, దేవి అన్నారు. మంగళవారం జామిలోని అంబేద్కర్‌నగర్ పాఠశాలలో దివ్యాంగుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠ శాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. సమావేశంలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నారుమళ్లపై పేడ నీరు చల్లి కాపాడుకోండి

వేపాడ: నారుమళ్లు, నాట్లను ఒకరోజు మురగబెట్టిన పేడ నీటిని చల్లి నీటిఎద్దడి నుంచి కాపాడుకోవచ్చని మండల వ్యవసాయాధికారిణి శిరీష సూచించారు. మంగళవారం ఆమె ఓభలయ్యపాలెం, ముకుందపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

● జడ్పీ సీఈవో అనిత

విజయనగరం రూరల్: పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించినట్టయితే వ్యాధులు దరిచేరవని జడ్పీ సీఈవో ఎస్‌డీ అనిత అన్నారు. దోమలపై దండయాత్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం దుప్పాడలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ర్యాలీ చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమలో జడ్పీ సీఈవో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బహిరంగ మలవిసర్జనకు స్వస్తి పలకాలన్నారు. మరుగుదొడ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఈ నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని చెప్పారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోకపోవడం వల్ల దోమలు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. కాలువల్లో చెత్తను వేయకూడదని, పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. వైద్యసిబ్బంది గ్రామాల్లో పర్యటించి గ్రామస్థులకు వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కెంగువ ధనలక్ష్మి, ఎంపీడీవో శ్రీరామ్మూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు భూలక్ష్మి, టీడీపీ నాయకుడు రాజు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఈవో అనిత

ఆధ్యాత్మిక సమాచారం

4న గజలక్ష్మికి పంచామృతాభిషేకాలు

దాసన్నపేట: భారతీయ తత్త్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో గల అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 4వ తేదీ ఉదయం గజలక్ష్మికి పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నామని ఆయం ధర్మకర్త దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం సహస్ర దీపాలంకరణ, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

అభయాంజనేయునికి సింధూర పూజలు

దాసన్నపేట: ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామానారాయణంలో మంగళవారం ఉదయం 8గంటలకు అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ప్రధాన అర్చకులు నాగవర్ధన్ ఆధ్వర్యంలో వేదపండితులు మంగళాశాసనాలతో సింధూరం, తమలపాకులతో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పూజల్లో ఎన్‌సీఎస్ ట్రస్ట్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాస్, నీరజావల్లి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతం

రింగురోడ్డు: దాసన్నపేటలోని ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతం చేశారు. కమలాకరావు, జగదాంబ దంపతులు హోమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆలవెల్లి రామాచార్యులు, ఈవో బి.ఎల్.నగేష్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో నగేష్ మాట్లాడుతూ ఈ హనుమత్ హోమం, వ్రతం చేయడం వల్ల నరదృష్టి, శత్రుబాధలు తొలగిపోతాయన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

జామి: టెన్త్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని హెచ్‌ఎం ముత్యం తెలిపారు. మంగళవారం జామి ఉన్నత పాఠశాల హెచ్‌గా ముత్యం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఉపాధ్యాయులు, విద్యాకమిటీ, తల్లిదండ్రుల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

మంగళపాలెం(కొత్తవలస రూరల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ డీజీపీ జేవీ రాముడు 63వ జన్మదినోత్సవం సందర్భంగా అనంతపురం జిల్లా బత్తేలపల్లి మండలంలోని ఆయన స్వగ్రామం నారసింగపల్లిలో 120 మంది దివ్యాంగులకు మంగళవారం ఉపకరణాలను పంపిణీ చేసినట్లు మంగళపాలెంనకు చెందిన శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు తెలిపారు. 250 దివ్యాంగులు శిబిరానికి హాజరయ్యారన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

జామి: మండలంలోని కుమరాం మోడల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బదిలీ ఉపాధ్యాయురాలు అనురాధకు హెచ్‌ఎం శర్మ, ఉపాధ్యాయులు సన్మానించి వీడ్కోలు పలికారు. అలాగే మండలంలోని బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఆయా పాఠశాలల్లో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నా

● ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

శృంగవరపుకోట రూరల్: ప్రజాసంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నామని శృంగవరపుకోట శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి అన్నారు. మంగళవారం ఎస్.కోట మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. పెదఖండేపల్లి గ్రామంలోని వెలమల కళ్లాల్లో రూ.20లక్షలతో నిర్మించిన రక్షిత నీటి పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే గిరిజన గ్రామం లచ్చందొరపాలెం రహదారిలో వెలుగు ఏపీఎం తమటాపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకుసాగుతున్నామని చెప్పారు. గ్రామాల్లో ఎమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి వెంకన్న, జడ్పీటీసీ సభ్యుడు సుకూరు రామలక్ష్మి, సర్పంచ్ యాళ్ల రమణ, బొడ్డవర సర్పంచ్ తిరుమలరాజు పద్మావతి, కొత్తవలస మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షురాలు ఇందుకూరి సావిత్రమ్మ, వేములాపల్లి సర్పంచ్ లగుడు శ్రీనువాసరావు, ఎంపీటీసీ సభ్యుఆలు మతల లక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు జీఎస్ నాయుడు, టీడీపీ నాయకులు కొణదాం మల్లేశ్వరరావు, రాయవరపు చంద్రశేఖర్, అడారి అప్పారావు, ఇందుకూరి శ్రీనువాస రాజు, ఎంపీడీవో జె.మన్మధరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యకిశోర్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే లలిత కుమారి, తదితరులు



విద్యార్థినులను అభినందిస్తున్న ఆర్‌ఎస్ అకాడమీ డైరెక్టర్

సీఏ ఫలితాల్లో ఆర్‌ఎస్ విద్యార్థుల ప్రతిభ

దాసన్నపేట: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్సు సమీపంలో ఉన్న ఆర్‌ఎస్ అకాడమీ విద్యార్థులు మంగళవారం ప్రకటించిన సీఏ, ఐపీసీసీ ఫలితాల్లో ప్రతిభను కనబరిచారు. ఆలిండియా లెవల్‌లో 22శాతం ఉత్తీర్ణత సాధించగా, ఆర్‌ఎస్ అకాడమీ విద్యార్థులు 55 శాతం ఉత్తీర్ణులయ్యారు. జి.కుమిదిని, ఎం.సాయి, ప్రశాంతి, కె.విష్ణుప్రియలు అత్యధిక మార్కులు సాధించారు. వీరిని కళాశాల డైరెక్టర్ అంట్యాకుల రమేష్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

విద్యార్థులకు దుస్తుల అందజేత

విజయనగరం రూరల్: స్టేట్‌బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక మహిళా ప్రాంగణంలో ఉన్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ప్రతినిధులు మంగళవారం విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ టి.ఫణికుమార్ మాట్లాడుతూ బ్యాంకింగ్, స్వయం ఉపాధి శిక్షణలే కాకుండా నిరుపేద విద్యార్థులకు దుస్తుల పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది వై.వర్మ, వి.హర్ష, కె.నర్సింగరావు, ఎస్.కిరణ్, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్లు


విద్యార్థినికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్యురాలు

విజయనగరం టౌన్: విజయనగరం పట్టణ పరిధిలోని గాజులరేగ పాఠశాలలో విద్యార్థులకు తట్టు, రుబెల్లా వ్యాధులకు వ్యాక్సిన్‌ను మంగళవారం రాకోడు పీహెచ్‌సీ వైద్యురాలు పి.పావని వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల తట్టు వ్యాధి రాదన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వీవీఆర్ఎం రాజు, ప్రభాకరరావు, చిన్నారావు, ఏఎన్ఎం జె.లీలా, ఆశావర్కర్ పైడిరాజు, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ పాల్గొన్నారు.


గ్రీవెన్స్‌సెల్‌లో వినతులు పరిశీలిస్తున్న చైర్మన్ రామకృష్ణ

సమస్యల పరిష్కారానికి కృషి

● మున్సిపల్ చైర్మన్ రామకృష్ణ

విజయనగరం టౌన్: మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌సెల్‌లో వచ్చిన వినతుల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ రామకృష్ణ చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి పలు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతులు త్వరితగతిన పరిష్కరించేలా చూస్తామన్నారు. మూడేళ్ల కాలంలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. పట్టణంలో పార్కుల నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పారు. కాలువలు, కల్వర్టులు, రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూస్తున్నామని చెప్పారు. మున్సిపాలిటీల్లో ఏమైనా సమస్యలు ఉంటే గ్రీవెన్స్‌సెల్ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బంగారునాయుడుకు డాక్టరేట్


బంగారునాయుడును అభినందిస్తున్న వేదిక ప్రతినిధులు

దాసన్నపేట: గంట్యాడ గ్రామానికి చెందిన సుంకరి బంగారునాయుడుకు ఆంధ్రాయూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. మంగళవారం తూర్పుకాపు సామాజిక వేదిక ప్రతినిధులు పట్టణంలోని వేదిక కార్యాలయంలో బంగారునాయుడుకు సన్మానించారు. ఈ సందర్భంగా వేదిక జిల్లా అధ్యక్షుడు గొర్లె వెంకటరమణ మాట్లాడుతూ తూర్పుకాపులు అన్ని రంగాల్లోను అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు మజ్జి అప్పారావు, పిన్నింటి సూర్యనారాయణ, ముదిలి తరుణవాంకుశం, నాగభూషణం, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి

దాసన్నపేట: పేద, బడుగు, బలహీన వర్గాలకు సేవ చేస్తే ఆత్మసంతృప్తి కలుగుతుందని విజయనగరం కల్కిసేవా సమితి ప్రతినిధి బోనికుమార్ అన్నారు. మంగళవారం సమితి సభ్యులు నెల్లిమర్ల మండలంలోని సతివాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా బోని కుమార్ మాట్లాడుతూ కల్కి సేవా సమితి ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు బి.ఛాయా, హైమా, పార్వతీమణి, మల్లికార్జునరావు, మల్లీ, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినికి నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నగరంలో భారీ వర్షం

● సేదదీరిన పట్టణవాసులు ● లోతట్టు ప్రాంతాలు జలమయం ● నిలిచిన వ్యాపారాలు

విజయనగరం టౌన్: విజయనగరం పట్టణంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. గతమూడు రోజులుగా పట్టణంలో వేసవిని తలపించేలా ఎండలు ఉండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. మంగళవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. మధ్యాహ్నం ఒంటిగంట తరువాత పరిస్థితిలో ఒక్కసారిగా మార్పు కనిపించింది. ఆకాశం మేఘావృతమైంది. కొద్దిసేపటికే భారీవర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు సేదదీరారు. వర్షానికి పట్టణంలో రోడ్లమీద వున్న బురదంతా కొట్టుకుపోయింది. కొన్ని ప్రాంతాల్లో కాలువల్లో పూడిక తీయకపోవడం వల్ల వర్షం, మురుగునీరు రోడ్డెక్కింది. చిన మార్కెట్, పెద్దమార్కెట్‌తో పాటు, శివారులోని లోతట్టు ప్రాంతాలు బురదమయమైంది. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, మున్సిపల్ కార్యాలయంతో పాటు పలు ప్రాంతాల్లో వర్షం నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. కాళీఘాట్ కాలనీ, పద్మావతినగర్, పూల్‌బాగ్ కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీతోపాటు పలు కాలనీల్లో వర్షం నీరు రోడ్లపై ప్రవహించింది. బీసెంట్ స్కూల్ రోడ్డు, బుచ్చెన్నకోనేరు నుంచి గాజులరేగకు వెళ్లే రహదారి బురదగా మారింది.


విజయనగరంలో వర్షం పడుతున్న దృశ్యం


తడుస్తూ రిక్షా లాగుతున్న కార్మికుడు

ఫుట్‌పాత్ వ్యాపారుల ఇక్కట్లు

మంగళవారం విజయనగరం మార్కెట్‌కు సెలవు కావడంతో షాపులు మూసివేశారు. ఈ ఒక్కరోజు ఫుట్‌పాత్ వ్యాపారం ఎక్కువగా ఉంటుంది. వివిధ ప్రాంతాల నుంచి ఫుట్‌పాత్ వ్యాపారులు ప్రధాన రహదారుల్లో వస్త్రాలు, తదితర వస్తువులను ఉంచి విక్రయాలు చేస్తుంటారు. వర్షం కారణంగా తోపుడు బళ్లు, ఫుట్‌పాత్ వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట


మాట్లాడుతున్న శ్రీవాణి

● మహిళా కమిషన్ సభ్యురాలు శ్రీవాణి

విజయనగరం టౌన్: మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మహిళా కమిషన్ సభ్యురాలు కొయ్యాన శ్రీవాణి అన్నారు. ఉత్తరాంధ్ర స్థాయి టీడీపీ శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా ద్వారపూడిలో మంగళవారం ఇచ్చిన శిక్షణ శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. 2019లో టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని తెలిపారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నదని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. 9నెలల నుంచి 15ఏళ్ల పిల్లలకు సంబంధించి తట్టు, రుబెల్లా వ్యాధులు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక టీకాల కార్యక్రమం చేపడుతుందన్నారు. కార్యకర్తలు తమ, తమ ప్రాంతాల్లోవున్న వారిని ఈ టీకాలు వేయించుకునేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర శిక్షణ కార్యక్రమాల ఇన్‌చార్జి కలిశెట్టి అప్పలనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'గడప గడపకూ బీజేపీ'కి విశేష స్పందన

● పార్టీ పట్టణ అధ్యక్షుడు అచ్చిరెడ్డి

● వైఎస్ఆర్ నగర్‌లో కరపత్రాలతో ప్రచారం

దాసన్నపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు గడప గడపకూ బీజేపీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని పార్టీ పట్టణ అధ్యక్షుడు సత్తి అచ్చిరెడ్డి చెప్పారు. మంగళవారం పట్టణంలోని ఒకటో వార్డు పరిధిలోని వైఎస్ఆర్ నగర్‌లో గడపగడపకూ బీజేపీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి పథకాలపై కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రధాని అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. పేదోడికి సొంతింటి కలను నిజం చేస్తున్నారన్నారు. చిరువ్యాపారులకు రుణాలు మంజూరు చేసి వారిని అభివృద్ధి చెందేలా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. రైతులు, మహిళలు, వృద్ధుల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. అమృత్ నిధులతో మున్సిపాలిటీ అభివృద్ధి చేస్తున్నారన్నారు. వార్డుల్లో సమస్యలు తెలియజేస్తే వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భవిరెడ్డి శివప్రసాదరెడ్డి, పి.అశోక్, కుసుమంచి సుబ్బారావు, ప్రమీలారాణి, రమేష్, సతీష్, సంతోష్‌కుమార్, చాంద్, సుధీర్, రాంబాబు, కూర్మారావు, ప్రసాద్, దేవి, రంజిత్, శర్మ, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

సినిమా గైడ్

విజయనగరం

ఆదిత్య	: ఏజెంట్ భైరవ
శ్రీకృష్ణ	: కావేరి
న్యూపూర్ణ	: గౌతమ్‌నంద
రంజని	: ఫిదా
శివరంజని	: నిన్ను కోరి
హిమగిరి	: గౌతమ్‌నంద
సప్తగిరి	: వైశాఖం
లీలామహల్	: మాయామాల్
ఎస్‌సీఎస్	: వాసుకి

ఎస్‌సీఎస్ ఐనాక్స్

స్క్రీన్-1, స్క్రీన్-2, స్క్రీన్-3

నిన్నుకోరి, శమంతకమణి, జగ్గా జాసూస్, వార్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ఏప్స్, పటేల్‌సార్, గౌతమ్‌నంద